RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

27 జూన్ 2025 శుక్రవారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:24



# తెలంగాణ మాదక ద్రవ్యాల మహమ్మారికి అడ్డాగా మారకూడదన్న లక్ష్యంతో (Eagle)





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** ఒకనాటి ఉద్యమాల గడ్డ తెలంగాణ మాదక ద్రవ్యాల మహమ్మారికి అడ్డాగా మారకూడదన్న లక్ష్యంతో ఇకనుంచి రాష్ట్రంలో ఒక మొక్క గంజాయి మెలిచినా ఇట్టే కనిపెట్టే "Elite Action Group For Drug Law Enforcement (Eagle) ను ఏర్పాటు చేసినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంతో పోటీ పడే ఒక ఆరోగ్యకరమైన, మాదక ద్రవ్య రహిత తెలంగాణను నిర్మించుకోవడంలో ప్రభుత్వ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" పురస్కరించుకుని తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో (TG ANB), తెలంగాణ వికలాంగులు, సీనియర్ సిటిజన్ల మరియు లింగమార్పిడి వ్యక్తుల సాధికారత శాఖ సంయుక్తంగా శిల్పకళా వేదిక ప్రాంగణంలో డ్రగ్స్ నియంత్రణపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

"తెలంగాణలో ఒకనాడు ఉద్యమాలకు వేదికలైన కాలేజీలు, యూనివర్సిటీలు గంజాయి, మాదక ద్రవ్యాలకు వేదిక అయితే అది అందరికీ అవమానం. యువకులు డ్రగ్స్ బారిన పడి బలవుతున్నారు. డ్రగ్స్ నియంత్రించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి. పాఠశాల, కాలేజీల్లో ఎక్కడైనా సరే దీనికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే తెలియజేయండి.

తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో విద్యార్థులను స్కూళ్లు, కాలేజీల్లో చేర్పిస్తుంటే, కేవలం చదువు చెబితే చాలన్నట్టు యాజమాన్యాలు, అధ్యాపకులు భావించడం సరికాదు. వాటిని నియంత్రించడంలో యాజమాన్యాలకు కూడా బాధ్యత ఉంటుంది.

కాలేజీల్లో డ్రగ్స్ ఆనవాళ్లు దొరికితే ఇక నుంచి వాటి యాజమాన్యాలపైన కూడా కేసులు నమోదు చేయండి. యాజమాన్యాలు, అధ్యాపకులు విద్యార్థినీ విద్యార్థుల నడవడికను కూడా గమనించాల్సి ఉంటుంది. డ్రగ్స్ నియంత్రణపై పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాలతో నార్కోటిక్స్ బ్యూరో ఒక సమావేశం నిర్వహించాలి.

140 కోట్ల జనాభా ఉన్న భారత దేశంలో 68 శాతం యువత ఉంది. ఐటీతో సహా అన్ని రంగాల్లో దేశం ముందుకు వెళుతుంటే దెబ్బతీయడానికి, దేశాన్ని నిర్వీర్యం చేయడానికి ఇలాంటి డ్రగ్స్ మహమ్మారితో యువతను బలిగొనే కుట్రలు జరుగుతున్నాయి. దేశ రక్షణలో ముందు వరుసలో నిలుచున్న పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల్లో డ్రగ్స్ భారిన పడి యువత నిర్వీర్యమైపోతోంది.

డ్రగ్స్‌తో ఎవరైనా తెలంగాణ కాలు పెట్టాలంటే వందసార్లు ఆలోచించాలి. ఒక గడ్డి పరకైనా రాష్ట్రంలో అడుగుపెట్టినా వెన్ను విరుస్తాం. ఐటీ హబ్‌గా, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ గంజాయికో, డ్రగ్స్ హబ్‌గా మారితే మనమంతా విఫలమైనట్టే. యువతను సరైన దిశగా నడిపించాల్సిన అవసరం ఉంది.

యువతను సరైన దిశలో నడిపించాలన్న ఉద్దేశంతోనే క్రీడా పాలసీని తెచ్చాం. నైపుణ్యాలను మెరుగుపరచడానికి స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. రేపటి రోజున ఎవరైనా క్రీడల్లో శిక్షణ తీసుకోవాలంటే తెలంగాణ వెళ్లాలన్న పరిస్థితి రావాలి. తెలంగాణను ఒక స్పోర్ట్స్ హబ్‌గా మార్చడానికి దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లోని యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నాం.


ప్రపంచంతో పోటీ పడే శక్తి, యుక్తి దేశంలో ఉంది. తెలంగాణలోని 1కోటి 50 లక్షల ఎకరాల్లో ఒక్క గంజాయి మొక్క మొలవొద్దు. ఒక్క గంజాయి మొక్క మొలిచినా ఈ Eagle (గద్ద) ఇట్టే పట్టేస్తుంది. ఈ గద్ద ఈరోజు నుంచే పనిచేస్తుంది" అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్ , కొండా విశ్వేశ్వరరెడ్డి , సినీనటులు రాంచరణ్ , విజయ్ దేవరకొండ , బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, హోం సెక్రెటరీ రవి గుప్తా , డీజీపీ జితేందర్ , టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తో పాటు అధికారులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో సహా కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మాదక ద్రవ్యాల నియంత్రణకు తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

# ఆపరేషన్ సిందూర్ మా హక్కు..

## చైనా గడ్డనుంచే పాక్‌పై నిప్పులు చెరిగిన రాజ్‌నాథ్



న్యూ డిల్లీ జూన్ 10 : సీమ్గాతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పొరుగుదేశం పాకిస్థాన్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. కొన్ని దేశాలు (పరోక్షంగా పాక్‌ను ఉద్దేశిస్తూ) సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా ఉపయోగిస్తున్నాయంటూ చైనా గడ్డనుంచే పాక్‌పై నిప్పులు చెరిగారు. తమ సొంత ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషించే దేశాలు అందుకుతగ్గ పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. చైనాలోని కింగ్‌డావోలో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశానికి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు. గల్వాన్ లోయ ఘటన తర్వాత ఆయన చైనాలో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఇటీవలే పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ మాట్లాడారు. దీనికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా వివరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ నిర్వహించడం భారత్ హక్కు అంటూ కుండ బద్దలు కొట్టారు.'కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాదాన్ని ఒక విధాన పరికరంగా మలుచుకున్నాయి. తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్నాయి. అలాంటి ద్వంద్వ ప్రమాణాలకు చోటు ఉండకూడదు. అటువంటి దేశాల చర్యలను ఏ మాత్రం ఊపేక్షించకూడదు. అలాంటి వాటిని ఎస్సీఓ ఖండించాలి. శాంతి, ఉగ్రవాదం ఎప్పటికీ కలిసి ఉండలేవు. విధ్వంసాలకు కారణమయ్యే ఆయుధాలు ఉగ్రవాదుల చేతుల్లో ఉండకూడదు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు నిర్ణయాత్మకమైన చర్య అవసరం. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా ఐక్యం కావాలి' అంటూ ఆయా సభ్య దేశాలకు రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు.

## పసుపు బోర్డు లోగో ఆవిష్కరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




హైదరాబాద్ జూన్ 26 : నిజామాబాద్ ప్రజలు గర్వించాల్సిన సమయం ఇది అని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. నిజామాబాద్ లో కిషన్ రెడ్డి పర్యటించారు. పసుపు బోర్డు లోగో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 29న పసుపు బోర్డు ఆఫీస్ ను హోం మంత్రి అమిత్ షా ప్రారంభిస్తారని, పలు రాష్ట్రాలు కోరినా కేంద్రం నిజామాబాద్ కే బోర్డు కేటాయించిందని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పై సిబిఐతో విచారణ జరిపించాలని, ట్యాపింగ్ చేసింది పోలీసులే కాబట్టి సిబిఐ కి అప్పగించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ తో సిఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. పోలీసులపై పోలీసులే దర్యాప్తు జరిపే పరిస్థితి వచ్చిందని కిషన్ రెడ్డి విమర్శించారు.

## డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధి సాధ్యం: పురంధేశ్వరి

అమరావతి జూన్ 26 : వికసిత్ భారత్ లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ ఒక భాగం అని బిజెపి ఎంపి పురంధేశ్వరి తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటే అభివృద్ధి సాధ్యమని ఆనాడు చెప్పామని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలు తమపై నమ్మకం ఉంచి ఆశీర్వదించి గెలిపించారని, అమరావతి, పోలవరం ఇలా అన్నింటిలో కేంద్రం సహకారం అందిస్తోందని, అనేక పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసుకుంటున్నామనితెలియజేశారు. చారిత్రక ప్రాధాన్యతగుర్తించి అభివృద్ధి చేసేందుకు కేంద్రం సాయమందిస్తోందని పురంధేశ్వరి పేర్కొన్నారు.




## గవర్నమెంట్ స్కూళ్లలో పెరుగుతున్న విద్యార్థులు

హైదరాబాద్, జూన్ 26, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరుగుతున్న క్రమంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులను నిర్మించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉన్నత ప్రమాణాలతో విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యా శాఖపై సీఎం రేవంత్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో అదనపు కలెక్టర్లు వారంలో కనీసం 2 ప్రభుత్వ పాఠశాలలను సందర్శించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ప్రైవేటు పాఠశాలల నుంచి 48 వేల మంది విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన గదులు నిర్మించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందుకు అనుగుణంగా పాఠశాలల్లో వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, అనంతరం ఇంటర్మీడియట్‌లో నమోదు అవుతున్న విద్యార్థుల సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఎక్కువ ఉండడంపై అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా కచ్చితంగా ఇంటర్ చదివేందుకు జూనియర్ కాలేజీలలో చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ పొందవచ్చు అని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. స్కిల్డ్ కోర్సులు నేర్చుకుంటే వారి భవిష్యత్తుకు ఢోకా ఉండదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధల నుంచి మహిళలకు విముక్తి కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళల కోసం సోలార్ కిచెన్లు ఏర్పాటుపై దృష్టి సారించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. యువతలో నైపుణ్యాలు పెంచాలన్న ఉద్దేశంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి తెలంగాణ ప్రభుత్వం రూపకల్పన చేసింది. ప్రొఫెషనల్ కోర్సులు పూర్తయ్యాక సైతం ఉద్యోగాలు రాకపోవడానికి సరైన స్కిల్స్ లేకపోవడం కూడా ఓ కారణమని రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలతో తరగతి గదులతో పాటు హాస్టల్స్ లో సౌకర్యాలపై తనిఖీ చేసే బాధ్యతను అడిషనల్ కలెక్టర్లు, ఉన్నతాధికారులకు అప్పగించారు

ప్రజాబలం

27 జూన్ 2025 శుక్రవారం

# ప్రసూతి సెలవు.. మహిళల హక్కు

మే 23, 2025 ఇది భారతీయ స్త్రీల జీవితంలో ఒక చరిత్రాత్మక దినం. ఉద్యోగాలు చేసే మహిళల హక్కులు, ముఖ్యంగా ప్రసూతి సెలవుల విషయంలో సుప్రీం కోర్టు ఒక అద్భుతమైన తీర్పును వెలువరించింది. కె ఉమాదేవి వెర్సెస్ ది స్టేట్ ఆఫ్ తమిళనాడు కేసులో మద్రాస్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ప్రసూతి సెలవు అనేది కేవలం ఒక విధానపరమైన అంశం కాదని, అది ఒక రాజ్యాంగ హక్కు అని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు ఆర్థిక, ప్రసూతి హక్కుల పరిధిని విస్తరింపజేస్తూ, పని ప్రదేశంలో మహిళల పునరుత్పత్తి స్వేచ్ఛకు, గౌరవానికి అగ్రపీఠం వేసింది. ఈ కేసు ఉమాదేవి అనే ఉద్యోగిని చుట్టూ తిరిగింది. ఆమె తన రెండో వివాహం తర్వాత పుట్టిన మూడో బిడ్డకు ప్రసూతి సెలవు కోరారు. తమిళనాడు ప్రభుత్వం ఆమె అభ్యర్థనను తిరస్కరించింది. అంతకు ముందు మద్రాస్ హైకోర్టు కూడా ఆమె సెలవును నిరాకరించింది. జనాభా నియంత్రణ లక్ష్యాలను ఉటంకిస్తూ మూడో బిడ్డకు ప్రసూతి సెలవును నిరాకరించే తమిళనాడు ప్రభుత్వ విధానాన్ని హైకోర్టు సమర్థించింది. అయితే సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో ఉమాదేవికి పూర్తిగా అనుకూలంగా నిలిచింది. అటువంటి వివక్షాపూరిత వ్యాఖ్యానాలను కొట్టివేసింది. పిల్లల సంఖ్య లేదా వైవాహిక పరిస్థితుల ఆధారంగా ప్రసూతి సెలవును నిరాకరించడం లేదా పరిమితం చేయడం సరికాదని కోర్టు స్పష్టం చేసింది. ప్రసూతి ప్రయోజనాలు ఒక మహిళ పునరుత్పత్తి హక్కులు, ప్రాథమిక గౌరవం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన ఆరోగ్య హక్కు లో అంతర్భాగమని కోర్టు నొక్కిచెప్పింది. అటువంటి వివక్షాపూరిత నిబంధనలు మహిళలపై 'అన్యాయమైన భారాన్ని' సృష్టిస్తాయని, వారి కెరీర్, కుటుంబం మధ్య ఎంపిక చేసుకోవలసి వస్తుందని లేదా వారి పునరుత్పత్తి నిర్ణయాలు తీసుకునే హక్కును అణగదొక్కుతాయని తీర్పు నొక్కి చెప్పింది.

ఈ తీర్పు ప్రసూతి ప్రయోజనాలను కేవలం ఒక సేవా షరతు నుండి ఒక మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛ ప్రాథమిక అంశంగా మార్చింది. ఆర్టికల్ 14 (చట్టం ముందు సమానత్వం), ఆర్టికల్ 21 (జీవితం, వ్యక్తిగత స్వేచ్ఛ రక్షణ)లతో అనుసంధానించడం ద్వారా, కోర్టు ప్రసూతి హక్కులకు పటిష్టమైన రాజ్యాంగ ఆధారాలను అందించింది. ఇప్పటి వరకు మన దేశంలో ప్రసూతి హక్కులు ప్రధానంగా ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961 ద్వారా నియంత్రించబడ్డాయి. ఇది 2017లో మరింత సమగ్ర ప్రయోజనాలను అందించడానికి సవరించబడింది. ఈ చట్టం గర్భధారణ సమయంలో, తర్వాత పని చేసే మహిళలకు కొన్ని రక్షణలు, ప్రయోజనాలను అందిస్తుంది. వేతనంతో కూడిన సెలవు, తొలగింపునుండి రక్షణ, ఇతర ప్రసూతి సంబంధిత ప్రయోజనాలను అందిస్తుంది. సెలవు తర్వాత అదే లేదా సమానమైన స్థానానికి తిరిగి రావడానికి హామీ ఇస్తుంది. అయితే ఈ చట్టాలు సాధారణంగా 'రెండు కంటే తక్కువ మంది పిల్లలు ఉన్న' మహిళలకు ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేశాయి. చాలా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ సేవల్లో సాధారణంగా ఉన్న ఈ విధానం వివక్షాపూరితమైనదిగా, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించేదిగా చాలా కాలంగా వివాదాస్పదంగా ఉంది. ఈ తీర్పు భారతదేశంలో ఆర్థిక, ప్రసూతి హక్కుల దృశ్యంపై లోతైన, తక్షణ ప్రభావాలను చూపుతుంది. ఇద్దరు పిల్లల నిబంధన లేదా ఇలాంటి ఆంక్షల ద్వారా గతంలో పరిమితం చేయబడిన ప్రభుత్వ ఉద్యోగులపై దీని ప్రభావం ప్రత్యక్షంగా ఉంటుంది. ఈ తీర్పు ఇప్పుడు వారికి పిల్లల సంఖ్యలేదా వైవాహిక సందర్భంతో సంబంధం లేకుండా ప్రసూతి ప్రయోజనాలను పొందేందుకు అనుమతిస్తుంది, వారి జీవితంలో ఒక కీలక సమయంలో కీలక ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. ఈ నిర్దిష్ట కేసు ప్రభుత్వ ఉద్యోగికి సంబంధించినది అయినప్పటికీ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన బలమైన రాజ్యాంగ సూత్రాలు ప్రైవేట్ రంగంతో సహా ఇతర రంగాలలో ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను సవాలు చేయడంలో గణనీయంగా ఉపయోగపడతాయి.

పిల్లల సంఖ్య ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను పరిమితం చేయడానికి ప్రయత్నిస్తున్న ఏ సంస్థ అయినా ఇప్పుడు చట్టపరమైన సవాలును ఎదుర్కోవలసి ఉంటుంది. కుటుంబ పరిమాణం ఆధారంగా ప్రసూతి ప్రయోజనాలను నిరాకరించడం తరచుగా మహిళలను, ముఖ్యంగా పునర్వివాహం చేసుకున్న లేదా వివిధ కారణాల వల్ల ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న వారిని అసమానంగా ప్రభావితం చేస్తుంది. అసంఘటిత రంగాలలో పనిచేసే మహిళలకు ఆర్థిక ప్రసూతి హక్కులను విస్తరించడం అనే విస్తృత సమస్య ఇంకా మిగిలి ఉంది. ఈ మహిళలకు తరచుగా వేతనంతో కూడిన ప్రసూతి సెలవు, వైద్య బోనస్, లేదా శిశుసంరక్షణ సౌకర్యాలు వంటి చట్టబద్ధమైన ప్రయోజనాలు అందుబాటులో ఉండవు. గర్భధారణ సమయంలో వారి దుర్బలత్వం తరచుగా వారిని అకాలంగా పనికి తిరిగి వెళ్ళడానికి లేదా మరింత పేదరికంలోకి నెట్టివేస్తుంది. ఈ ప్రగతిశీల తీర్పు స్ఫూర్తిని ఉపయోగించుకొని మరింత సమ్మిళితమైన, సార్వత్రిక సామాజిక భద్రతా చట్టాలను రూపొందించడం తదుపరి కీలక అడుగు. తద్వారా అసంఘటిత రంగానికి కూడా ఆర్థిక ప్రసూతి సహాయాన్ని అందించడం ఈ మే 23, 2025 తీర్పు మహిళల హక్కులను పునరుద్ఘాటిస్తుంది. మాతృత్వం ఉద్యోగానికి అడ్డంకి కాకూడదని లేదా ఆర్థిక ఇబ్బందులకు కారణం కాకూడదని వాదిస్తుంది. ఇది ఆశకు ఒక దీపస్తంభంగా పనిచేస్తుంది. ప్రసూతి ప్రయోజనాల రక్షక గొడుగును విస్తరిస్తుంది. ప్రతి తల్లి ఆమె ఉద్యోగ రంగంతో సంబంధం లేకుండా, గౌరవంగా, ఆర్థిక భద్రతతో మాతృత్వాన్ని స్వీకరించగలదని నిర్ధారిస్తుంది. ఈ తీర్పు రాజ్యాంగపరమైన ప్రేరణను అందిస్తుంది. ఇప్పుడు, సమగ్ర ఆర్థిక ప్రసూతి హక్కులను దేశంలోని ప్రతి మహిళకు వాస్తవంగా మార్చడానికి శాసన, విధానపరమైన విభాగాలు చర్యలు తీసుకోవాలి.

# రేవంత్ రెడ్డి అవినీతి చక్రవర్తి

**రూ.2 లక్షల కోట్లు అప్పులు తెచ్చి కమీషన్లు మెక్కిండు**

**తెచ్చిన అప్పులు ఎందుకు ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి**

**తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దివాళా తీయిస్తోంది**

**అప్పులు రీ పేమెంట్ చేయక డిఫాల్ట్ అయ్యే పరిస్థితిని తెచ్చింది**

**పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు ఒప్పుకున్నదే రేవంత్ రెడ్డి**

**పూణే మెట్రోకు నిధులిచ్చి.. హైదరాబాద్ మెట్రోకు కేంద్రం మొండిచేయి చూపింది**

**ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలుండి ఏం లాభం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి అవినీతి చక్రవర్తి అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై త్వరలోనే పుస్తకం ప్రచురించి రాష్ట్రమంతా పంచుతామన్నారు. గురువారం ఉదయం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. గతంలో ఒక నాయకుడి కరప్షన్ పై పుస్తకం వేశారని.. రేవంత్ రెడ్డి.. అవినీతిలో చక్రవర్తి కాబట్టి ఆయన అవినీతిపై పుస్తకంలో సమగ్రంగా వివరిస్తామన్నారు. కేవలం 18 నెలల్లోనే రూ.2 లక్షల కోట్ల అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి రేవంత్ రెడ్డి కమీషన్లు మెక్కాడని ఆరోపించారు. కొత్తగా ఒక్క పథకం అమలు చేయకుండా, ఒక్క పింఛన్ మంజూరు చేయకుండా, పింఛన్లు పెంచకుండా, మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వకుండా అప్పు తెచ్చిన రూ.2 లక్షల కోట్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెచ్చిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ గారి పాలనలో క్రమశిక్షణతో లోన్లు రీ పేమెంట్ చేసి ఏ గ్రేడ్ రేటింగ్ లో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి డిఫాల్ట్ స్టేట్ స్థితికి దిగజార్చారని మండిపడ్డారు.రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) నుంచి తెచ్చిన లోన్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సరైన సమయానికి తిరిగి చెల్లించడం లేదన్నారు. ఇన్ స్టాల్ మెంట్ల పేమెంట్ లో డిఫాల్ట్ స్టేజీకి రాష్ట్రాన్ని తీసుకువచ్చారని.. అందుకు ఆర్ఈసీ రాసిన లేఖనే సాక్షమని అన్నారు. తాను ఆధారాలు లేకుండా ఒక్క మాట మాట్లాడనని.. పూర్తి ఆధారాలతోనే ఈ విషయాలు బయట పెడుతున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి మాటకు ముందు కేసీఆర్ గారి చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికే అప్పులు చేస్తున్నామని చెప్తున్నారని.. ఆయన చెప్పేవన్ని శుద్ధ అబద్ధాలని ఆర్ఈసీ లేఖతో తేలిపోయిందన్నారు. కేసీఆర్ గారు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అత్యంత ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించారని తెలిపారు. ప్రాజెక్టులు, ఇతర మౌలిక సదుపాయాల కోసం తెచ్చిన అప్పులను క్రమం తప్పకుండా రీ పేమెంట్ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఈసీకి చెల్లించాల్సిన రూ.1,320 కోట్లను ఈనెల 28వ తేదీలోపు చెల్లించాలని లేఖ రాసిందని.. సమయానికి రీపేమెంట్ చేయకపోతే దివాళాగా పరిగణించాల్సి వస్తుందని కూడా హెచ్చరించిందని అన్నారు. కేసీఆర్ గారి హయాంలో ఎన్ని ప్రాజెక్టులు నిర్మించినా ఏ ఒక్క కాంట్రాక్టర్ కు మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇవ్వలేదని.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ మొబిలైజేషన్ అడ్వాన్స్ ల సంస్కృతి మొదలైందన్నారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం అనే ప్రాజెక్టు కోసం మేఘా ఇంజనీరింగ్ సంస్థకు రూ.600 కోట్లు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ కు మరో రూ.600 కోట్ల అడ్వాన్స్ ఇచ్చారని తెలిపారు. చెంచా మట్టి కూడా తీయకుండా ఒక్క ప్రాజెక్టుకే రూ.1,200 కోట్ల ముందస్తు చెల్లింపులు చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.2024 జూలై 6వ తేదీన ప్రజాభవన్ లో రేవంత్ రెడ్డితో సమావేశమైన తర్వాతే చంద్రబాబు నాయుడు పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని అన్నారు. 2016లో పోలవరం నుంచి బనకచర్ల లింక్ అనే ప్రాజెక్టు ప్రస్తావనే లేదన్నారు. రేవంత్ రెడ్డి తప్పుడు ప్రచారంతో కేసీఆర్ పై బురద చల్లాలని చూస్తున్నారని అన్నారు. కేసీఆర్ కలలో కూడా తెలంగాణకు నష్టం చేయరని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుతో ఒక్క ఎకరం కూడా కొత్త ఆయకట్టు లేదని ఆంధ్రా మేధావులు సైతం చెప్తున్నారని.. మేఘా ఇంజనీరింగ్ సంస్థకు లాభం చేయడానికే ఈ ప్రాజెక్టు చేపట్టారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికి కూడా పోలవరం బనకచర్లపై అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేయడం లేదన్నారు. చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లాడాలంటేనే రేవంత్ రెడ్డి భయపడుతున్నారని అన్నారు. చంద్రబాబుకు రేవంత్ రెడ్డి హైదరాబాద్ బిర్యానీ తినిపించి గోదావరి నీళ్లను గిఫ్ట్ ప్యాక్ గా ఇచ్చారని అన్నారు. ఆంధ్రా బిర్యానీ ఎట్లా ఉంటుందో గతంలోనే కేసీఆర్ చెప్పారని అన్నారు.పోలవరం ముంపు సమస్యను చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రగతి ఎజెండాలో చేర్చి చివరి నిమిషంలో చర్చను ఎత్తివేసిందని మండిపడ్డారు. భద్రాచల రాముడు పోలవరంలో మునుగుతున్నా తెలంగాణ నుంచి ఎన్నికైన 8 మంది బీజేపీ ఎంపీలు ఎందుకు నోరెత్తడం లేదని ప్రశ్నించారు. భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉన్న ఐదు గ్రామాలు వెంటనే తెలంగాణలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. పూణే మెట్రో రైల్ కు కేంద్ర కేబినెట్ లో రూ.3,500 కోట్లు ఇస్తూ నిర్ణయం తీసుకున్నారని.. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు ఎందుకు నిధులు ఇవ్వలేదని నిలదీశారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ ఎంపీలకు నిధులు తెచ్చే సత్తా లేదని మండిపడ్డారు.

# హైకోర్టు తీర్పుప్రకారం 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

## బిజెపి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్



హైదరాబాద్ జూన్ 26 తెలంగాణ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30 లోగా నిర్వహించాలని తీర్పు ఇచ్చిందని ఈ తీర్పును బిజెపి స్వాగతిస్తున్నట్లు బిజెపి రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య తెలిపారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ తీర్పు ప్రకారం, కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా 42 శాతం బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేసారు.

గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఇప్పటికే బీసీ రిజర్వేషన్లకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి గారు మద్దతు ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ గారు స్వయంగా స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను ఇవ్వాల్సిన అధికారం, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదే అని అన్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 243ఆ6 ప్రకారం ఈ అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అధికారాన్ని వినియోగించుకుని బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల హామీని ప్రకటించింది. మేనిఫెస్టోలో కూడా అదే హామీ ఇచ్చారు. ఇప్పుడు దానిప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలి.కొందరు "50 శాతం సీలింగ్" పేరుతో సుప్రీంకోర్టు లేదా హైకోర్టు స్టే ఇస్తుందేమో అనే వాదనలు చేస్తున్నారు. ఇది పూర్తిగా తప్పుదారి పట్టించే గోబెల్స్ ప్రచారం మాత్రమే నన్నారు.ఇప్పటికే ఇచిూ రిజర్వేషన్ ద్వారా సుప్రీంకోర్టు 60 శాతం వరకూ రిజర్వేషన్లు గరిష్టంగా ఉంటాయనే అభిప్రాయాన్ని ప్రకటించింది. గతంలో సుప్రీంకోర్టే కొన్ని సందర్భాల్లో ? 50 శాతం సీలింగ్ అనేది రాజ్యాంగంలో లేదు, అవసరమైతే దాన్ని దాటి వెళ్ళవచ్చని వ్యాఖ్యా నించింది.రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి బీసీ జనాభా లెక్కలు తేల్చింది. ఆ లెక్కల ప్రకారం రాష్ట్రంలో బీసీలు 42 శాతం కన్నా ఎక్కువగా ఉన్నారన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలన్న అభిప్రాయంతో అసెంబ్లీలో చట్టం కూడా చేశారు. రాజ్యాంగపరంగా, న్యాయపరంగా ఎలాంటి అడ్డంకులు లేవు.243ఆ6 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి అధికారం ఉంది. సుప్రీంకోర్టు తీర్పులు, రాజ్యాంగం కూడా ఈ విషయాన్ని అడ్డుకోవడం లేదు.ప్రభుత్వం అసెంబ్లీలో చట్టం చేసింది. జనాభా లెక్కలు ఉన్నాయి. డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఉంది. అలాంటి స్థితిలో 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించ ంలో ఎలాంటి అడ్డంకి లేదు అని అన్నారు.హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించాలని బీజేపీ స్పష్టంగా డిమాండ్ చేస్తోందన్నారు.అన్ని బీసీ సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలూ అందరూ స్థానిక సంస్థల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి న్యాయపరమైన, రాజ్యాంగపరమైన, చట్టపరమైన అవరోధాలు లేవన్నారు.బీసీ రిజర్వేషన్ల అంశంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు పెట్టినప్పుడు అన్ని పార్టీలూ మద్దతిచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్ హామీ ఇచ్చారు. కనుక, ఈ హామీ అమలుకు ఇప్పుడు వెనుకడుగు వేయడం తగదన్నారు.బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్రం మీద నెపం నెట్టే అవసరం తగదు. కేంద్రం ఎప్పుడూ ఈ విషయంలో అడ్డు కాదని స్పష్టం చేశారు. రిజర్వేషన్లపై చట్టాలు చేయడమూ, అమలు చేయడమూ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. 243-ఆ ఆర్టికల్ ప్రకారం బలమైన రాజ్యాంగపరమైన అధికారం రాష్ట్రానికి ఉంది.తమిళనాడు, బీహార్ రాష్ట్రాల్లో రాష్ట్ర ప్రభుత్వాలే రిజర్వేషన్లు పెంచుతూ జీవోలు జారీ చేశాయి.

ఆపై అమలు సమయంలోనే కొన్ని సందర్భాల్లో కోర్టుల్లో స్టేలు వచ్చాయి. కానీ అక్కడి ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కేంద్రం మీద నెట్టే ప్రయత్నం చేస్తూ కాలయాపన చేస్తోంది. ఇది సరైన విధానం కాదన్నారు.బీసీ రిజర్వేషన్లపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసి 42% రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది.

రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## ద్విచక్ర వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు!

హైదరాబాద్ జూన్ 26 : జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ద్విచక్ర వాహనాలకు టోల్ నుంచి మినహాయింపు ఇస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఇకపై టూవీలర్స్ కూడా టోల్ కట్టాల్సి ఉంటుందట. ద్విచక్ర వాహనాల నుంచి టోల్ ఫీజు వసూలు చేయాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి.జాతీయ రహదారులపై ఇప్పటి వరకూ ఫోర్ వీలర్స్, ఇతర పెద్ద వాహనాలకు మాత్రమే టోల్ ఫీజు వసూలు చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, మూడు చక్రాల ఆటోలు టోల్ కట్టకుండానే జాతీయ రహదారులపై ప్రయాణిస్తున్నాయి. అయితే, ఈ విధానంలో మార్పునకు కేంద్రం శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది. వచ్చే నెల అంటే జులై 15 నుంచి జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు టోల్ వసూలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అయితే, దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రాలేదు. త్వరలోనే ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని జాతీయ మీడియా పేర్కొంది. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటే ద్విచక్ర వాహనదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశం ఉంది.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకలు

గ్రామదేవతల పూజలకు ఉద్దేశిత మైనది, తెలుగు జానపదుల సంస్కృతిక వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలుస్తున్నది బోనాల పండుగ. ఇది తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. జూలై లేదా ఆగస్టు మాసంలో వచ్చే ఆషాదం వచ్చిందంటే, తెలంగాణ లోని అన్ని ప్రాంతాలలో జాతర సందడి నెలకొంటుంది. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో మహిళలు సమర్పించే బోనాలే దర్శన మిస్తాయి. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది. 1813 లో భాగ్యనగరంలో వేలాది మంది గురైన సందర్భంలో, మహంకాళిని కొలవడం వల్ల వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అప్పటి నుండి రాష్ట్ర రాజధాని లోనూ, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు వాడుక. గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో, అబుల్ హసన్ తానీషా పాలనా సమయంలో, ప్రధాని సైనికాధికారులుగా ఉన్న అక్కన్న, మాదన్నల కాలంలో, బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లు కథనాలు. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు, నిజాం మీర్ మెహబూబ్ అలీ ఖాన్, మంత్రి కిషన్ ప్రసాద్ ను, ఏమి చేయాలని సలహా కోరగా, ఇది అమ్మవారి ఆగ్రహం ఫలితమేనని, ఆమెను శాంతింప చేయడానికి, పూజలు నిర్వహించాలని మంత్రి, ప్రభువుకు వివరించిన సందర్భంలో, నిజాం ప్రభువు లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, సమర్పించి పూజలు నిర్వహించిన ఫలితంగా, వరదలు తగ్గుముఖం పట్టాయని చెబుతారు. తర్వాత కాలంలో, స్థానికులు సదరు ఆలయాన్ని పునరుద్ధరించి, 1968లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులచే, విగ్రహ ప్రతిష్ట చేయించడం జరిగింది. 7వ నిజాం కాలం నుండి, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయం లో, బోనాల ఉత్సవాలు జరుగు తున్నాయి. హైదరాబాద్ లో ప్రస్తుతం వందలాది చిన్న, పెద్ద ఆలయాలలో ఉత్సవాలు కొనసాగు తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావ అనంతరం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ అనుసరణీయమైన పండగైన బోనాలను, "రాష్ట్ర పండుగ"గా నిర్వహిస్తున్నారు. "భోజనం" ప్రకృతి కాగా "బోనం" వికృతి. జానపదులు తమకు ఇష్టమైన గ్రామ దేవతలకు సమర్పించే "నివేదనలే బోనాలు". పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, అంకాలమ్మ, డొక్కలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ, నాయకమ్మ, మొదలైన పేర్లతో పిలిచే దేవతల గుళ్ళను, ఈ సందర్భంగా దేదీప్య మానంగా అలంకరిస్తారు. బోనాన్ని కొత్త కుండలో వండి, దానితోపాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్ని చోట్ల ఉల్లిపాయలతో కలిపిన బోనాన్ని, మట్టి లేక రాగి కుండలో నుంచి తమ తలపై ఉంచుకొని, ఆటగాళ్ళతో, డప్పుల తదితర వాద్యాలతో, గుడికి చేరుకుంటారు. ఈ బోనాల కుండలను, చిన్న చిన్న వేప రెమ్మలతో, పసుపు, కుంకుమ లేక తడి తెల్ల ముగ్గుతో, అలంకారం చేసి, దానిపై దీపాన్ని ఉంచుతారు. ఆషాడ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని గ్రామీణుల విశ్వాసం. అందుకే తమ కూతురు తమ సొంత ఇంటికి లేదా ఆమె పుట్టింటికి వచ్చిన భావనతో ప్రేమానురాగాలు, పుట్టి పడగా, భక్తిశ్రద్ధలను మేళవించి, బోనాలను నివేదిస్తారు. గత కొంత కాలంలో వేరు వేరు ప్రాంతాలలో దీనిని "పెద్ద పండగ", "ఊర పండగ" లాంటి పేర్లతో పిలిచేవారు. తర్వాతి కాలాన బోనాలుగా పిలుస్తున్నారు. పూర్వకాలంలో దుష్టశక్తులను పారద్రోలేందుకు, ఆలయ ప్రాంగణం బలి ఇవ్వడం జరిగేది. నేడు యాటల పేరున మేకలను లేదా కోడిపుంజులను బలి ఇవ్వడం ఆచారమైంది. పండుగ సందర్భంగా, స్త్రీలు కొత్త బట్టలు, పట్టు చీరలు, నగలు ధరించి, బోనాలు మోస్తూ వెళుతుండగా, మోసుకెళ్తున్న కొందరికి పూనకం (అమ్మవారు ఆ వహిస్తారని నమ్మక) రాగా, వారిని శాంతింప చేసేందుకు, ఆలయ సమీపాన వారి పాదాలపై నీళ్ళు కుమ్మరిస్తారు. అమ్మవారి ఇ సోదరుడైన పోతరాజును, ప్రతిబింబించే ఒక బలిష్టకాయుడు, ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాళ్ళకు గజ్జలు కలిగి, చిన్న ధోవతి ధరించి, వాద్య ధ్వనులకు అనుగుణంగా నర్తిస్తాడు. పూజారంభకునిగా, భక్త జన రక్షకునిగా భావించబడతాడు. కొరడాలతో కొట్టుకుంటూ, వేపాకులను చుట్టుకుని, పూనకం వచ్చిన భక్తులను, అమ్మవారి సన్నిధికి తీసుకెళ్తాడు. అమ్మవారికి నివేదన అనంతరం విందు భోజనాలు ఆరగిస్తారు. ఈ కార్యక్రమంలో జాతర అనంతరం, పోతరాజుకూ పూనకం రాగా, వికృతమైన ఆగ్రహాన్ని శాంత పరచుటకు, కొమ్ములున్న మేకపోతును అందించగా, పోతరాజు తన దంతాలతో, మేక తల మొండెం వేరు చేసి, పైకి ఎగరవేస్తారు. పండుగ మొదటి రోజు నుండి, చివరి నిమజ్జనం దాకా, అత్యంత భక్తి తత్పరతతో వాతావరణం ఉంటుంది. బోనాల సమర్పణ వల్ల, ప్రధానంగా దేవతలు శాంతించి, అంటురోగాల బారిన పడకుండా కాపాడుతానని భక్తుల విశ్వాసం. బోనాల ఉత్సవాలు జూన్ 26వ తేదీన ప్రారంభమవుతాయి. అదే రోజున గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలి బోనం సమర్పించడం ద్వారా తెలంగాణలో బోనాలు ప్రారంభం అవుతాయి. ఇది మొదటి బోనం. జూన్ 29వ తేదీన రెండో బోనం, జూలై 3న మూడో బోనం, జూలై 6న నాలుగో బోనం, జూలై 10న ఐదో బోనం, జూలై 13న ఆరో బోనం, జూలై 17న ఏడో బోనం, జూలై 20న 8వ బోనం, జూలై 24న తొమ్మిదో బోనంతో ఈ బోనాలు సంబురాలు ముగుస్తాయి. ఆదివారం, జూలై 6, 2025న గోల్కొండ బోనాలు, ఆదివారం, జూలై 13, 2025న ఉజ్జయినీ మహంకాళి ఆలయం బోనాలు, ఆదివారం, జూలై 20, 2025న అక్కన్న మాదన్న ఆలయ బోనాలు, సోమవారం, జూలై 21, 2025న (మహంకాళి ఉత్సవ సమాప్తి), ఆదివారం, జూలై 27, 2025న లాల్‌దర్వాజ బోనాలు జరుగనున్నాయి.

# శుభాంషు శుక్లాకు ఆల్ ది బెస్ట్

ఆక్సియమ్-4 మిషన్ (లేదా యాక్స్-4) స్పేస్ ఎక్స్, నాసా, ఆక్సియమ్ స్పేస్‌లు సంయుక్తంగా నిర్వహించే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్, ఐఎస్ఎస్) చేరడానికి చేబడుతున్న యాత్ర 14 నుంచి 21 రోజుల ప్రణాళికతో ప్రారంభం అవుతున్నది. క్రూ డ్రాగన్ అంతరిక్ష నౌకలో నలుగురు నిష్ణాతులైన కమాండర్ పెగ్గీ విల్సన్, పైలెట్ శుభాంషు శుక్లా, మిషన్ స్పెషలిస్ట్-1 స్లావోజ్, మిషన్ స్పెషలిస్ట్-2 టిబోర్ కాపు అను సిబ్బందితో 25 జూన్ 2025న భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:30 గంటలకు ప్రయోగించబడుతున్నది. భారత దేశపు మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమానికి యాక్స్-4 ఒక మైలురాయిని సూచిస్తున్నది. ఇస్రో గగన్‌యాన్ చొరవతో అనుసంధానించబడిన ఈ మిషన్‌లో భారతీయ వ్యోమగామి శుభాంషు శుక్లా - ఐఎస్ఎస్‌కు వాణిజ్య మిషన్‌లో ప్రయాణించే తొలి వ్యక్తిగా రికార్డు నెలకొల్పనున్నారు. ఇండియన్ ఏయిర్ ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్‌గా విశేష సేవలు అందిస్తున్న శుభాంషుశుక్లా జూన్ 25, 2025న స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్‌లో ఆక్సియమ్-4 మిషన్‌లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లనున్నారు. గత నాలుగు దశాబ్దాల్లో అంతరిక్ష యాత్ర చేయనున్న తొలి భారతీయుడిగా శుక్లా వెళ్లడం, మన అంతరిక్ష చరిత్రలో మరో మైలురాయిగా నిలువనుంది. 10 జూన్ 2025న ప్రారంభం కానున్న అంతరిక్ష యాత్ర వాతావరణ ప్రతికూలతలు, ఇతర కారణాల మూలంగా పలుమార్లు వాయిదాలు పడి చివరకు 25 జూన్ 2025న నింగిలోకి దూసుకెళ్లింది. ఆక్సియమ్-4 మిషన్‌లో వెళుతున్న వ్యోమగాములు నలుగురు రెండు కనీసం వారాల పాటు పలు ప్రరిశోధనలు చేయనున్నారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో చేయనున్న ఆక్సియమ్-4 మిషన్ ప్రయోగంలో శుభాంషు ప్రయాణానికి భారత్ కూడా దాదాపు 60 మిలియన్ డాలర్ల ఖర్చు తేస్తున్నది. 10 అక్టోబర్ 1985న లక్నోలో జన్మించిన శుభాంషు శుక్లా అలీగంజ్‌లోని సిటీ మాంటెస్సోరీ పాఠశాలలో చదివిన అనంతరం కార్గిల్ యుద్ధం నుంచి ప్రేరణ పొంది నేషనల్ డిఫెన్స్ అకాడమీలో చేరి కంప్యూటర్ సైన్స్‌లో పట్టా పొందారు. 2006లో ఇండియన్ ఏయిర్‌ఫోర్స్‌లో కమీషన్డ్ ఆఫీసర్‌గా చేరి 2000 గంటల గగనయాన అనుభవాన్ని పొందారు. సూ-30 ఎంకెఐ, మిగ్-29 జాగ్వార్, డోమియర్-228, హాక్ ఏయిర్ క్రాఫ్ట్‌లను నడిపిన అనుభవాన్ని పొందారు. ఐఐఎస్‌సి బెంగుళూరులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో ఎం టెక్ పూర్తి చేసిన శుభాంషు 2019లో గగన్‌యాన్ మానవ సహిత వ్యోమనౌక మిషన్‌కు ఎంపికైనారు. ఇస్రో-బెంగుళూరు, గగారిన్ కాస్మోనాట్ ట్రేనింగ్ సెంటర్ - రష్యాల్లో శిక్షణ పొందిన శుభాంషు శుక్లా 2024లో ఆక్సియమ్-4 మిషన్‌లో పైలెట్‌గా ఎంపికైనారు. 41 ఏండ్ల క్రితం 1981లో అంతరిక్షంలో సూయజ్ స్పేస్‌క్రాఫ్ట్‌లో ఎనిమిది రోజులు ప్రయాణించిన రాకేష్ శర్మ తర్వాత అంతరిక్ష యాత్ర చేస్తున్న రెండవ వ్యోమగామిగా శుక్లా పేరు తెచ్చుకుంటున్నారు. ఈ సందర్భంగా శుభాంషు మాట్లాడుతూ 1.4 బిలియన్ల భారతీయుల ప్రతినిధిగా అంతరిక్ష ప్రయాణం చేస్తున్నానని, నా యాత్ర కొద్ది మంది యువతకు ప్రేరణగా నిలిచినా లేదా ఒక్కరి జీవితాన్ని మార్చినా ఈ యాత్ర సఫలం అయినట్లే అని స్పష్టం చేయడం హర్షదాయకం, అనుసరణీయం, అభినందనీయం. ఇండియా, పోలాండ్, హంగేరీ దేశాలకు చెందిన ఒక్కొక్క వ్యోమగామి పాల్గొంటున్న ఆక్సియమ్-4 మిషన్ ద్వారా తక్కువ ఎత్తున ఉన్న భూకక్ష్యలో చేరనుంది.

# పలు ప్రత్యేకతల సమాహారం
# జగన్నాథ రథోత్సవం

ఏ హిందూ ఆలయంలోనైనా ఊరేగింపు కోసం మూల విరాట్టును కదిలించే కార్యక్రమం దాదాపు ఉండదు. ఊరేగింపు సేవల కోసం ప్రత్యేకించి ఉత్సవ విగ్రహాలుంటాయి. అలాగే ఊరేగింపు కోసం ప్రత్యేకించి ఏటా ఒకే రథాన్ని వినియోగించడం అన్ని చోట్లా జరిగేదే. అయితే ఈ రెంటికీ భిన్నమైన పరిస్థితి భారత దేశంలో ఒక సమయంలో ఉంది. అది మామూలు ఆలయం కాదు. పలు ప్రత్యేకతలు కలిగిన ప్రఖ్యాత ఆలయం. అదే ఒడిశాలోని పూరీ జగన్నాథాలయం. బలభద్ర, సుభద్రలతో సహా ఈ ఆలయంలో కొలువైన జగన్నాథ మూల విరాట్ మూర్తులను ఏడాదికొకసారి గుడి లోంచి బయటికి తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, కనువిందు చేసే ప్రత్యేక సన్నివేశం పూరీకే అపురూపం. అంతేకాదు. జగన్నాథ రథయాత్ర పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు ఏటా కొత్త రథాలను తయారు చేసి వినియోగిస్తుండడం పూరీ జగన్నాథుడికే ప్రత్యేకం. అందుకే... జగన్నాథుడి రథ యాత్రను అత్యంత అపురూపంగా భావిస్తారు భక్తులు. పూరీ జగన్నాథ దేవాలయం భారతదేశం లోని ఒడిషా రాష్ట్రంలో బంగాళాఖాతం తీరాన ఉన్న పూరీ పట్టణంలో గల ఒక ప్రాచీన, ప్రముఖమైన హిందూ దేవాలయము. విగ్రహాలు చెక్కతో తయారు చేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆలయంలో శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరామ సమేతంగా దర్శన మిస్తాడు. ఛార్ ధాం" పుణ్యక్షేత్రాలలో ఈ దేవాలయం కూడా ఉంది. ఆషాఢ శుద్ధవిదియ... పూరీ క్షేత్రంలో రథోత్సవ పండుగ రోజు. జగన్నాథ జయజయ ధ్వనాలతో పూరీ నగర వీధులన్నీ మారుమోగు తుంటాయి. అంతరాలయంలో రత్న పీఠికపై ఏడాదిగా కొలువున్న జగన్నాథుడు బయటికి వచ్చే సమయం కోసం వేచి చూస్తుంటారు భక్తులు. ఆ క్షణం అపురూపం, అనిర్వచనీయం. రథయాత్ర నేపథ్యం గురించి రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ద్వాపర యుగంలో కంసుడిని వధించడానికి బలరామ కృష్ణులు బయలుదేరిన ఘట్టాన్ని పురస్కరించుకుని ఈ యాత్ర జరుపుతారని ఒక కథనం. ద్వారకకు వెళ్లాలన్న సుభద్రా దేవి కోరిక తీర్చే ముచ్చటే ఈ రథయాత్ర అని మరి కొందరు చెబుతారు. ఇక గుండీచా దేవి మందిరం విషయానికొస్తే... పూరీ జగన్నాథ ఆలయాన్ని నిర్మించిన ఇంద్రద్యుమ్న మహారాజు భార్య గుండీచా. ఆమె కూడా జగన్నాథ బలభద్రుల కోసం ప్రధానాలయానికి మూడు కి.మీ. దూరంలో ఒక మందిరం నిర్మించింది. అదే గుండీచా ఆలయం. రథయాత్రలో భాగంగా అక్కడికి తీసుకువెళ్లిన మూడు విగ్రహాలనూ ఆ గుడిలోని రత్న సింహాసనంపై కూర్చుండ. బెట్టి గుండీచాదేవి పేరిట ఆతిథ్యం ఇస్తారు. గుండీచా మందిరం జగన్నాథుడి అతిథి గృహంగా భావిస్తారు.

జగన్నాథ రథయాత్ర జరిగేది ఆషాఢ శుద్ధ విదియ నాడే అయినా అందుకు రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లు మొదలవుతాయి. వైశాఖ బహుళ విదియ నాడు రథ నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అందుకు అవసరమైన వృక్షాలను 1072 ముక్కలుగా ఖండించి పూరీకి తరలిస్తారు. ప్రధాన పూజారి, తొమ్మిది మంది ముఖ్య శిల్పులు, వారి సహాయకులు మరో 125 మంది కలిసి అక్షయ తృతీయ నాడు రథ నిర్మాణం మొదలు పెడతారు. వృక్ష భాగాలనూ నిర్మాణానికి అనువుగా ముక్కలుగా ఖండిస్తారు. వాటిలో 832 ముక్కల్ని జగన్నాథుడి రథం తయారీకీ, 763 కాండాలను బలరాముడి రథ నిర్మాణానికీ, 593 భాగాలను సుభద్రా దేవి రథానికీ వినియోగిస్తారు. 45 అడుగుల ఎత్తున జగన్నాథుడి రథం పదహారు చక్రాలతో మిగతా రెండిటి కన్నా పెద్దదిగా ఉంటుంది. ఎర్రటి చారలున్న పసుపు వస్త్రంతో రథాన్ని అలంకరిస్తారు. బలభద్రుడి రథం ఎత్తు 44 అడుగులు. పద్నాలుగు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నీలి వస్త్రంతో ఈ రథాన్ని కప్పుతారు. సుభద్రా దేవి రథం ఎత్తు 43 అడుగులు. పన్నెండు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో పద్మ. ధ్వజాన్ని అలంకరిస్తారు. ప్రతి రథానికీ 250 అడుగుల పొడవూ ఎనిమిది అంగుళాల మందం ఉండే తాళ్లను కడతారు. ఆలయ తూర్పు భాగంలో ఉండే సింహ ద్వారానికి ఎదురుగా ఉత్తర ముఖంగా నిలబెడతారు. రథయాత్ర ప్రారంభ దినాన మేళ తాళాలతో గర్భగుడి లోకి వెళ్లిన పండాలు (పూజరులు) ఉదయ కాల పూజాదికాలు ముగించి, 'మనిమా (జగన్నాథా)' అని పెద్దపెట్టున అరుస్తూ రత్నపీఠం మీద నుంచి విగ్రహాలను కదిలిస్తారు. ఆలయ ప్రాంగణం లోని ఆనంద బజారు, అరుణ స్తంభం మీదుగా వాటిని పూరేగిస్తూ బయటికి తెస్తారు. ముందుగా... దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తుండే బలరాముడి విగ్రహాన్ని తీసుకు వస్తారు. విగ్రహాన్ని ఆయన రథమైన తాళ ధ్వజంపై ప్రతిష్ఠింప జేస్తారు. అనంతరం ఆ స్వామి విగ్రహానికి అలంకరించిన తలపాగా ఇతర అలంకరణలను తీసి భక్తులకు పంచుతారు. ఇదే పద్ధతిలో సుభద్రా దేవి విగ్రహాన్ని కూడా బయటికి తీసుకువచ్చి పద్మ ధ్వజం అనే రథం మీద ప్రతిష్ఠిస్తారు. ఇక దాదాపు ఐదడుగుల ఏడంగుళాల ఎత్తుండే జగన్నాథుడి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో నుంచి బయటికి తీసుకు వస్తుండగానే జయహో జగన్నాథా అంటూ భక్తి పారవశ్యంతో జయజయ ధ్వనాలు చేస్తారు. కులమత భేదాలు లేకుండా అందరూ జగన్నాథుడి విగ్రహాన్ని తాకవచ్చు. ఈ మూడు విగ్రహాలనూ తీసుకువచ్చే వారిని దైత్యులు అంటారు. ఇంద్రద్యుమ్న మహారాజుకన్నా ముందే ఆ జగన్నాథుడిని నీలమాధవుడి రూపంలో అర్చించిన సవరతెగ రాజు విశ్వావసు వారసులు వారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం... మూల విరాట్టులను అంతరాలయం నుంచి బయటికి తీసుకు వచ్చి రథాల మీద ప్రతిష్ఠింపచేసే అర్హత వీరికి మాత్రమే ఉంటుంది. సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై యాత్రకు సిద్ధం కాగా, పూరీ సంస్థానాధీశులు అక్కడికి చేరుకుని జగన్నాథుడికి నమస్కరించి రథం మీదికి ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తారు. అనంతరం స్వామిపై గంధం నీళ్లు చిలకరించి కిందికి దిగి రథం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేస్తారు. ఇదే తరహాలో బలరాముడినీ, సుభద్రా దేవినీ అర్చించి వారి రథాల చుట్టూ కూడా ప్రదక్షిణ చేస్తారు.జగన్నాథుడి రథం మీదుండే ప్రధాన పండా నుంచి సూచన రాగానే కస్తూరి కళ్లాపి చల్లి హారతిచ్చి... జై జగన్నాథా అని పెద్దపెట్టున అరుస్తూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలు పెడతారు. విశాలమైన బోడోదండ (ప్రధానమార్గం) గుండా యాత్ర మంద గమనంతో సాగుతుంది. అతి నెమ్మదిగా జగన్నాథుడి గుడి నుంచి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉండే గుండీచా గుడికి చేరుకోవడానికి దాదాపు పన్నెండు గంటల సమయం పడుతుంది. గుండీచా ఆలయానికి చేరుకున్నాక ఆ రాత్రి బయటే రథాల్లోనే మూలవిరాట్లకు విశ్రాంతినిస్తారు. మర్నాడు ఉదయం మేళ తాళాలతో గుడిలోకి తీసుకు వెళతారు. వారం రోజులపాటు గుండీచా దేవి ఆతిథ్యం స్వీకరించిన అనంతరం దశమినాడు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. ఆ రోజు మధ్యాహ్నానికి మూడు రథాలూ జగన్నాథ ఆలయానికి చేరుకుని గుడి బయటే ఉండి పోతాయి. మర్నాడు ఏకాదశినాడు స్వామి వార్లను బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ఈ వేడుకను చూసేందుకు బారులు తీరుతారు భక్తులు. ద్వాదశి నాడు విగ్రహాలను మళ్లీ గర్భగుడి లోని రత్న సింహాసనంపై అలంకరించడంతో యాత్ర పూర్తి అవుతుంది. చివరగా శ్రీ మందిరం రత్న వేదికకు యథావిధిగా చేరుతాయి. రథాల పైకి తరలించే మూల విరాట్లను తరలించడంతో మొదలై రత్న వేదికపైకి చేర్చడంతో వార్షిక రథయాత్రకు తెర పడుతుంది. ఒడిశాలో అతి ముఖ్యమైన పండుగలలో ఒకటిగా భావించబడే జగన్నాథ రథయాత్ర జూన్ 27, 2025న ఆ షాఢ మాసంలో శుక్ల పక్షంలోని ద్వితీయ తిథి శుక్ర వారం నాడు జరుపుకుంటారు.

## రాజకీయంగా సైడ్ చేసినట్టేనా

రాజమండ్రి, జూన్ 26, )సీనియర్ తెలుగు దేశం పార్టీ నేత అయిన గోరంట్ల బుచ్చయ్య చౌదరికి ఇదే ఎమ్మెల్యేగా ఆఖరి అవకాశమని పార్టీ వర్గాల్లోనే చర్చ జరుగుతుంది. ఆయన వయసు ఇప్పటికే దాటి పోవడంతో పాటు తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడంతో వచ్చే ఎన్నికల్లో గోరంట్ల బుచ్చయ్య చౌదరికి టిక్కెట్ దక్కడం కూడా కష్టమేనంటున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఏదైనాపెద్దల సభకు పంపవచ్చన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వచ్చే ఎన్నికల్లో గెలుపు గుర్రాలకు మాత్రమే కాకుండా 2029 ఎన్నికల్లో ప్రధానంగా యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇప్పటికే పార్టీ నాయకత్వం నిర్ణయించింది. ఇప్పటికే యనమల రామకృష్ణుడి వంటి దిగ్గజ నేతలనే పక్కన పెట్టింది. దీంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరిని రాజకీయంగా సైడ్ చేస్తారేమోనన్న టాక్ బలంగా వినిపిస్తుంది. రాజకీయాల్లో సీనియర్ నేతగా ఆయన అందరికీ సుపరిచితుడే. ప్రకాశం జిల్లా నుంచి తూర్పు గోదావరి జిల్లాకు వచ్చి స్థిరపడిన కుటుంబమయినప్పటికీ రాజకీయంగా బుచ్చయ్య చౌదరి నిలదొక్కుకున్నారు. కమ్మ సామాజికవర్గం నేతగా ఉన్నప్పటికీ కాపులు, బీసీలు బలంగా ఉన్న చోట ఆయన అన్నిసార్లు విజయం సాధించారంటే ఆయన పట్టుదలకు, రాజకీయ చాణక్యానికి నిదర్శనమని చెప్పాలి. ఆయన పోటీ చేసినప్పుడు గెలుపులు అత్యధింగా ఉంటాయి. ఓటమి అనేది చాలా తక్కువ సార్లు ఉంది. రాజమండ్రి పట్టణ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు గెలిచిన గోరంట్ల బుచ్చయ్య చౌదరి రాజమండ్రి రూరల్ కు వెళ్లి పోటీ చేసినా రెండు సార్లు విజయం సాధించారు. దాదాపు ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బుచ్చయ్య చౌదరి ఎన్టీఆర్ మంత్రి వర్గంలో పౌర సరఫరాల శాఖ మంత్రిగా కూడా పనిచేశారు. నాడు టీడీపీ ఆగస్టు సంక్షోభంలో ఎన్టీఆర్ వెంట నిలిచిన బుచ్చన్న తర్వాత పరిణామాల మేరకు చంద్రబాబు పక్షాన చేరారుఅయితే తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అధికారంలోకి వచ్చినా గోరంట్ల బుచ్చయ్యా చౌదరికి మంత్రి యోగం దక్కలేదు. ఆయనకు సామాజికవర్గమే కారణమయింది. ప్రాంతమే శాపంగా మారింది. తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యల్లో కాపులు, బీసీలకు మాత్రమే కేబినెట్ లో అవకాశం కల్పిస్తుండటంతో గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేరు చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన నాలుగు సార్లు ఎప్పుడూ ఆయనకు మంత్రి పదవి దక్కలేదు. అయినా బుచ్చయ్య చౌదరి ఆశతో ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ప్రతి సారీ బుచ్చన్నకు నిరాశే ఎదురవుతుంది. మొన్నటి ఎన్నికల్లోనూ రాజమండ్రి అర్బన్ నియోజకవర్గం ఆదిరెడ్డి కుటుంబానికి ముందుగానే ఫిక్స్ కావడంతో రూరల్ పై చివర వరకూ టెన్షన్ నడిచింది. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది. అయితే పవన్ కల్యాణ్ కు, దుర్గేష్ కు సర్ది చెప్పి ఆయనను నిడదవోలుకు షిఫ్ట్ చేయడంతో గోరంట్లకు చివరకు టిక్కెట్ దక్కింది.

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షా

ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్థ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హెర్మూస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 %-% జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుడయ్యారు. 1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు. అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు. 1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాదికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు. బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా- రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947-48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్థ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది. 1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు. ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికి తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం. మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లొంగిపోక పోతే నిర్ధాక్ష్యంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం. శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత - ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు. భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయస్సులో మృతి చెందారు.

# పవన్ 2.0 ఎలా ఉంటుంది



నెల్లూరు, జూన్ 26, ఆంధ్రప్రదేశ్‌లో పొలిటికల్ హీట్ మళ్లీ పొగలు సెగలుగక్కుతోందా అంటే?.. పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయని అంటున్నారు పొలిటికల్ పండిట్స్. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలి అడుగు సభ జరిగింది. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగం చుట్టూ ఇప్పుడు కొత్త చర్చ మొదలైంది. తేడా చేస్తే? తొక్కి నార తీస్తామన్న డిప్యూటీ సీఎం మాటల్ని గుర్తు చేస్తూ?. పవన్ మళ్ళీ అఫెన్సివ్ మోడ్‌లోకి వచ్చారా అంటూ చర్చించుకుంటున్నాయి రాజకీయవర్గాలు. వైసీపీ రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారాయన. పోలీసులపై ఒత్తిడి తెస్తోందని, ఇలాంటి పరిస్థితిని సహించే ప్రసక్తే లేదని క్లారిటీగా చెప్పేశారు పవన్. గొంతులు కోస్తాం? అన్న బెదిరింపులు పిచ్చి ధోరణి అంటూ తీవ్రంగా స్పందించారాయన. అలాంటి అసాంఘిక వ్యాఖ్యలకు భయపడేది లేదని, శాంతిభద్రతల విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించాల్సిందేనని అధికారులను ఆదేశించారు. ఇప్పుడీ వ్యాఖ్యల్ని ప్రస్తావిస్తున్న విశ్లేషకులు..ఏడాది తర్వాత పవన్ తీరు మారిందని చెప్పుకొస్తున్నారు. గడిచిన ఏడాది కాలంగా?. పాలన మీద, షూటింగ్స్‌పై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం? ఇకనుంచి రాజకీయంగా విపక్షం మీద విరుచుకుపడేందుకు సిద్ధమైనట్టు కనిపిస్తోందని అంటున్నారు. సుపరిపాలనలో ఈ దిశగా సంకేతాలిచ్చినట్టు అంచనా వేస్తున్నారు పరిశీలకులు. ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళడమేకాకుండా? వైసీపీ ఆరోపణలకు దీటైన కౌంటర్స్ ఇచ్చే దిశగా పవన్ వ్యూహం సిద్ధం చేసుకున్నట్టు కనిపిస్తోందని అంటున్నారు. సభలో ఉప ముఖ్యమంత్రి ప్రసంగాన్ని గమనిస్తే? ఈ విషయం క్లియర్‌గా అర్థమవుతోందని అంటున్నారు. పవన్ వ్యాఖ్యల ప్రకారం? గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, అవినీతి వ్యవహారాలను విస్తృతంగా ప్రస్తావించి ఇప్పుడు ప్రజలకు వివరించాల్సిన సమయం వచ్చింది. ఇక సైలెంట్‌గా ఉంటే లాభం లేదని, వైసీపీ తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నంలో ఉందని భావిస్తున్నారట పవన్. విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, నిజాలను ప్రజల ముందుంచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని పవన్ అభిప్రాయపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఓవైపు పరిపాలన విషయంలో వేగంగా ఆడుగులు వేస్తుంటే?. దానికి తోడుగా పవన్ కూడా రాజకీయంగా వ్యూహాత్మక దూకుడు పెంచాలని నిర్ణయించుకున్నట్లు అంచనా వేస్తున్నారు పొలిటికల్ పండిట్స్. ప్రజా వేదికలపై ప్రభుత్వ ప్రతినిధిగా మాట్లాడుతూ? ఆల్‌రౌండర్ పాత్ర పోషించేందుకు పవన్‌కళ్యాణ్ సిద్ధమైనట్టు చెప్పుకుంటున్నారు. ప్రజలకు మంచి చేయాలంటే? నిజాలను చెప్పాలి, గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు బహిర్గతం చేయాలన్నది డిప్యూటీ సీఎం ప్లాన్ అట. వాస్తవాల మీద నిర్మితమైన పాలన జరిగితేనే ప్రజలకు నమ్మకం పెరుగుతుందని సభలో అన్నారు పవన్ కళ్యాణ్. ఈ మాటలు కేవలం ఆయన వైఖరిని తెలియజేయడమే కాకుండా, ప్రతిపక్షాలపై స్పందించే కొత్త దిశను సూచిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అటు వైసీపీ ప్రభుత్వ కాలంలో జరిగిన రకరకాల అవకతవకలపై దర్యాప్తు వేగం పెరుగుతోంది. వాటి సారాంశాన్ని రాజకీయ పరంగా ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యతను పవన్ స్వయంగా తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని అంటున్నారు. ఇందులో భాగంగా? రాబోయే రోజుల్లో ప్రెస్‌మీట్లు, పబ్లిక్ మీటింగ్స్ పెట్టే అవకాశం ఉందని అంటున్నారు. ఈ దిశగా జనసేన కార్యకర్తలకు కూడా సందేశాలు వెళ్ళబోతున్నాయట. మొత్తంగా సుపరిపాలన సభలో? పవన్ తన కొత్త రోల్ గురించి క్లియర్‌గా చెప్పినట్టే కనిపిస్తోందని అంటున్నారు పొలిటికల్ పరిశీలకులు.

# ఇద్దరి కంటే తక్కువ పిల్లలు ఉంటే అనర్హత
## ఏపీలో జనాలు పెంచే కసరత్తు

తిరుపతి, జూన్ 26, రాష్ట్రంలో జనాభా పెరుగుదలపై పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్నారు ఏపీ సీఎం చంద్రబాబు. ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో జనాభా ఆశించిన స్థాయిలో పెరగడం లేదని.. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రమాదం తప్పదని ఆయన హెచ్చరిస్తున్నారు. తాజాగా తొలి వెలుగు సభలో సైతం దీనిపై గట్టిగానే హెచ్చరించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ మాదిరిగా ఏపీలో సైతం జనాభా పెరగాల్సిందేనని తేల్చి చెప్పారు. దీనికోసం గట్టిగానే కృషి చేస్తామని అన్నారు. అందులో భాగంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లలు ఉంటేనే పోటీకి అర్హత విషయాన్ని ప్రస్తావించారు. జనాభా పెరుగుదలపై చంద్రబాబు మాట్లాడడం ఇదే తొలిసారి కాదు. ఇటీవల పలు వేదికలపై చంద్రబాబు ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీంతో చంద్రబాబు దూరదృష్టితో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని అర్థమవుతోంది. గతంలో ఇద్దరు హద్దు.. ఒకరు ముద్దు అన్న నినాదంతో జనాభా నియంత్రణ సాగింది. ఇద్దరికంటే ఎక్కువగా పిల్లలు ఉంటే స్థానిక సంస్థల్లోపోటీకి అనర్హులని తేల్చారు కూడా. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. జనాభా ఎక్కువగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్న పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా జనాభా నియంత్రణ కావడంతో పిల్లలు యువత సంఖ్య తగ్గుముఖం పట్టింది. నడివయస్కులతో పాటు వృద్ధుల సంఖ్య పెరిగింది. దీంతో ఉద్యోగ ఉపాధి మార్గాలు తగ్గుముఖం పట్టాయి. వాటి ప్రభావం అభివృద్ధి పై పడింది. అందుకే ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు పిల్లలను కనాలని పిలుపునివ్వడం కూడా ఆశ్చర్యం వేసింది. అయితే జనాభా పెరుగుదలతో అభివృద్ధి ముడిపడి ఉన్నందున సీఎం హోదాలో ఆయన ఈ వ్యాఖ్యలు తరచూ చేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాలైన బీహార ఉత్తరప్రదేశ్లో జనాభా సంఖ్య అధిక సంఖ్యలో ఉంది. అక్కడ ఉద్యోగంతో పాటు ఉపాధి మార్గాలు కూడా పెరిగాయి. ప్రజల తలసరి ఆదాయం పెరిగింది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రాజ్యాంగబద్ధ నిధులు కూడా అధికంగా ఆ రాష్ట్రాలకు వస్తున్నాయి. ఒక కుటుంబ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకొని తలసరి ఆదాయాన్ని లెక్కిస్తారు. అయితే ఈ విషయంలో ఆ రెండు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. అందుకే చంద్రబాబు పదేపదే ఆ రెండు రాష్ట్రాల ప్రస్తావన తీసుకొస్తున్నారు. వీలైనంతమందిని ఎక్కువగా కనాలని సూచిస్తుండడం విశేషం. మరోవైపు జనాభా పెరుగుదల కోసం ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. గతంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులుగా పరిగణించేవారు. అయితే ఇప్పుడు జనాభా పెరుగుదలను ప్రోత్సహించేందుకుగాను ఏపీ ప్రభుత్వం ఆ నిబంధనను తొలగించింది. దీనికి సంబంధించిన చట్ట సవరణ బిల్లును కూడా ఏపీ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కుటుంబ నియంత్రణ చర్యల్లో భాగంగా 1994లో ఈ నిబంధనను తీసుకొచ్చారు. అయితే సంతానోత్పత్తి రేటు తగ్గడం, వృద్ధుల సంఖ్య పెరగడం వంటి కారణాలవల్ల ఏపీ ప్రభుత్వం ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. 2001లో ఏపీలో సంతాన ఉత్పత్తి సామర్థ్యం రేటు 2.6% గా ఉంది. ప్రస్తుతం అది 1.5 శాతానికి తగ్గిపోయింది. అందుకే చంద్రబాబు పదేపదే ఈ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏపీలో జనాభా పెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు, ప్రోత్సాహకాలు పెడుతున్నారు.

# ఇక ఉమా వంతేనా...

విజయవాడ, జూన్ 26, టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమా పార్టీ మారతారన్న ప్రచారం ఇప్పుడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో హాట్ హాట్‌గా నడుస్తోంది. పార్టీ మారతారన్నది ఒక ఎత్తయితే?. ఏకంగా వైసీపీలో చేరబోతున్నారంటూ సోషల్ మీడియాలో ఊదరగొట్టడం కలకలం రేపుతోంది. ఆ ప్రచారానికి ఉక్కిరి బిక్కిరయిన ఉమా? చివరికి స్పందించి ఖండించాల్సి వచ్చిందంటే? పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. టీడీపీకి అత్యంత లాయల్ అన్న పేరుంది దేవినేనికి. 2014-19 మధ్య చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారాయన. 2019 ఎన్నికల్లో తొలిసారి ఓటమి చవిచూసిన ఉమా 2024లో టీడీపీ టికెట్ కూడా తెచ్చుకోలేకపోయారు. 2019లో వైసీపీ తరపున పోటీచేసి తనపై గెలిచిన వసంత కృష్ణ ప్రసాద్‌కే 24లో తెలుగుదేశం పార్టీ టికెట్ ఇవ్వడంతో దేవినేని ఉమా పరిస్థితి దారుణంగా మారిపోయిందని చెప్పుకుంటారు. ఎన్నికలకు ముందు కాస్త అసమ్మతి గళం వినిపించిన ఉమా? ఆ తర్వాత పార్టీ అధికారంలోకి రావడంతో బహిరంగంగా ఎక్కడా నోరు తెరిచే సాహసం చేయడం లేదు. ఎలాగూ అధికారంలో ఉన్నాం కాబట్టి ఏదోఒక నామినేటెడ్ పదవి దక్కుతుందని భావించారట ఆయన. కానీ? జిల్లాలో పలువురికి పదవులు దక్కుతున్నా? ఉమా ఊసే రావడం లేదు. ఒక దశలో ఎమ్మెల్సీ వస్తుందని గట్టిగా ప్రచారం జరిగినా? చివరికి అది కూడా దక్కలేదు. మరోవైపు మైలవరం టీడీపీ శాసనసభ్యుడిగా వసంత కృష్ణ ప్రసాద్ ఉన్నప్పటికీ?. ఉమా జోక్యం మాత్రం తగ్గడంలేదన్నది ఎమ్మెల్యే వర్గం మాట. నియోజక వర్గంలో అనేక విషయాల్లో ఉమా జోక్యం చేసుకోవడం ఎమ్మెల్యే వర్గాన్ని ఇరిటేట్ చేస్తోందట. ఇద్దరు నేతల మధ్య ఏ మాత్రం సఖ్యత లేదన్నది ఇక్కడ బహిరంగంగా చెప్పుకునే మాటే.

# ఇంటింటికి తొలి అడుగు

విజయవాడ, జూన్ 26,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఎప్పుడూ అంతే. ఒకరు ప్రారంభించిన కార్యక్రమాన్ని మరొకరు మొదలు పెడతారు. ఆ కార్యక్రమం సక్సెస్ అయిందా? లేదా అన్నది చూడరు. 2019 ఎన్నికల్ల వైసీపీ గెలిచిన తర్వాత అనేకసంక్షేమ పథకాలను అమలు చేసింది. దాదాపు రెండున్నర లక్షల కోట్ల రూపాయల డబ్బులను లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసింది. దీంతో వైసీపీ ఒక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యేలను గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఈ కార్యక్రమాన్ని డిజైన్ చేసింది. గడప గడపకు ప్రభుత్వం అని పేరుపెట్టింది. అయితే ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే డిజైన్ తో టీడీపీ కార్యక్రమాన్ని సిద్ధం చేసింది. ఇంటింటికి తొలి అడుగు విజయయాత్రగా నామకరణం చేసింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యేలకు చంద్రబాబు ఆదేశించారు. అంటే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలుచేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. సూపర్ సిక్స్ హామీలను ఇప్పటికే చాలా వరకూ అమలు చేశామని, పింఛను నాలుగు వేల రూపాయలు ఇవ్వడంతో పాటు దీపం పథకం కింద గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా ఇవ్వడం, తల్లికి వందనం పథకం కింద పదమూడు వేల రూపాయలను ఒక్కొక్కరికి ఇవ్వడంతో పాటు ఆగస్టు పదిహేనో తేదీ నుంచి మహిళల ఉచిత బస్సు అమలు చేస్తామని చెప్పడం వంటివి చేయాలని చంద్రబాబు ఎమ్మెల్యేలకు, ప్రజప్రతినిధులకు చెప్పారు. జులై ఒకటో తేదీ నుంచి అన్ని నియోజకవర్గాల నుంచి క్షేత్రస్థాయిలో నివేదికలను చంద్రబాబు తెప్పించుకుని ప్రజల మనోభావాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తారట. ఉచిత ఇసుక, మద్యం వంటి విషయాల్లో కొందరు ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొనడంతో వారిని కూడా జనం వద్దకు పంపాలన్నది చంద్రబాబు ప్రయత్నం. గత ఏడాది నుంచి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వారికి వివరించి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా నియోజకవర్గం పరంగా ఏమి మంచి జరిగిందో జనాలకు వివరించి వారిలో ఏదైనా అసంతృప్తి ఉంటే దానిని తొలగించే ప్రయత్నం చేయాలని చంద్రబాబు ఆలోచన. అయితే జనం నుంచి ఎలాంటి స్పందన వస్తుందన్నది ఎమ్మెల్యేలకు అంతుచిక్కడం లేదు.. చంద్రబాబు చేయించిన సర్వేల్లో ప్రభుత్వంపై సానుకూలత ఉన్నప్పటికీ ఎమ్మెల్యేల్లో ఎక్కువగా అసంతృప్తి ఉందని తేలింది. అందులో కొత్తగా ఎన్నికైన దాదాపు ఎనభై మంది ఎమ్మెల్యేల్లో అధిక శాతం కూడా ఉండటంతో వారిని ప్రజలతో మమేకం చేయాలని చంద్రబాబు ఈ కార్యక్రమాన్నితలపెట్టినట్లు కనపడుతుంది. దీంతో పాటు క్యాడర్ ను కూడా కలుపుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనగలిగితే ఎమ్మెల్యేలకు, క్యాడర్ కు మధ్య ఉన్న గ్యాప్ కూడా తొలగిపోతుందని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు హడావిడి కాకుండా నాలుగేళ్ల ముందు నుంచే చర్యలు తీసుకోవడంతో పాటు కార్యకర్తలను కూడా మోటివేట్ చేయడం ఈ కార్యక్రమం లక్ష్యంగా కనిపిస్తుంది. మరి ఈ కార్యక్రమం ఏ మేరకు సక్సెస్ అవుతుందన్నది చూడాల్సి ఉంది.

# 5 వేల ఎకరాల్లో..ఏపీలో కొత్త ఎయిర్‌పోర్టు.

విజయవాడ, జూన్ 26, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాజధాని అమరావతి నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న సంగతి తెలిసిందే. అమరావితి అంతర్జాతీయ స్థా?యి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిలో మౌలిక వసతుల ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తోంది. అమరావతిని ఇతర ప్రాంతాలతో అనుసంధానం చేసేందుకు అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అలాగే స్పోర్ట్స్ సిటీ, అమరావతిలోక్రికెట్ స్టేడియం వంటి నిర్మాణాలను చేపట్టనుంది. ఈ నేపథ్యంలో రాజధాని అమరావతి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని.. అమరావతి కోసం అదనంగా భూమిని సమీకరించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి అదనపు భూసమీకరణకు ఏపీ కేబినెట్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.లో ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక విషయాలు వెల్లడించారు. అమరావతిలో అదనపు భూ సమీకరణకు జులై నెలాఖరులో సీఆర్డీఏ నోటిఫికేషన్ ఇస్తుందని మంత్రి నారాయణ వెల్లడించారు. అలాగే అదనపు భూ సమీకరణకు 2015 నాటి నిబంధనలే అమలు చేయనున్నట్లు తెలిపారు. దీనికి ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అమరావతిలో 5000 ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించనున్నారు. అలాగే 2,500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ, మరో 2,500 ఎకరాల్లో స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం 10 వేల ఎకరాలు అవసరమవుతుందని మంత్రి నారాయణ వెల్లడించారు. మరోవైపు అమరావతి భవిష్యత్తు అవసరాల కోసం అదనంగా 45 వేల ఎకరాలు సమీకరించనున్నట్లు మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు ఇవ్వాల్సి ఉంటుందన్న ఆయన.. ఈ నేపథ్యంలో ఎక్కువ భూమి అవసరమవుతోందన్నారు. మరోవైపు అమరావతిలో అనేక సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తోంది. రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే క్రమంలో పలు కంపెనీలకు, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అమరావతిలో భూములు కేటాయిస్తోంది. ఇప్పటి వరకూ సుమారుగా 74 సంస్థలకు అమరావతిలో భూములు కేటాయించారు. మూడేళ్లలోగా అమరావతి నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# కనిపించని కోనసీమ లీడర్లు...

కాకినాడ, జూన్ 26, అమలాపురం ఎమ్మెల్యేగా గెలిచి వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన విశ్వరూప్..అప్పుడు కీలకంగా వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మాత్రం ఆయన పార్టీ యాక్టివిటీకి దూరంగా ఉంటున్నారట. ప్రజా సమస్యల మాట అటు ఉంచితే క్యాడర్ కష్టసుఖాలను కూడా పట్టించుకోవడం లేదట. ఇదే జిల్లా నుంచి అప్పట్లో వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా చేసిన అప్పటి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉంటూ ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ కార్యక్రమాలను కూడా గాలికి వదిలేయడంతో ముమ్మిడివరం నియోజకవర్గంలో వైసీపీ యాక్టివిటీ లేకుండా పోయిందటఇక వైసీపీ రాజ్యసభ సభ్యునిగా కొనసాగుతున్న రామచంద్రపురానికి చెందిన పిల్లి సుభాష్ చంద్రబోస్.. గత ఎన్నికల్లో తన తనయుడు పిల్లి సూర్య ప్రకాశ్‌కు టికెట్ ఇప్పించుకుని గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. కానీ కూటమి గాలికి ఓటమి తప్పలేదు. ఎంపీ బోస్ మాత్రం రామచంద్రపురం నియోజవర్గంలో పార్టీ కార్యక్రమంలో నేనున్నానని చెప్పుకునే విధంగా తన కొడుకుతో పాటు కనిపిస్తున్నారు. కేవలం నియోజకవర్గానికి మాత్రమే పరిమితమయ్యారు. ఇక ఇదే జిల్లా నుంచి ఎమ్మెల్సీగా అవకాశం దక్కించుకున్న మరొక నేత తోట త్రిమూర్తులు. మండపేట నియోజవర్గం నుంచి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన ఆయన ఏడాదిగా తన నియోజకవర్గం వరకు అరకొరగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారట. అయితే తోట త్రిమూర్తులు పెద్దగా యాక్టీవ్‌గా కనిపించడం లేదని క్యాడర్ అసంతృప్తిగా ఉన్నారట. గత ప్రభుత్వంలో ప్రభుత్వ విప్‌గా చేసి ఇప్పుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి. ఇటీవల కాలంలో జిల్లా అధ్యక్షుడిగా పదవి ఇచ్చినప్పటికీ అది హోదాగానే ఫీల్ అవుతున్నారట ఆయన. పార్టీ కార్యక్రమాలు కానీ..ప్రజా సమస్యలపై పోరులో దూకుడు చూపించడం లేదంటున్నారు క్యాడర్. ఇక పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గం వైసీపీ పరిస్థితి చెప్పనవసరమే లేదు. అసలు ఆ లీడర్లు ఎక్కడున్నారో కూడా ఎవరికీ తెలియదు. నేతలు ఎవరికి వారు బిజీ అయిపోవడంతో అంబేద్కర్ కోనసీమ జిల్లాలో వైసీపీ క్యాడర్ పరిస్థితి అగమ్యగోచరంగా ఉందట. కార్యకర్తలకు భరోసా ఇచ్చే నేత లేకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో ఉన్నారట. ఇప్పటికైనా అంబేద్కర్ కోనసీమ జిల్లాపై పార్టీ అధినేత జగన్ స్పెషల్ ఫోకస్ పెట్టాలని కోరుతున్నారట క్యాడర్. జిల్లాలో రాబోయే రోజుల్లో వైసీపీ యాక్టివిటీ స్పీడప్ అవుతుందో లేదో చూడాలి.

# జగన్ పర్యటనల్లో ఏం జరుగుతోంది...



గుంటూరు, జూన్ 26, జగన్ పర్యటనలో ఇద్దరు కాదు ముగ్గురు చనిపోయినట్లు వార్తలు వస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి కొద్ది రోజుల కిందట పల్నాడు జిల్లాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఓ వైసిపి నేత విగ్రహ ఆవిష్కరణకు గాను ఆయన పోలీస్ ఆంక్షలు నడుమ తాడేపల్లి నుంచి బయలుదేరారు. కానీ భారీ కాన్వాయ్ తో పాటు భారీ జన సమీకరణ నడుమ జగన్ పర్యటన సాగింది. ఈ క్రమంలో జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని సింగయ్య అనే వృద్ధుడు చనిపోయాడు. మరో వ్యక్తి అపస్మారక స్థితికి చేరుకొని.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తాజాగా మూడో మృతి వెలుగులోకి వచ్చింది. బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన యువకుడిని ఆసుపత్రికి తరలించే క్రమంలో అంబులెన్స్ గంటసేపు జగన్ పర్యటనలో ఆగిపోవడంతో అతను చనిపోయాడు. తాజాగా ఆ యువకుడి తండ్రి విలపిస్తూ చెప్పిన మాటలు ఓ వీడియోలో వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ర్యాలీ సమయంలో అంబులెన్స్ కు దారి ఇచ్చి ఉంటే తమ కుమారుడి ప్రాణాలు దక్కేవని మృతుడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. ముప్పాళ్ళకు చెందిన మధు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సత్తెనపల్లిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అతనికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చినట్లు వైద్యులు నిర్ధారించారు. మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్ లో గుంటూరు తరలిస్తున్న సమయంలో జగన్ పర్యటనలో చిక్కుకున్నారు. దీంతో భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. దాదాపు గంటసేపు అంబులెన్స్ ట్రాఫిక్ లో ఇరుక్కుంది. తరువాతే మధును గుంటూరుకు తరలించారు. ఈనెల 19న ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మధు మృతి చెందాడు. అయితే సకాలంలో ఆసుపత్రిలో చేర్పించకపోవడం వల్లే ఆయన మృతి చెందారని వైద్యులు చెబుతున్నారు. దీంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. జగన్ సత్తెనపల్లి ర్యాలీలో పాల్గొన్న జయవర్ధన్ రెడ్డి అనే యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు. మరోవైపు సింగయ్య సైతం జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పుడు మధు సైతం జగన్ కాన్వాయ్ వల్లే చనిపోయాడని తెలియడం ఆందోళన కలిగిస్తోంది. కాగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. ముగ్గురు ప్రాణాలను బలిగొన్నారని జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

వరుసవివాదాలు

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌పీసీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఇటీవలి పల్నాడు పర్యటనపై వివాదం కొనసాగుతోంది. మొదట పర్యటనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. తర్వాత ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చారు. అయితే ఈ పర్యటనలో ఓ యువకుడు రప్ప.. రప్ప నరుకుతా అని ప్లకార్డు ప్రదర్శించాడు. దానిపై అధికార, విపక్ష పార్టీల మధ్య రచ్చ జరుగుతుండగానే ఓ వృద్ధుడు కాన్వాయ్ కారుకింద పడి మరణించడం.. తర్వాత వృద్ధుడు పడింది జగన్ కారే అని వీడియోలు బయటకు రావడం వివాదాస్పదమైంది. ఈ ఘటనకు సంబంధించి జగన్‌పై ఏపీ పోలీసులు ఏ2గా పేర్కొనడం రాజకీయ, న్యాయ చర్చలకు దారితీసింది. జగన్ కాన్వాయ్ కింద వృద్ధుడు పడి మరణించడం ద్వారా జగన్‌మోహన్ రెడ్డి కాన్వాయ్‌పై ఆరోపణలు రావడం జరిగింది. న్యాయపరంగా, ఒక నాయకుడు తన కాన్వాయ్‌లోని వాహనాల చర్యలకు ఎంతవరకు బాధ్యత వహించాలి? ఈ సంఘటనలో జగన్‌ను నిందితుడిగా పేర్కొనడం వెనుక ఉన్న కారణాలు ఏమిటి? ఈ ప్రశ్నలు నీతి, నిర్లక్ష్యం, మరియు బాధ్యతల సమస్యలను లేవనెత్తుతున్నాయి. న్యాయస్థానం ఈ కేసును ఎలా విచారిస్తుందనేది భవిష్యత్తులో రాజకీయ నాయకుల బాధ్యతను నిర్ణయించే కీలక అంశంగా మారవచ్చు. ఈ ప్రమాదంలో భిన్న కోణాలు ఉన్నాయి. కారు నడిపింది ప్రభుత్వ డ్రైవర్ కాబట్టి అతనిపై కేసు పెట్టాలి కానీ, జగన్‌పై కేసు ఎలా పెడతారనివైసీపీ ప్రశ్నిస్తోంది. అదే సమయంలో భద్రత విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, జగన్ టూర్‌కు ఆంక్షలు విధించడం కూడా ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. అయితే ఆంక్షలు విధించినప్పుడు వాటిని పాటించకుండా.. అతిక్రమించడమే కాకుండా ప్రమాదానికి కారణం కావడం నేరమే కదా అని అధికార కూటమి నేతలు పేర్కొంటున్నారు. ఇక రోప్ పార్టీ విషయానికి వస్తే.. జగన్ ఎక్కడ పడితే అక్కడ ఆగడం, పర్యటన షెడ్యూల్‌లో లేకపోవడం కూడా రోప్ పార్టీ పోలీసులకు ఇబ్బందిగా మారింది. ఇక వైపీపీ నేతలు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన ఘటనలను కూడా ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు దెందలూరులో నిర్వహించిన సభలో తొక్కిసలాట జరిగి 8 మంది మరణించారు. కానీ, పోలీసులు నాడు టీడీపీ నేతలపై కేసు పెట్టారు. చంద్రబాబుపై కాదు. ఇదే అంశం ప్రస్తావిస్తున్నారు. అయితే ఘటన స్థలంలో చంద్రబాబు ఉన్నా.. ప్రత్యక్షంగా ఆయన కారణం కాలేదు. కానీ, ఇక్కడ జగన్ కారులో ఉండడం, ఆంక్షలు పాటించకపోవడంతో పోలీసులు కేసు పెట్టారు.

రాజకీయ నాయకుల బాధ్యతలు..

రాజకీయ నాయకులు తమ పర్యటనల సమయంలో భద్రతా ఏర్పాట్లను ఎంతవరకు పర్యవేక్షించాలి? కాన్వాయ్‌లోని డ్రైవర్లు, భద్రతా సిబ్బంది చర్యలకు నాయకుడు బాధ్యత వహించాలా? ఈ ఘటన రాజకీయ కార్యకలాపాల సమయంలో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. గతంలో ఇలాంటి ఘటనలు జరిగిన సందర్భాలను పరిశీలిస్తే, నాయకులపై నేరపరమైన ఆరోపణలు చేయడం అరుదైనప్పటికీ, ఈ కేసు ఒక కొత్త దృష్టాంతాన్ని సృష్టించవచ్చు. ఈ ఘటన రాజకీయంగా వైఎస్సార్‌సీపీ, జగన్‌మోహన్ రెడ్డి ఇమేజ్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ప్రతిపక్ష పార్టీలు ఈ ఘటనను రాజకీయంగా ఉపయోగించుకునే అవకాశం ఉందా? ప్రజల దృష్టిలో ఈ ఘటన నాయకుల బాధ్యతాయుతమైన ప్రవర్తనపై కొత్త చర్చను రేకెత్తిస్తుంది. సోషల్ మీడియా వేదికలలో ఈ ఘటనపై వస్తున్న స్పందనలు రాజకీయ నాయకులు తమ కార్యకలాపాల్లో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయి. ఈ ఘటన రాజకీయ నాయకులు తమ కాన్వాయ్‌లు, భద్రతా ఏర్పాట్లపై మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. న్యాయపరమైన దృక్కోణంలో ఈ కేసు నాయకుల జవాబుదారీతనం గురించి కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. అదే సమయంలో, రాజకీయంగా ఈ ఘటన వైసీపీ ఇమేజ్‌పై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# ఇరాన్ కర్మ ఫలితం అనుభవిస్తోందా....

16 ఏళ్ల అత్యాచార బాధితురాలి శాపమే ఇరాన్ ని పట్టిపీడిస్తోందా? సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం ఎంతవరకూ కరెక్ట్? శాపాలు తగులుతాయా అసలు? భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన కర్మ ఫలం అంటే ఇదేనా?16 ఏళ్ల అతేఫా సహాలేహ్ కి ఇరాన్ కోర్టు ఉరిశిక్ష విధించింది,అందరూ చూస్తుండగా బాలికను బహిరంగంగా ఉరితీశారు. ఆమె తప్పు చేయలేదు..పైగా బాధితురాలు.అత్యంత పాశవికంగా అత్యాచారానికి గురైందిజఆమెకు న్యాయం చేయాల్సిందిపోయి ఉరితీశారుఈ ఘటనతో ఇరాన్ దేశం మొత్తం అట్టుడికింది..ఇంత దారుణమా అని ప్రపంచ దేశాలన్ని బాలికకు మద్దతుగా గొంతెత్తాయి...రెండు దశాబ్దాల క్రితం ఇరాన్ న్యాయస్థానం అమలు చేసిన ఉరిశిక్ష సంచలనం రేపిందిమళ్లీ ఇప్పుడు ఆ విషయాన్ని మరోసారి గుర్తుచేసుకుంటున్నారు నెటిజన్లు...నిండు సభలో ద్రౌపదిని అవమానించినందుకు ప్రతిగా కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. మహిళను అవమానించిన వారుమాత్రమే కాదు చూస్తూ ఊరుకున్నవారు కూడా అంతమైపోయారుమాయావిగా వచ్చి సీతాదేవిని ఎత్తుకెళ్లిన రావణుడికి, లంకేయులకు ఎలాంటి గతి పట్టిందో రామాయణంలో ఉందిఇప్పుడు ఆ బాలికకు జరిగిన అన్యాయమే..ఇరాన్ ను శాపమై పట్టిపీడిస్తోందనే ప్రచారం జరుగుతోంది. ఆ బాలికకు చేసిన అన్యాయానికి ఇన్నేళ్ల తర్వాత తగిన మూల్యం చెల్లించుకుంటోంది. ఇజ్రాయెల్ దాడులతో వందలమంది ఇరానియన్ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారంటే ఆ 16 ఏళ్ల బాలిక శాపమేనా అని సోషల్ మీడియాలో డిస్కషన్ జరుగుతోంది. 2004లో జరిగిన ఈ సంఘటన తర్వాత నుంచి ఇరాన్ ప్రజలకు కష్టాలు మొదలయ్యాయంటున్నారు. ప్రస్తుత పరిస్థితి కూడా ఈ కోవకే చెందుతుందని ఆనాడు జరిగిన సంఘటనను మరోసారి గుర్తుచేసుకుంటున్నారు. ఇరాన్ లో నేకా నగరానికి చెందిన అతేఫా సహాలేహ్ కి పవిత్రతకు వ్యతిరేకంగా నేరం చేసిందంటూ మరణశిక్ష విధించారు. వాస్తవానికి ఇతర దేశాల్లో అత్యాచారానికి గురైతే బాధితురాలిగా పరిగణిస్తారు. కానీ ముస్లిం దేశం అయిన ఇరాన్ లో కన్యత్వాన్ని కోల్పోయినందుకు ఆమె దోషిగా నిలబడాల్సి వచ్చింది. కనీసం ఆమె ఆవేదన ఏంటో చెప్పుకునే అవకాశం కల్పించకుండానే నేరస్థురాలిగా తీర్మానించారు. అప్పటికీ ఆమె హిజాబ్ తొలగించి తన బాధను చెప్పుకునే ప్రయత్నం చేసింది కానీ దాన్ని కూడా తప్పుగా పరిగణించింది న్యాయస్థానం. ఉరిశిక్ష విధించడమే కాదు బహిరంగంగా అమలుపర్చారు.అతేఫా సహాలేహ్ చిన్నప్పుడే తల్లిదండ్రులను ఓ ప్రమాదంలో కోల్పోయింది. సోదరుడు నదిలో పడి చనిపోయాడు. అమ్మమ్మ తాతయ్య దగ్గర పెరిగింది అతేఫా. కుటుంబ సభ్యులంతా కూలికోసం ఇంటికి దూరంగా వెళ్లాల్సి వచ్చేది. ఇంట్లో ఒంటరిగా ఉండేది 15 ఏళ్ల అతేఫా. ఇది గమనించాడు పక్కింట్లో ఉన్న 51ఏళ్ల అలీ. ఒంటరిగా ఉన్న ఆమెను అత్యాచారం చేయడమే కాదు ఈ విషయం ఎవరితో అయినా చెబితే చంపేస్తానని బెదిరించి వందలసార్లు శారీరకంగా హింసించాడు. ఆ బాధను భరించలేకపోయిన అతేఫా పోలీసులను ఆశ్రయించింది. ఇదే ఆమెకు శాపమైంది. కన్యత్వాన్ని పోగొట్టుకున్న మహిళ..షరియా చట్టం ప్రకారం బాధితురాలు కాదు నేరస్తురాలు. ఈ నేరం కిందే ఆమెను జైల్లో పెట్టారు. అక్కడ కూడా లైంగిక వేధింపులకు గురైంది అతేఫా సహాలేహ్. ఈ విషయం న్యాయస్థానం వరకూ చేరింది కానీ ఆమెకు న్యాయం జరగలేదు సరికదా కన్యత్వాన్ని కోల్పోయిన నేరం కింద ఉరితీశారు. అతేఫా సహాలేహ్ ని ఉరితీసేనాటికి ఆమె వయసు 22 ఏళ్లని , వ్యభిచార నేరానికి పాల్పడిందని కోర్టు చెప్పింది. కానీ ఆమె వయసు 16 సంవత్సరాలు అని కొందరి వాదన. ఇరానియన్ చట్టాల ప్రకారం 18 సంవత్సరాల కన్నా తక్కువ వయసు ఉన్నవారిని ఉరితీయకూడదు. అతేఫా సహాలేహ్ విషాద గాధను ఓ వ్యక్తి ఎక్స్ లో పోస్ట్ చేశాడు. అతేఫాను ఉరితీసినప్పటి నుంచీ ఇరాన్ ప్రజలకు శాంతి లేదని పోస్ట్ లో పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇరాన్ లో పరిస్థితికి కూడా ఆ బాలిక శాపమే కారణం అనే చర్చ జరుగుతోంది. అతేఫా కథ విన్నవారంతా ఇదేం న్యాయం? ఇదెక్కడి చట్టం? ఇంత అన్యాయమా? ఆమె శాపం తగిలింది అనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదంటున్నారు. శాపాలు, పాపాలు తగలడంలో వాస్తవం ఎంత అంటే ప్రూవ్ చేసే సాక్ష్యాలు లేకపోవచ్చేమో..కానీ చేసిన కర్మకు తగిన ఫలితం అనుభవించక తప్పదని భగవద్గీతలో శ్రీ కృష్ణుడు చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. మరోవైపు శాంతి పరిస్థితులు ఏర్పడినందుకు ఇరాన్ మాత్రం అణ్వాయుధాల ప్రస్తావనే చేయొద్దని అమెరికా హెచ్చరించింది. ఇదే విషయాన్ని ట్రంప్ ప్రకటించారు. అయితే ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయలేదనే డోనాల్డ్ ట్రంప్ వాదనను ఇరాన్ అణుశక్తి సంస్థ తోసిపుచ్చింది. ఇరాన్ అణు కార్యక్రమం ఎటువంటి అడ్డంకులు లేకుండా తిరిగి ప్రారంభమవుతుందని, యురేనియం సుసంపన్నతను తిరిగి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. ఈ యుద్ధ వాతావరణంతో ఇరు దేశాలు భారీగానే నష్టపోయాయి. 24 మంది ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోగా వెయ్యిమందికిపైగా గాయాలు పాలయ్యారు. ఆస్తినష్టం సరేసరి. 974 మంది ఇరానియన్లు మృతి చెందగా.. మూడు వేలకుపైగా ప్రజలు గాయపడ్డార. భారీగా ఆస్తులు ధ్వంసం అయ్యాయి.

వీటికి తోడు వేల మంది విదేశీయులు అక్కడి నుంచి తరలిపోయారు. ఇజ్రాయెల్- ఇరాన్ మధ్య పరిస్థితులు చక్కబడటంతో చాలా దేశాలు తమ గగన తలాలను తెరుస్తున్నాయి. గల్ఫ్ దేశాలన్నీ మంగళవారం ఉదయానికి సాధారణ విమాన సేవలు పునరుద్ధరించాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తర్వాత, ఇజ్రాయెల్ రక్షణ దళం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ ప్రదేశాలు, పాఠశాలలు కార్యాలయాలపై విధించిన ఆంక్షలు ఎత్తివేసింది. ఇరాన్ కూడా తమ గగనతలాన్ని తిరిగి తెరిచింది. ఫ్లైట్-ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్‌రాడార్ 24 ప్రకారం విమానాలను అనుమతిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఎస్సై మృతి

## కానిస్టేబుల్ కుడా ..





కోదాడఅంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు ఎస్సై ఎం. అశోక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గంజాయి కేసుకు సంబంధించి నిందితుల కోసం కానిస్టేబుల్స్ తో కలిసి కారులో హైదరాబాద్ వెళ్తుండగా నల్గొండ జిల్లా కోదాడ వద్ద గురువారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.ఎస్ఐ అశోక్ తో పాటు కానిస్టేబుల్ జీవన్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.ఈ ప్రమాదంలో మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. గాయపడినవారిలో హెడ్ కానిస్టేబుల్ దొంగ స్వామి, వాహన డ్రైవర్ రమేష్ ప్రస్తుతం కోదాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాద సమయంలో వారు విధి నిర్వహణలో ప్రయాణిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ఖమ్మం లో యాంటీ డ్రగ్స్ డే ర్యాలీ

ఖమ్మం యువతను కాపాడుకోవాలి అనుకుంటే డ్రగ్స్ ను తరిమి కొట్టాల్సిందే అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. వరల్డ్ యాంటీ డ్రగ్స్ డే పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని మమత రోడ్డులో గల టాటా సర్వీస్ సెంటర్ నుండి లకారం ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.. ర్యాలీలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి సునీల్ దట్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు అరికట్టాలి అంటే యువత ,విద్యార్థులు ప్రతీ ఒకరు బాధ్యత తీసుకోవాలి అని. ఈ డ్రగ్స్ వల్ల శరీరం మొత్తం నిర్వీర్యం అయ్యి సమాజంలో దుష్పరిణామాలకు అవకాశం ఉంది అని .అందువల్ల ఇది మన అందరి బాధ్యత అని. మీ చుట్టుపక్కల ,స్నేహితులకి ఇటువంటి డ్రగ్స్ సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలి అని కోరారు ఈ ర్యాలీలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శ్రీజా, ంఅఖ రమణమూర్తి ఇతర అధికారులు,విద్యార్థులు పాల్గొన్నారు..అనంతరం ర్యాలీలో పాల్గొన్న పోలీస్ డిపార్ట్మెంట్, విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ పై ప్రతిజ్ఞ చేపించారు.

# దారికొస్తున్న దాయాది దేశం...

న్యూఢిల్లీ, జూన్ 26, (న్యూస్ పల్స్) ఉగ్రవాదం, పాకిస్తాన్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్, వాణిజ్యం వంటి సమస్యలను భారతదేశంతో మాట్లాడటం ద్వారా పరిష్కరించుకోవాలని పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ కోరుకుంటున్నారు. భారతదేశంతో మాట్లాడటానికి తాను సిద్ధంగా ఉన్నానని సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ అబ్దుల్ అజీజ్ అల్ సౌద్‌కు ఆయన చెప్పారు.పాకిస్తాన్ వార్తా ఛానల్ న్యూస్ ప్రకారం, షాబాజ్ షరీఫ్ మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సౌదీ అరేబియాతో మాట్లాడుతూ, పాకిస్తాన్ భారతదేశంతో పీవోకే, సింధు జల ఒప్పందం, వాణిజ్యం, ఉగ్రవాదంపై చర్చలు జరపడానికి పాకిస్తాన్ సిద్ధంగా ఉందని చెప్పారు.ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, పాకిస్తాన్‌పై భారతదేశం కఠినమైన చర్యలు తీసుకుంది. పాకిస్తాన్ పౌరులను తిరిగి పంపించడం, అట్టారి వాఘా సరిహద్దును మూసివేయడం, పాకిస్తానీలకు సార్క్ వీసా మినహాయింపును నిలిపివేయడం, పాకిస్తాన్ హైకమిషన్‌లో సిబ్బంది సంఖ్యను తగ్గించడం, సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం వంటి ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. అయితే పాకిస్తాన్ ఉగ్రవాదం, పీవోకే సమస్యను పరిష్కరించే వరకు, దానితో మరే ఇతర సమస్యను చర్చించబోమని భారతదేశం వైఖరి స్పష్టంగా ఉంది.పాకిస్తాన్ సింధూ జల ఒప్పందం అంశాన్ని ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్ లోని 57 ముస్లిం దేశాల ముందు లేవనెత్తింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత వివిధ దేశాలకు పంపిన బిలావల్ భుట్టో జర్దారీ ప్రతినిధి బృందం భారతదేశంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. నీటి అంశాన్ని కూడా లేవనెత్తారు. అయితే, పాకిస్తాన్ చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఏ దేశం కూడా పాకిస్తాన్‌కు అండగా నిలిచేందుకు ఆసక్తి చూపలేదు. ప్రపంచ దేశాల ముందు పరువు పోయినంత పనైంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్ మెల్ల మెల్లగా దిగివస్తోంది.65 సంవత్సరాల క్రితం 1960లో, ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారతదేశం-పాకిస్తాన్ మధ్య సింధు నది జలాల పంపిణీకి సంబంధించి ఒక ఒప్పందం కుదిరింది. ఇది రెండు దేశాలకు చెల్లుతుంది. ఈ ఒప్పందం ప్రకారం, పశ్చిమ నదులైన సింధు, జీలం, చీనాబ్ జలాలపై పాకిస్తాన్‌కు హక్కు ఉంది. తూర్పు నదులైన రావి, బియాస్, సట్లెజ్ జలాలపై భారతదేశానికి హక్కు ఉంది. ఈ విధంగా, భారతదేశానికి 20 శాతం నీరు, పాకిస్తాన్‌కు 80 శాతం నీరు లభిస్తాయి. ఈ కోణంలో, నీటి కోసం పాకిస్తాన్ ఎక్కువ ఆధారపడటం ఉంటుంది. అయితే సింధూ నది జలాలను నిలిపివేయడంతో పాకిస్తాన్ తల్లడిల్లుతోంది.పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత, మే 6-7 తేదీల మధ్య రాత్రి భారతదేశం ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించింది. పాకిస్తాన్‌లోని లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది స్థావరాలను ధ్వంసం చేసింది. దీనితో ఆగ్రహించిన పాకిస్తాన్, భారత సైనిక స్థావరాలపై దాడి చేయడానికి విఫల ప్రయత్నం చేసింది. దీనికి ప్రతిస్పందనగా భారతదేశం పాకిస్తాన్‌పై చర్యలు తీసుకుంది. నూర్ ఖాన్ వంటి పాకిస్తాన్‌లోని పెద్ద వైమానిక స్థావరం భారతదేశం దాడిలో తీవ్రంగా నష్టపోయింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు చాలా పెరిగాయి.

# టూరిజంకు అత్యంత ప్రధాన్యత ఇస్తోన్న కూటమి ప్రభుత్వం

## మంత్రి నిమ్మల రామానాయుడు

రాజమండ్రి లో జరిగిన అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో జిల్లా ఇంచార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గోన్నారు.

మంత్రి మాట్లాడుతూ తూర్పు పర్యాటకానికి సింహ ద్వారం గా ఉన్న రాజమహేంద్రవరం చారిత్రాత్మక వైభవాన్ని, ప్రపంచ వ్యాప్తం చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్ట్ తీసుకురావడం శుభపరిణామమని అన్నారు.2014 లో రాష్ట్ర విభజన కంటే, 2019-24 మధ్య 5 ఏళ్ళ పాలన వల్లే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగింది. రాష్ట్రాన్ని విధ్వంసం నుండి నిర్మాణం వైపు నడిపించే దిశ లో కూటమి ప్రభుత్వం టూరిజానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ఉత్తరాంధ్ర విశాఖ అందాల తీరం నుండి, రాయలసీమ లోని గండికోట, ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పర్యాటక అందాలను, టెంపుల్ టూరిజాన్ని కలుపుతూ పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నాం. టూరిజాన్ని అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని అభివృద్ధి పదం లోకి తీసుకెళ్లేలా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల కష్టానికి, ప్రధాని నరేంద్ర మోదీ సహకారానికి కృతజ్ఞతలని అన్నారు.

# ఇక ఏడాదికి రెండుసార్లు సీబీఎస్ఈ ఎగ్జామ్స్

హైదరాబాద్, జూన్ 26,ఏడాదిలో రెండు సార్లు పదో తరగతి పరీక్షల నిర్వహణకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఆమోదం తెలిపింది. ఈ విధానం 2026 నుంచి అమలులోకి వస్తుందని పేర్కొంది. అంటే 2026 నుంచి ఏడాదికి రెండు సార్లు సీబీఎస్సీ పదో తరగతి బోర్డు పరీక్షలు నిర్వహిస్తారన్నమాట. ఈ మేరకు ఒక విద్యా సంవత్సరంలో రెండుసార్లు బోర్డు పరీక్షలకు హాజరు కావడానికి వీలు కల్పించే కొత్త వ్యవస్థను ప్రవేశపెడుతుందని అధికారులు తెలిపారు.కొత్త విధానం ప్రకారం తొలి విడత పదో తరగతి పరీక్షలను తప్పనిసరిగా విద్యార్థులు అందరూ రాయవల్సి ఉంటుంది. తొలి విడత పరీక్షలు ఫిబ్రవరి నెలలో జరుగుతాయి. రెండో విడత పదో తరగతి పరీక్షలను ఆప్షనల్‌గా పెట్టింది. రెండో విడత పరీక్షలు మే నెలలో జరుగుతాయి. మే లో జరిగే పరీక్షలు మాత్రం ఆప్షనల్. అంటే మార్కులు పెంచుకోవాలని భావించే విద్యార్థులు ఈ పరీక్షలు రాయవచ్చన్నమాట. రెండు విడతల్లో మంచి స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటామని బోర్డు తెలిపింది. ఈ విధానం జాతీయ విద్యా విధానం కి అనుగుణంగా ఉందని, ఇది విద్యార్థులకు ఒకే విద్యా సంవత్సరంలో రెండవ ప్రయత్నాన్ని అందించడం ద్వారా వారి పరీక్ష ఒత్తిడిని తగ్గించడానికి అవకాశం ఉంటుందని బోర్డు తెలిపింది.మొదటి దశ ఫిబ్రవరిలో, రెండవ దశ పరీక్షలు మేలో నిర్వహిస్తామని పరీక్ష కంట్రోలర్ సంయమ్ భరద్వాజ్ అన్నారు. రెండు దశల ఫలితాలు వరుసగా ఏప్రిల్, జూన్‌లలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. విద్యార్థులు మొదటి దశకు హాజరు కావడం తప్పనిసరి. రెండవ దశ ఆప్షనల్. విద్యార్థులు సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, ల్యాంగ్వేజ్‌లలో ఏవైనా మూడు సబ్జెక్టులలో తమ స్కోర్‌ను మెరుగుపరచుకోవడానికి రెండో దశలో పరీక్షలు రాయడానికి అవకాశం కల్పిస్తామని ఆయన వివరించారు. శీతాకాలంలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రెండు దశల్లో దేనిలోనైనా హాజరు కావడానికి అవకాశం కల్పించామని అన్నారు. విద్యా సెషన్‌లో అంతర్గత మూల్యాంకనం ఒక్కసారి మాత్రమే నిర్వహించబడుతుంది. ఫిబ్రవరిలో ముసాయిదా నిబంధనలను విడుదల చేసి బోర్డు.. పాఠశాలలు, ఉపాధ్యాయులు, ఇతర వాటాదారుల నుండి అభిప్రాయాన్ని ఆహ్వానించింది. బోర్డు పరీక్షలను తక్కువ ఒత్తిడితో నిర్వహించాలనే ప్రయత్నాలలో భాగంగా తుది ఆమోదం తాజాగా లభించడంతో 2026 నుంచి ఈ విధానం అమలులోకి రానుంది. గత నెలలో, కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా 2026 నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షలను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తుందని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇది మరింత ఒత్తిడి లేని అభ్యాస వాతావరణాన్ని సృష్టిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# దుమ్మురేపుతున్న ఇండియన్ స్పేస్ ట్రావెలర్స్

న్యూఢిల్లీ, జూన్ 26, భారత వ్యామోగామి శుభాన్షు శుక్లా.. అంతరిక్షంలోకి అడుగుపెట్టారు. భారత గగనయాన్ వ్యామోగాముల్లో ఒకరైన శుభాన్ష్ ఇప్పటికే భూ కక్ష్యలో ఉన్నారు. అంతకు ముందు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్ రాకేశ్ శర్మ, ఇండియన్ అమెరికన్స్ కల్పనాచావ్లా, సునీత విలియమ్స్ కూడా స్పేస్‌లోకి వెళ్లారు. అయితే భారతీయ పౌరుడిగా నాసాకు సంబంధించిన స్పేస్ మిషన్‌లో అంతరిక్షానికి వెళ్లిన రెండో భారతీయుడు శు భాన్ష్. మన భారతీయుడు అంతరిక్షంలో అడుగుపెట్టిన అరుదైన సందర్భంలో వినువీధిలో మన వాళ్లు సత్తా గురించి మాట్లాడుకుందాంఅనేక రంగాల్లో సత్తా చాటే మనవాళ్లు.. అంతరిక్షంలోనూ అడుగుపెట్టారు. రోదసీయాత్రలు.. ఆకాశయానంలో భారత్ ఇంకా అంత ముందడుగు వేయలేదు కానీ.. నాసా ద్వారా మన భారతీయులు అంతరిక్షయానం చేశారు. అయితే?స్పేస్ ఎక్కువగా జరిగే అమెరికాలో అనేక రూపాల్లో అంతరిక్షానికి వెళ్లొచ్చు. అలా ఇప్పటికే ఇద్దరు తెలుగు వ్యక్తులు భూమిని అ?ంతరిక్షం నుంచి చుట్టేశారు. ఇప్పుడు మరొకరు దానికి సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ స్పేస్ మిషన్ల ద్వారా రెండు యాత్రలు పూర్తయ్యాయి. పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి 2029లో ఆస్ట్రోనాట్‌గా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటివరకూ ఎవరెవరు వెళ్లారంటే..

భూమిని చుట్టేసిన బండ్ల శిరీష

బండ్ల శిరీష.. గుంటూరమ్మాయి.. తెనాలికి చెందిన బండ్ల అంతరిక్షంలోకి వెళ్లిన రెండో భారతీయ మహిళ. సునీత విలియమ్స్, కల్పనా చావ్లా వెళ్లినప్పటికీ సునీత అమెరికన్ ఇండియన్. కల్పనా చావ్లా తర్వాత అంతరిక్షానికి వెళ్లింది బండ్ల శిరీషనే.. చిన్నప్పుడు హైదరాబాద్‌లో ఉన్న శిరీష తర్వాత తన తల్లిదండ్రులతో కలిసి యుఎస్‌లోని హ్యూస్టన్‌కు వెళ్లిపోయారు. అక్కడే ఏరానాటికల్ ఇంజనీరింగ్, ఆ తర్వాత మాస్టర్స్ చేసిన శిరీష..వెర్జిన్ అనే స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ సంస్థలో చేరారు. ప్రస్తుతం ఆ సంస్థలో వైస్ ప్రెసిడెంట్ గా ఉన్నారు. 22 స్పేస్ మిషన్‌లో స్పేస్ టూరిస్ట్‌గా వెళ్లారు. యూనిటీ 22 , 2021లో భూమి సబ్ ఆర్బిటల్ స్పేస్‌కు వెళ్లింది. జీరో గ్రావిటీని ఫేస్ చేసిన రెండో భారతీయ మహిళగా.. తొలి తెలుగు వ్యక్తిగా శిరీష బండ్ల రికార్డు సృష్టించారు.

గగనయానం చేసిన తోటకూర గోపీచంద్..

మన వాళ్ల అంతరిక్ష యానం శిరీషతోనే ఆగలేదు. బెజవాడకు చెందిన గోపీచంద్.. కూడా స్పేస్ యాత్రను చేశాడు. అమెజాన్ అధిపతి కు చెందిన బ్లూ ఆరిజన్ న్యూషెపర్డ్ 25 వ్యామనౌకలో అంతరిక్ష యానం చేశారు. కమర్షియల్ పైలట్ అయిన గోపీచంద్.. యుఎస్‌లో ఓ వెల్‌నెస్ కంపెనీని నిర్వహిస్తున్నారు. 2024 ఆయన న్యూషెపర్డ్ క్రూతో కలిపి ఈ యాత్ర చేశారు.

జాహ్నవి దంగేటి కొత్త చరిత్ర ?

స్పేస్‌లోకి వెళ్లనున్న తొలితెలుగు ఆస్ట్రోనాట్

పాలకొల్లుకు చెందిన జాహ్నవి దంగేటి అనే 23 ఏళ్ల అమ్మాయి. 23ఏళ్ల జాహ్నవి 2029లో అంతరిక్షంలోకి వెళ్లనుంది. అమెరికాకు కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష పరిశోధన సంస్థ టైటాన్ స్పేస్ ఇండస్ట్రీస్ 2029లో చేపట్టే స్పేస్ మిషన్‌లో జాహ్నవి అస్ట్రోనట్ క్యాండిట్ గా ఎంపికైంది. అంతకంటే ముందే ఆమె ఇంటర్నేషనల్ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేసిన తొలి భారతీయురాలిగా నిలిచింది. ఇప్పటివరకూ స్పేస్‌కు వెళ్లిన మన వాళ్లు అంతరిక్ష యాత్రికులు స్పేస్ టూరిస్ట్ లకుమాత్రమే. కానీ జాహ్నవి ఓ అస్ట్రోనట్ గా వెళ్లనుంది. మూడేళ్ల పాటు ఆమె వ్యామోగామి శిక్షణ తీసుకోనుంది.తెలుగు విద్యార్థులకు ౹ూఇఓ సబ్జెక్టుల్లో మొదటి నుంచి ఆసక్తి ఎక్కువ. మిగతా రాష్ట్రాల విద్యార్థులతో పోలిస్తే.. సౌత్‌లో అందునా.. ఏపీ, తెలంగాణలో సైన్స్ పట్ల ఎక్కువ ఆసక్తి ఉంటుంది. ఎమిల్లో చేరిన అమెరికాకు మాస్టర్స్‌కు వెళ్లేవాళ్లలోనూ.. తెలుగు వాళ్లు ఎక్కువుగానే ఉంటారు. ఆ ఆసక్తే మనవాళ్లు స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ చేయడానికి దోహదం చేస్తోంది. ఆకాశం అంచులను అందుకోవాలన్న తపనతో వీరంతా ౹ాజూజీఇ౹వ ఇలీజూశ్రీనీతీజీబితినీని చేస్తున్నారు

# సిటీలో రాకాసీ చేపలే

హైదరాబాద్, జూన్ 26, హైదరాబాద్ వాసులు ఇప్పుడు చేపల గురించే ఆలోచిస్తూ భయపడుతున్నారు. తినడానికి కాదు.. చూస్తేనే వెన్నులో జలదరింపు రాకుండా ఉండటం లేదు. చెరువుల మధ్యే జీవితం గడిపే మత్స్యకారులే ఇప్పుడు వల వేసేటపుడు వెనుకడుగు వేస్తున్నారు. ఎందుకంటే వలలో పడేది మనకు ఉపయోగపడే చేపలు కాదు.. ఏకంగా 'రాకాసి' చేపలే! ఎక్కడ చూసినా ఇవే.. వాటి పేరు చెబితేనే మిగతా చేపలు దూరంగా పారిపోతాయంట. శరీరానికి కంచు కవచంలా ఉన్న ఆకారంతో, పిల్లలు కాదు పెద్దవాళ్లకూ భయం వేసేలా ఉన్న ఆ చేపలు ఇప్పుడు హైదరాబాద్ చెరువుల్లో వేట మొదలుపెట్టాయి. అసలు ఈ చేపలను చూసి మత్స్యకారులే తట్టుకోలేక కాల్చేసే దాకా వెళ్లారంటే.. అసలు వ్యవహారం ఎంత తీవ్రమో మీరు ఊహించగలరు. అసలు విషయంలోకి వెళితే.. తెలుగు రాష్ట్రాల్లో ఎంతోమంది జీవనోపాధిగా చేపల వేటను ఆధారంగా చేసుకుంటున్నారు. చెరువులు, నదులు, వాగులు ఇవన్నీ మన మత్స్యకారుల కడుపు నింపే జల వనరులు. కానీ తాజాగా హైదరాబాద్‌లోని చర్లపల్లి చెరువు వద్ద భయానక మాంసాహారి చేపల కలకలం నెలకొంది. మత్స్యకారులు వలలు వేసినప్పుడు టన్నుల కొద్దీ ఆర్మర్డ్ సెల్ఫిన్ క్యాట్ ఫిష్ అనే ఓ విచిత్రమైన చేపలే చిక్కుతున్నాయి. ఇవి సాధారణ చేపలు కావు. వీటిని డెవిల్ ఫిష్, లేక రాకాసి చేపలు అంటారు. ఇప్పుడు ఇవి ఇతర చేపలను నాశనం చేస్తూ తీవ్రంగా విస్తరిస్తున్నాయి. చర్లపల్లి చెరువు వంటి నీటి వనరుల్లో ఈ డెవిల్ ఫిష్ అనూహ్యంగా పెరిగిపోతుండడం, ఇతర జీవజాతుల కోసం ముప్పు సంకేతం. మత్స్యశాఖ అధికారులు దీన్ని ప్రాణాంతకంగా పేర్కొంటున్నారు. ఈ చేపలు లారీ కారిడ్ కుటుంబానికి చెందినవి. ఇవి ఇతర చేపల గుడ్లను, పిల్లలను తినేస్తూ పరిసరజలాల్లో ఏకంగా దేనినైనా తినే శక్తిని కలిగి ఉన్నాయి. ఒకసారి ఈ చేపలు చేరిన నీటిలో, మరెంత మంచి విత్తన చేపలు వేసినా అవి బతకలేవు. ఈ డెవిల్ ఫిష్ వాటిని తినేసి స్వయంగా పెరిగిపోతాయి. దీనివల్ల మిగిలిన సంప్రదాయ చేపల జాతులు అంతరించి పోతున్నాయని మత్స్యకారులు అంటున్నారు. వీటి అత్యాధునికమైన లక్షణం.. ఇవి తక్కువ ఆక్సిజన్ ఉన్న నీటిలో కూడా జీవించగలవు. అంతే కాదు, నీటికి బయటకు వచ్చినా, కొంత సమయం పాటు గాలిని నేరుగా పీల్చుకుంటూ బతికే శక్తి వీటిలో ఉంది. ఇది ఒక విధంగా చెరువుల టెర్మినేటర్ లా పనిచేస్తోంది. ఈ ప్రత్యేకతలే వీటిని మరింత ప్రమాదకరంగా మార్చాయి. చాలా మంది మత్స్యకారులు వలలు వేసిన ప్రతిసారీ ఈ చేపలే ఎక్కువగా పడుతుండటంతో, వారి ఆదాయ మార్గాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ చేపలు అసలు మన చెరువుల్లోకి ఎలా వచ్చాయి? అనేది మరో ఆసక్తికర ప్రశ్న. సమాచారం ప్రకారం, మొదట ఇవి అక్వేరియమ్ చేపలుగా బయట దేశాల నుంచి దిగుమతి అయ్యాయి. అప్పుడు పెద్దవవుతున్న కొద్దీ కొంతమంది వాటిని కాలువల్లోకి వదిలేశారు. అక్కడి నుంచి చిన్నకాలువల ద్వారా చెరువుల్లోకి ప్రవేశించాయి. ఇప్పుడు పరిస్థితి అదుపు తప్పే దిశగా సాగుతోంది. వీటిని ప్రభుత్వ వైపు నుంచి సరఫరా చేసిన మంచి విత్తన చేపలు తినేస్తుండటంతో ప్రభుత్వ పెట్టుబడులే నష్టమవుతున్నాయి. ఇదే విషయంపై మత్స్యకారులు తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వలల్లో మనకు అవసరమైన రొయ్యలు, బంగరు తీల, కొరమెన, తిలపియా వంటి చేపల బదులు ఇప్పుడు ఈ ఆక్రమణ చేపలే పడుతున్నాయని వాపోతున్నారు. బజార్లో ఇవి విలువ ఉండకపోవడంతో అమ్ముడుపోయే అవకాశాలు తక్కువ. పైగా ఇంట్లో తినే అలవాటు కూడా లేదు. దీంతో ఆ చేపలను రోడ్లపైకి తీసి కాల్చేస్తున్నారు, చంపేస్తున్నారు. ఇది చూస్తుంటే గుండెను కలిచివేసే దృశ్యం. కానీ మిగిలిన చేపల రక్షణకై ఇది తప్పనిసరి చర్యగా మారిందని వారి మాట. ప్రభుత్వం ఇప్పటికైనా దీనిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ డెవిల్ ఫిష్ నాశనం చేసే విధానాన్ని పటిష్టంగా అర్థం చేసుకొని, వాటిని పూర్తిగా తొలగించే వ్యూహం రూపొందించాలి. అవసరమైతే శాస్త్రీయంగా తగిన మందులు, వ్యర్థజల నియంత్రణ చర్యలు చేపట్టాలి. మత్స్యకారులకు మార్గనిర్దేశం చేయాలి. ఒక వేళ ఇది నిర్లక్ష్యం చేస్తే, తెలంగాణ రాష్ట్రంలోని చాలా చెరువులు భవిష్యత్తులో చేపలేని నీటి బావులుగా మారే ప్రమాదం ఉందని కొందరి అభిప్రాయం. పర్యావరణం, జీవవైవిధ్యం, గ్రామీణ జీవనోపాధి.. ఇవన్నీ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి. ఒకటిపై ముప్పు వస్తే అన్నిటిపై ప్రభావం పడుతుంది. చర్లపల్లి చెరువు ఘటన ఇప్పటికైనా సైరన్ లా ప్రభుత్వానికి, పర్యావరణ నిపుణులకు హెచ్చరికలా ఉండాలి. మత్స్యకారులు లాంటివారు రోజూ జీవనోపాధికోసం చెరువులోకి వెళ్లి ఈ రాకాసి చేపల ముప్పుతో ఎదురైతే, వారి జీవితం నరకంగా మారిపోతుంది. మొత్తానికి, చెరువుల్లోకే చొచ్చుకుపోయిన ఈ డెవిల్ ఫిష్ అన్నిటికంటే ముందుగా మన తెలివిని పరీక్షిస్తున్నాయి. మనం శాస్త్రీయంగా స్పందిస్తే తప్ప, భవిష్యత్తులో మన పిల్లలు చేపలంటే ఫోటోలే చూస్తారు తప్ప చెరువుల్లో కాదు. అందుకే ఈ రాకాసి చేపలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు. మొత్తం మీద హైదరాబాద్ నగరాన్ని రాకాసి చేపలు భయపెడుతున్నాయని ఒక్క మాటలో చెప్పవచ్చని మత్స్యకారుల మాట

# భారతం... బంగారు కొండ...

# దేశంలో 25 వేల టన్నుల యెల్లో మెటల్

ముంబై, జూన్ 26, (న్యూస్ పల్స్)బంగారం.. ప్రస్తుతం నిత్యం వార్తల్లో నిలుస్తున్న విలువైన లోహం ఇదే. ఎందుకంటే.. నిత్యం బంగారం ధర పెరుగుతోంది. ఇప్పటికే పది గ్రాముల బంగారం రూ.లక్ష దాటేసింది. భవిష్యత్ అంతా బంగారందే అని ఎకనమిస్టులు అంచనా వేస్తున్నారు. దీంతో చాలా మంది బంగారంపైనే పెట్టుబడులు పెడుతున్నారు. దీంతో ధర పెరుగుతోంది.

భారతదేశం బంగారంతో గాఢమైన సాంస్కృతిక, ఆర్థిక సంబంధాన్ని కలిగి ఉంది. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, భారతీయుల వద్ద సుమారు 25 వేల టన్నుల బంగారం ఉంది. దీని విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం సుమారు 2.4 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేయబడింది. ఈ సంపద పాకిస్థాన్ జీడీపీ కంటే ఆరు రెట్లు ఎక్కువ, కెనడా, ఇటలీ వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీతో సమానంగా ఉంది. మరోవైపు ప్రపంచ యుద్ధారు, ఆర్థిక సంక్షోభాల కారణంగా కూడా బంగారం విలువ పెరుగుతోంది.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ నివేదిక ప్రకారం, భారతీయ గృహాల వద్ద ఉన్న 25 వేల టన్నుల బంగారం ప్రపంచ బంగార భాండాగారంలో సుమారు 11% ని సూచిస్తుంది. ఈ సంపద, 2.4 ట్రిలియన్ డాలర్ల విలువతో, భారతదేశ జీడీపీలో 40% కంటే ఎక్కువ భాగాన్ని కవర్ చేస్తుంది. ఈ బంగారం ప్రధానంగా ఆభరణాల రూపంలో ఉంటుంది, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, తమిళనాడు ఒక్కటే దేశ బంగారంలో 28% భాగాన్ని కలిగి ఉంది.భారతదేశంలో బంగారం కేవలం ఆర్థిక ఆస్తి మాత్రమే కాదు, సాంస్కృతిక, సామాజిక గుర్తింపు. వివాహాలు, పండుగల వంటి సందర్భాలలో బంగారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, ఆర్థిక భద్రత కోసం బంగారాన్ని నమ్ముకుంటారు. భారతీయ మహిళలు కలిగి ఉన్న 24 వేల టన్నుల బంగారం ప్రపంచంలోని ఐదు అగ్ర దేశాల (అమెరికా, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యా) బంగార భాండాగారాల కంటే ఎక్కువ. ఈ సంపద గ్రామీణ ప్రాంతాల్లో రుణాలకు హామీగా, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రక్షణగా పనిచేస్తుంది. 2.4 ట్రిలియన్ డాలర్ల విలువైన బంగార సంపద పాకిస్థాన్ జీడీపీ (సుమారు 400 బిలియన్ డాలర్లు) కంటే ఆరు రెట్లు ఎక్కువ. కెనడా (2.4 ట్రిలియన్ డాలర్లు), ఇటలీ (2.3 ట్రిలియన్ డాలర్లు) వంటి అభివృద్ధి చెందిన దేశాల జీడీపీతో సమానంగా ఉంది. ఈ పోలిక భారతీయ గృహాల బంగార సంపద భారీ ఆర్థిక ప్రభావాన్ని తెలియజేస్తుంది. అయితే, ఈ సంపద ఎక్కువగా గృహాలలో ఆభరణాల రూపంలో ఉండటం వలన, దీనిని ఆర్థిక వ్యవస్థలో నేరుగా ఉపయోగించడం సవాలుతో కూడుకున్నది.భారతీయ గృహాల బంగార సంపదతోపాటు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కూడా గణనీయమైన బంగార భాండాగారాన్ని కలిగి ఉంది. 2025 జనవరి నాటికి, ఆర్‌బీఐ బంగారం భాండాగారం 879.60 టన్నులకు చేరుకుంది, ఇది 2024 నాల్గవ త్రైమాసికంలో 876.20 టన్నుల నుంచి పెరిగింది. ఈ బంగారం దేశ ఆర్థిక స్థిరత్వాన్ని, ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని బలోపేతం చేస్తుంది. 2024లో ఆర్‌బీఐ 72.6 టన్నుల బంగారాన్ని జోడించింది, ఇది గత సంవత్సరాల కంటే గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది.

భారతీయ గృహాల బంగార సంపద దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో, బంగారం రుణాలకు హామీగా ఉపయోగపడుతుంది, ఇది ఆర్థిక సంక్షోభ సమయంలో ఆర్థిక భద్రతను అందిస్తుంది. అదనంగా, గోల్డ్ ఈటీఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్‌ల ద్వారా బంగారంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి, ఇవి ఆధునిక పెట్టుబడిదారులకు బంగారాన్ని సులభతరం చేస్తున్నాయి. అయితే, బంగార దిగుమతులు దేశ వాణిజ్య లోటును పెంచుతాయి, ఇది ఆర్థిక నిర్వహణలో సవాలుగా ఉంది.

# మూడు పార్టీల్లోనూ... సమరోత్సాహం

హైదరాబాద్, జూన్ 25, తెలంగాణలో స్థానిక సంస్థల పదవీకాలం ముగిసి ఏడాది దాటింది. అయినా ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదు. దీంతో కొందరు మాజీ సర్పంచులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోగా ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. కానీ నిర్వహించలేదు. మళ్లీ కోర్టుకు వెళ్లడంతో కీలక ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పుడు రిజర్వేషన్లపై పార్టీల్లో, ఆశవహుల్లో ఉత్కంఠ నెలకొంది.స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తు లేకుండా జరుగుతాయి. దీంతో స్థానికంగా నమ్మకమైన, బలమైన నేతలకు పార్టీలు మద్దతు ఇస్తాయి. ఇక ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ సమరానికి సై అంటున్నాయి. అధికార పార్టీ హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో వ్యతిరేకత నెలకొంది. దీంతో ఎన్నిల్లో పైచేయి సాధించేందుకు మూడు పార్టీలు యతినస్తున్నాయి. పార్టీల గుర్తుపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు సమాయత్తం అవుతున్నాయి. మెజారిటీ మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు దక్కించుకోవాలని ప్రణాళిక రూపొందిస్తున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తోంది. కానీ ఇప్పటికీ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన చాలా హామీలు నెరవేర్చలేదు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ మినహా ఏదీ పూర్తిస్థాయిలో అమలు కాలేదు. రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. మహిళలకు రూ.2,500 అందడం లేదు. పింఛన్లు పెరగలేదు. ఇక రైతుభరోసా గత యాసంగి, వానాకాలం కొద్దిమందికే అందింది. ఈ ఖరీఫ్‌లో దాదాపు అందరికీ పెట్టుబడి అందించారు. ఇక రైతు కూలీలకు కూడా ఏటా రూ.12 వేల సాయం కొద్ది మందికే అందుతోంది. దీంతో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో ఇవి ప్రభావం చూసే అవకాశం ఉంది.ఇక ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌కు పదేళ్ల పాలన అనుభవం, గత పాలనలో అందించిన సంక్షేమ పథకాలు ప్లస్ పాయింట్. ఇదే సమయంలో బీఆర్‌ఎస్‌కు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బలమైన క్యాడర్ ఉంది. దీంతో స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించి అధికార పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలని గులాబీ నేతలు భావిస్తున్నారు. అయితే ఆ పార్టీలో ఇటీవలి పరిణామాలు, నేతల మధ్య ఐక్యత లేకపోవడం పార్టీకి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.ఇక మరో ప్రతిపక్ష పార్టీ అయిన బీజేపీకి గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా పట్టు లేదు. ఉత్తర తెలంగాణలోని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో మాత్రంమే కాస్త పట్టు ఉంది. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో బీజేపీకి పెద్దగా బలం, క్యాడర్ లేవు. అయితే ఇదే సమయంలో పట్టణాల్లో బీజేపీకి యూత్ ఫాలోయింగ్ ఎక్కువ. యువ ఓటర్లు, హిందువులు బీజేపీ వెంటే ఉంటున్నారు. దీంతో మున్సిపల్ ఎన్నికల్లో ఈసారి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. పంచాయతీ ఎన్నికల్లోనూ గతంకన్నా మెరుగైన ఫలితాలు సాధించాలని కమలనాథులు భావిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ గణన చేపట్టింది. దీని ఆధారంగా వార్డుల విభజన చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ప్రణాళిక రూపొందిస్తోంది. అయితే ఈ అంశం కేంద్రం పరిధిలో ఉంటుంది. మరోవైపు రిజర్వేషన్లపై కోర్టులో కేసు ఉంది. ఈ తరుణంలో వార్డుల విభజనకు ఆటంకం కలుగనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో బీసీలకు పార్టీ పరంగా 42 శాతం సీట్లు ఇవ్వాలని భావిస్తోంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు నిర్దేశిత రిజర్వేషన్లు సరైన రీతిలో అమలు కావడం ద్వారా సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం లభించనుంది.తెలంగాణ హైకోర్టు తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలను వేగవంతం చేయడమే కాక, ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించడంలో ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ ఆదేశాలను సకాలంలో అమలు చేయడం ద్వారా స్థానిక పాలనా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉంది. ఈ ప్రక్రియ సమర్థవంతంగా, పారదర్శకంగా జరిగితే, తెలంగాణలో స్థానిక సంస్థలు మరింత శక్తివంతంగా పనిచేసే అవకాశం ఉంది.

# పార్టీలకు జూబ్లీ పరీక్ష

హైదరాబాద్, జూన్ 26, తెలంగాణలో త్వరలో మరో ఉప ఎన్నిక రాబోతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో తరచూ ఉప ఎన్నికలు వచ్చేవి. బీఆర్‌ఎస్ అలియాస్ టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉద్యమ సమయంలో రాజీనామా చేసేవారు. అయితే ప్రస్తుతం ఉప ఎన్నికలు సిట్టింగ్ ప్రతినిధులు మరణించడంతో వస్తున్నాయి. గతేడాది కంటోన్‌మెంట్ స్థానానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఇది బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానం. కానీ కాంగ్రెస్ గెలిచింది. ఇక త్వరలో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఇది కూడా బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానమే. ఈ స్థానంలో ఎవరు గెలుస్తారనేది ఉత్కంఠగా మారింది.తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్రవ్యాప్త దృష్టిని ఆకర్షిస్తోంది. బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో అనివార్యమైన ఈ ఉప ఎన్నిక, ప్రధాన పార్టీల మధ్య ప్రతిష్టాత్మక పోరుగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీలు తమ వ్యూహాలను సిద్ధం చేస్తుండగా, తాజా సర్వే ఫలితాలు రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. ఎంఐఎం పాత్ర, అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు ఈ ఎన్నిక ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశాలుగా మారాయి.జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రధాన పార్టీలకు కీలక పరీక్షగా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ సీటును గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది. 2023 ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్క సీటు కూడా గెలవలేని కాంగ్రెస్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలో విజయం సాధించి ఊపు మీద ఉంది. ఈ ఊపును జూబ్లీహిల్స్‌లో కొనసాగించాలని భావిస్తోంది. రేవంత్ రెడ్డి, అభ్యర్థి ఎంపికను హైకమాండ్‌కు వదిలేస్తూ, నాయకులు స్వయంగా ప్రకటనలు చేయవద్దని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ నుంచి మాజీ క్రికెటర్ మహ్మద్ అజహరుద్దీన్ తానే పోటీ చేస్తానని ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

? మరోవైపు, బీఆర్‌ఎస్‌కు ఈ సీటు సిట్టింగ్ స్థానం కావడంతో దాన్ని నిలబెట్టుకోవడం ప్రతిష్ఠాత్మకంగా మారింది. పార్టీ నుంచి రెండుసార్లు విజయం సాధించిన మాగంటి గోపీనాథ్ కుటుంబానికి టికెట్ ఇవ్వాలని భావిస్తోంది. గోపీనాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపే ఆలోచనలో ఉన్నప్పటికీ, ఆమె సమ్మతం కోసం వేచి చూస్తోంది. ప్రత్యామ్నాయంగా, విష్ణువర్ధన్‌రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉంది. సర్వేల ద్వారా నియోజకవర్గ ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ కసరత్తు చేస్తోంది.

? బీజేపీ కూడా ఈ ఎన్నికను తేలిగ్గా తీసుకోవడం లేదు. టీడీపీ, జనసేనతో కలిసి ఉమ్మడి అభ్యర్థిని బరిలోకి దింపాలని భావిస్తోంది. ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త పేరు అభ్యర్థిగా వినిపిస్తుండడం గమనార్హం. ఈ మూడు పార్టీలు సర్వేలు నిర్వహిస్తూ, నియోజకవర్గంలో తమ అవకాశాలను అంచనా వేస్తున్నాయి.తాజా సర్వే ఫలితాలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఏ పార్టీకి ఏకపక్ష ఆధిపత్యం లేదని స్పష్టం చేస్తున్నాయి. బీఆర్‌ఎస్‌కు మాగంటి గోపీనాథ్ కుటుంబంపై సానుభూతి ఉన్నప్పటికీ, గెలుపు హామీ కాదని సర్వేలు సూచిస్తున్నాయి. సునీత బరిలోకి దిగితే బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఆమె నిర్ణయం ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ ఎంఐఎం కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తే, అధికార పార్టీకి విజయావకాశాలు గణనీయంగా పెరుగుతాయని సర్వేలు తెలిపాయి. ఎంఐఎం స్వతంత్రంగా పోటీ చేస్తే, ఓట్ల చీలిక బీఆర్‌ఎస్‌కు కలిసిరావచ్చని కొన్ని నివేదికలు అంచనా వేస్తున్నాయి.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సామాజిక సమీకరణాలు, ముఖ్యంగా మైనారిటీ ఓట్లు, ఫలితాన్ని నిర్ణయించే కీలక అంశంగా మారాయి. ఎంఐఎం పోటీ చేస్తుందా లేదా ఏ పార్టీకి మద్దతు ఇస్తుందనేది ఇంకా అస్పష్టంగా ఉంది. కాంగ్రెస్, ఎంఐఎం నాయకత్వంతో చర్చలు జరుపుతూ, వారి మద్దతును రాబట్టే

# డిఫెన్స్ అకాడమి పేరుతో మోసం..

నల్గోండ, జూన్ 26, : అది పేరుకే డిఫెన్స్ అకాడమీ.. ఆర్మీ, నేవీ, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలంటూ హంగూ అర్భాటాలతో ప్రచారం.. రంగురంగుల బ్రోచర్లు.. మాయ మాటలు.. శాంపిల్స్ టెస్టులు.. ఇలా విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అరచేతిలో వైకుంఠం మాదిరి చూపించి.. రూ.లక్షలకు రూ.లక్షలు ఫీజుల దోపిడీకి దిగుతున్నారు. రెండు మూడేండ్లలో కొలువులంటూ నయా దందాకు తేరలేపారు.అదే నల్లగొండ జిల్లా కేంద్రానికి సమీపంలో రామయ్య డిఫెన్స్ అకాడమీ. నిజానికి కేంద్ర ప్రభుత్వం అగ్నివీర్ స్కీమ్ తీసుకొచ్చాక.. కేంద్ర భద్రత బలగాల కొలువులు ఆశించేవారి పరిస్థితి డొలాయమానంలో పడింది.కానీ రామయ్య డిఫెన్స్ అకాడమీ మాత్రం తన మాయ మాటలతో బురిడీ కొట్టించి అడ్మిషన్ల పేరుతో ఇంటిగ్రేటేడ్ కోర్సులంటూ ప్రతి ఏటా రూ.కోట్లు దండుకుంటున్నారు. ఏండ్ల తరబడిగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ తరహా దందా జరుగుతున్నా.. జిల్లా యంత్రాంగం కన్నెత్తి అటువైపు చూడకపోవడం కొసమెరుపు.ప్రస్తుతం చర్లపల్లిలో నిర్వహిస్తున్న రామయ్య డిఫెన్స్ అకాడమిని నిర్వాహకులు ఇష్టారాజ్యంగా నడిపేస్తున్నారు. వాస్తవంగా రామయ్య డిఫెన్స్ అకాడమీలో ఇంటిగ్రేటెడ్ కోర్సులంటూ విద్యార్థులకు ఎర వేస్తున్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు కేంద్ర భద్రత బలగాల కొలువులు సాధించేలా తీర్చిదిద్దుతామని నమ్మబలుకుతున్నారు. అందుకోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.1.50 లక్షలకు పైగా వసూలు చేస్తుండడం గమనార్హం.అసలు విషయం ఏమిటంటే.. రామయ్య డిఫెన్స్ అకాడమీకి ఇంటర్మీడియట్ అనుమతులు లేవు. కానీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కాలేజీలో విద్యార్థికి అడ్మిషన్ చేయించి.. చర్లపల్లిలోని రామయ్య డిఫెన్స్ అకాడమీలో క్లాసులు చెబుతుండడం కొసమెరుపు. ఒక్క మాటలో చెప్పాలంటే.. అసలు అనుమతి లేకుండానే ఇంటర్ కాలేజీని నిర్వహించడమనేది అతిపెద్ద క్రైమ్ అని చెప్పాలి.ప్రతి విద్యార్థి దశలో కీలకంగా భావించే ఇంటర్ దశలోనే విద్యార్థిని రామయ్య డిఫెన్స్ అకాడమీ మిస్ గైడ్ చేస్తోంది. సదరు ప్రైవేటు కాలేజీలో తరగతులకు హాజరుకావాల్సి ఉన్నా.. ఏనాడూ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు అడుగుపెట్టే పరిస్థితి ఉండదు.ఎందుకంటే.. అసలు రామయ్య డిఫెన్స్ అకాడమీ నుంచి తాము ఇంటర్ పూర్తి చేస్తున్నామని అనుకుంటున్నారే తప్ప.. ఇతర కాలేజీలో అడ్మిషన్ తీసుకుంటున్న సంగతి విద్యార్థులకు తెలియకుండా రామయ్య డిఫెన్స్ అకాడమీ జాగ్రత్త పడుతోంది.నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ భారీ స్థాయి దందా ఏండ్ల తరబడిగా సాగుతున్నా.. జిల్లా యంత్రాంగానికి కాసింతైనా పట్టింపులేకపోవడం విమర్శలకు దారితీస్తోంది. అసలే ఓ వైపు ప్రైవేటు విద్యాసంస్థల నిలువు దోపిడీతో అప్రతిష్టను మూటగట్టుకుంటున్న విద్యాశాఖ.. రామయ్య డిఫెన్స్ అకాడమీ వ్యవహారాన్ని తేల్చకపోవడం వెనుక ఆంతర్యం ఏంటో తెలియడం లేదు.జిల్లా స్థాయి అధికారులు ఉండే నల్లగొండ జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉండడం.. అధికారులు పట్టించుకోకపోవడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. ఇలాంటి అనుమతులు లేని విద్యా సంస్థల్లో చదివి దారుణంగా మోసపోయిన ఘటనలను జిల్లాకు అనుకుని ఉన్న హైదరాబాద్లో ఇటీవల కాలంలో చూశాం.కానీ ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్నా.. పట్టింపులేకపోవడం దారుణమనే చెప్పాలి. ఏదైనా ఘటన జరిగిన తర్వాత స్పందించడం కంటే.. ముందు జాగ్రత్తగా అలర్ట్ అయ్యి విద్యార్థులను భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు

# ప్రైవేటు బస్సు బోల్తా 30 మందికి గాయాలు




నాగర్ కర్నూల్ అమ్రాబాద్ మండలం దోమలపెంట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ప్రవేట్ ఆర్టీసీ బస్సు బోల్తా పడ్డది.... అందులో ప్రైస్ ని ఇస్తున్న ముగ్గు 30 మందికి గాయాల పాలయ్యారు... గాయపడ్డ అందరిని కర్నూలు జిల్లా సున్నిపెంట ప్రభుత్వాసుపత్రికి తరలించారు... జనగామ నుంచి శ్రీశైలం వెళు_న్న ప్రైవేట్ టూరిస్ట్ బస్సు టూ08జం2329 నంబర్ గల టూరిస్ట్ బస్సు అదుపుతప్పి బ్రేకులు ఫెయిల్ అయి కొండను ఢీ కొట్టడంతో బోల్తా పడి ప్రమాదం జరిగింది...

## పోలవరం ఎత్తు తగ్గించి రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీ

నరసరావు పేట పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం గురువారం నాడు నరసరావుపేటలో జరిగింది. ముఖ్య అతిథిగా పిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి పాల్గోన్నారు.

షర్మిలా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుంది. విస్తృత స్థాయి సమావేశాల్లో అన్ని సూచనలు పరిగణలోకి తీసుకుంటున్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటం రాజకీయంగా చాలా అవసరం. కాంగ్రెస్ అధికారంలో వస్తేనే విభజన హామీలు సాధ్యం అవుతాయి. బీజేపీ గడిచిన 10 ఏళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత. కానీ బీజేపీ రాజధానికి అప్పులు ఇస్తుంది. పోలవరం ఎత్తు తగ్గించి రాష్ట్రానికి బీజేపీ అన్యాయం చేసింది. బీజేపీకి రాష్ట్ర ప్రయోజనాలను టీడీపీ, వైసీపీ,జనసేన పార్టీలు తాకట్టు పెట్టాయని అన్నారు. రాష్ట్రంలో స్వార్థ రాజకీయాలు నడుస్తున్నాయి. బీజేపీ కి రాష్ట్రాన్ని తాకట్టు పెడుతున్నారు. బీజేపీని వ్యతిరేకించేది ఒక్క కాంగ్రెస్ మాత్రమే. అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడుతుంది. బీజేపీని ఎదిరించే సత్తా ఉన్నది కాంగ్రెస్ కి మాత్రమే. రాష్ట్రంలో కాంగ్రెస్

# పల్లెల్లో ఎన్నికల వేడి

వరంగల్, జూన్ 26,: స్థానిక సంస్థలకు సంబంధించి ఎన్నికల నిర్వహిస్తామని అనేక సందర్భాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఇక బీసీలకు రిజర్వేషన్లు కూడా కేటాయిస్తామని వెల్లడించింది. బిసీల రిజర్వేషన్ల విషయంలో అనేక న్యాయపరమైన సమస్యలో ఉన్న నేపథ్యంలో.. ప్రభుత్వం కాస్త వెనుకడుగు వేసినట్టు తెలుస్తోంది. ఇటీవల బీసీల రిజర్వేషన్లకు సంబంధించి శాసనసభలో ప్రభుత్వం ఒక తీర్మానాన్ని రూపొందించి కేంద్రానికి పంపించింది. అయితే ఆ తీర్మానాన్ని కేంద్రం ఇంకా ఆమోదించలేదని తెలుస్తోంది. కేంద్రం ఆమోదించిన తర్వాత అది రాష్ట్రపతి పరిధిలోకి వెళ్తుంది. రాష్ట్రపతి ఆమోదముద్ర వేస్తే ఆ బిల్లుకు మోక్షం లభిస్తుంది. అయితే బీసీలు కేవలం తెలంగాణలో మాత్రమే లేరు కాబట్టి.. పైగా రిజర్వేషన్ల అంశం అనేది కేంద్ర పరిధిలోది కాబట్టి.. దీనిపై స్పష్టత రావాల్సిన అవసరం ఉంది.స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించడంలో ప్రభుత్వం ఆశించినత స్థాయిలో ఆసక్తి చూపించకపోవడంతో రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం రంగంలోకి దిగింది. ఇప్పటికే స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి అనేక పిటిషన్లు వెళ్లాయి. ఆ పిటిషన్లను పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30 లోపు ఎన్నికల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఎన్నికల సంఘానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. వార్డుల విభజన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది స్పందించారు. ప్రభుత్వం తరఫున ఎన్నికల నిర్వహణకు 30 రోజుల సమయం కావాలని కోరారు. మరోవైపు ఎన్నికల నిర్వహణకు 60 రోజుల గడువు కావాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం కోరింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసిన సర్వోన్నత న్యాయస్థానం సర్పంచ్, ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలను సెప్టెంబర్ లోపు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.వార్డుల విభజన, ఓటర్ జాబితాలో మార్పులు , చేర్పులు.. కొత్త ఓటర్లు నమోదు.. రిజర్వేషన్లు.. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత ఎన్నికలు జరుగుతాయని తెలుస్తోంది.. ఇక తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. పార్లమెంటు ఎన్నికల్లో 8 స్థానాలు సాధించినప్పటికీ.. అధికార పార్టీకి ఆ ఫలితాలు అంతగా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు ఏడాదిన్నర పరిపాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో.. స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో సత్తా చాటాలని భావిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో జడ్పీ చైర్మన్, ఇతర స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీ కూడా అధికార పార్టీకి గట్టి పోటీ ఇస్తామని చెబుతున్నాయి

# రైలు పట్టాలపై కారు నడిపిన యువతి పలు రైళ్లకు అంతరాయం





శంకర్ పల్లి నాగుల పల్లి నుండి శంకర్ పల్లి వెళ్లే మార్గంలో రైలు పట్టాలపై కారు నడుపుతూ యువతీ హల్ చల్ చేసింది. నాగులపల్లిలో స్థానికులు గమనించి కారు ను అడ్డుకున్నప్పటికీ పట్టాలపై వేగంగా కారు నడుపుతూ హల్చల్ చేసింది. గమనించిన రైలు పైలెట్ ట్రైన్ ను నిలిపివేశాడు. ఈ నేపథ్యంలో పట్టాలపై మార్గమధ్యంలో పలు రైళ్లు ఆగిపోయాయి. గంటల తరబడి రైల్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న శంకరపల్లి పోలీసులు యువతి ని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది.

# రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి సబ్బులకోసం ఎగబడ్డ జనాలు

మంచిర్యాల:ఇల్లు కాలి ఒక్కడు ఏడిస్తే... ఇంట్లో ఉన్నది దోచుకెళ్ళడానికి ఏం లేకపాయే అని ఏడ్చినట్టు ఉంది కొందరి తీరు... మంచిర్యాల జిల్లాలో కొందరి వ్యవహారం ఇలాంటి సామెత లాగే నే అనిపిస్తుంది... మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మున్సిపాలిటి పరిధిలోని ఇటిక్యాల సమీపంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. మరికొందరికి గాయాలు అయ్యాయి. ఎదురెదురుగా ఢీకొన్న లారీలు నుజ్జు నుజ్జు అయ్యాయి. అయితే ఇందులో ఒక లారీ సంతూరు సబ్బుల లోడ్ తో వెళ్తున్న లారీ ప్రమాదానికి గురయ్యింది. దీంతో సబ్బులు బయట పడ్డాయి, ఇదే అదునుగా భావించిన జనం ఎగబడి దొరికిన సబ్బులను దొరికినట్టు సంచుల్లో నింపుకుని వెళ్లారు, ప్రమాదం జరిగిందనే మానవత్వాన్ని మరిచి దొంగతనానికి పాల్పడిన తీరుపై పలువురు ముక్కున వేలేసుకున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గాయపడిన వారిని, మృతి చెందిన డ్రైవర్ మృత దేహాన్ని లక్షెట్టి పేట ప్రభుత్వాసుపత్రీ కి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు..

# ఆ యువతికి మతిస్థిమితం లేదు



చేవెళ్ల శంకర్ పల్లి రైల్వే ట్రాక్ పై కారుతో హల్ చల్ చేసిన యువతి లక్నో కు చెందిన రబిక సోనీ గా గుర్తించారు. మతిస్థిమితం లేనిది నిర్ధారించారు. రబిక ను 108 వాహనంలో చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి శంకర్ పల్లి పోలీసులు తీసుకువచ్చారు. యువతి పోలీసు నుండి తప్పించుకోవడానికి ట్రై చేసింది.

## జైనథ్ లో ఇళ్లలోకి వర్షపునీరు.. బాధితుల ఆందోళన

ఆదిలాబాద్ జైనథ్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఎత్తు పెంచడంతో వర్షపునీరు ఇళ్లలోకి చేరింది. దీంతో బాధితులు గురువారం ఉదయం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వర్షపు నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని కోరారు.

## గోదావరి జిల్లాల పర్యాటక కేంద్ర ప్రాజెక్టు ఈ అఖండ గోదావరి పర్యాటక కేంద్రంగా హేవలాక్ వంతెన మంత్రి కందుల దుర్గేష్

రాజమండ్రి రూ.94.44 కోట్ల అంచనా వ్యయంతో అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగడం శుభ సందర్భంగా భావిస్తున్నామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.ప్రాజెక్టులో భాగంగా హేవలాక్ బ్రిడ్జి, బ్రిడ్జిలంక, పుష్కర్ ఘాట్, కడియం నర్సరీలు, నిడదవోలు కోట సత్తెమ్మ దేవాలయం,గోదావరి కాలువను సర్క్యూట్ గా ఏర్పాటు చేయనున్నాం. అఖండ గోదావరి ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారు చేసుకొని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను న్యూఢిల్లీలో కలిశాం..తొలి నుండిసంపూర్ణ సహకారం అందించి ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చారని అన్నారు.అఖండ గోదావరి ప్రాజెక్టుకు సహకరించినందుకు కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ప్రత్యేక కృతజ్ఞతలు. సీఎం చంద్రబాబునాయుడు ఆలోచనల మేరకు ఈ ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక చొరవ చూపించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ పురందేశ్వరీలకు ధన్యవాదాలని అన్నారు.127 ఏళ్ల క్రితం బ్రిటీష్ వారు నిర్మించిన హేవలాక్ వంతెనను సుందర పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం. హేవలాక్ వంతెనను కొత్త రూపు తేవాలన్న ఆలోచనకు చాలా కాలంగా ప్రయత్నం జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రయత్నాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం వేస్తున్న తొలి మెట్టు అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమమని అన్నారు.

## ఏలూరు సబ్ జైలు ముదు మహిళ ఆత్మహత్యాయత్నం

ఏలూరు సబ్ జైలు వద్ద పెట్రోల్ పోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. గత కొన్ని రోజుల క్రితం భర్త సోమేశ్వరరావు (32) వేధిస్తున్నాడని భార్య లావేటి మోహిని, ఏలూరు మహిళ పోలీస్ స్టేషన్లో కేసు పెట్టింది. భర్తను అరెస్టు చేయడం లేదని మనస్థాపానికి గురై గురువారం ఉదయం ఏలూరు సబ్ జైల్ వద్ద మోహిని పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధిత మహిళను 108 వాహనంలో ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధల నేపథ్యంలో మోహిని ఓల్డ్ ఏజ్ హోం లో ఉంటోంది.

# ఆటో బోల్తా పదిహేనుమంది కార్మికులకు గాయాలు



నెల్లూరు సైదాపురం మండలం కలిచేడు వద్ద కూలీల తో వెళుతున్న ఆటో బోల్తా పడింది. ఘటనలో పదిహేనుమంది మైనింగ్ కార్మికులకు గాయాలు అయ్యాయి. సైదాపురం మండలం అనంతమడుగు నుండి పొదలకూరు మండలం కొనగలూరుకు కూలీలు వెళుతున్నారు. ఆటో కలిచేడు మసీదు వద్ద అదుపుతప్పి తూము లోకి వెళ్ళి బోల్తా పడింది. క్షతగాత్రుల్లో ఇద్దరు మగవారికి ఓ మహిళ కు తీవ్ర గాయాలు అయ్యాయి.

## ఇంద్రకీలాద్రిలో ఘనంగా అమ్మవారికి సారె సమర్పణ

విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారికి తొలి సారె ను ఈవో శినానాయక్ దంపతులు సమర్పించారు. మేలతాళలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారే సమర్పణ జరిగింది. పసుపు కుంకుమ పువ్వులు, గాజులు, చలిమిడి గోరింటాకు అమ్మవారికి శేష వస్త్రాలను ఈవో సమర్పించారు. ఈవో మాట్లాడుతూ తమ చేతులు మీదగా సారె సమర్పించడం సంతోషంగా ఉందని అన్నారు. ఆషాడ మాసంలో అమ్మవారిని తమ పుట్టింటికి రమ్మని వేడుకుంటూ సారె సమర్పణ చేసాం. ఆషాడ మాసం నెల రోజులపాటు అంగరంగ వైభవంగా సారే సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయి. తెలంగాణ నుండి అమ్మవారికి 29వ తేదీన బంగారు బొనాం సమర్పణ వుంటుంది. ఈ ఆషాడ మాసంలోనే అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాలు జరుగుతాయని అన్నారు.

# రైతుల ఖాతాల్లో రుణ మాఫీ నిధులు జమ

### జిల్లాలో 26454 మంది రైతుల ఖాతాల్లో రూ.219 కోట్ల రుణ మాఫీ నిధులు జమ

### ప్రభుత్వం విడుదల చేసిన రుణ మాఫీ నిధులతో రైతుల్లో ఆనందం




**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 26:** రైతు సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న ప్రాధాన్యత మరోసారి రుణ మాఫీ నిధుల విడుదలతో వెల్లడైంది.

రెండు లక్షల రూపాయలు వరకు రుణ మాఫీ కి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నందుకు రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం

జిల్లాలో ఇప్పటి వరకు 26454 మంది రైతుల ఖాతాల్లో రూ.219 కోట్ల నిధులు విజయవంతంగా జమయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తెలిపారూ.




%జ్బతీఋస్త్రుతీఝఎ% మండలంలో 2044 మంది రైతులకు 18.కోట్ల 92 లక్షల రూ.లు, గోవిందరావుపేట మండలంలో 2185 మంది రైతులకు 16 కోట్ల 62 లక్షల రూ.లు, కన్నాయిగూడెం మండలంలో 1625 మంది రైతులకు 11 కోట్ల 08 లక్షలు, %ఝఅస్త్రుజూవ్% మండలంలో 3975 మంది రైతులకు 36 కోట్ల 33 లక్షల రూ.లు, తాడ్వాయి మండలంలో 1797 మంది రైతులకు 13 కోట్ల 78 లక్షల రూ.లు, వెంకటాపురం మండలంలో 2305 మంది రైతులకు 15 కోట్ల 51 లక్షల రూ.లు, %ఝఓవవస% మండలంలో 2286 మంది రైతులకు 20 కోట్ల 96 లక్షల రూ.లు, ములుగు మండలంలో 6187 మంది రైతులకు 53 కోట్ల 71 లక్షల రూ.లు, వెంకటాపూర్ మండలంలో 4050 మంది రైతులకు 32 కోట్ల 06 లక్షల రుణ మాఫీ నిధులు వారి ఖాతాలలో జమ కావడం జరిగిందని తెలిపారు. ఇట్టి లబ్ధిదారుల జాబితా ప్రతి గ్రామపంచాయతీలో మూడు ప్రధాన కూడలిలో ఫ్లెక్సీ ల రూపంలో డిస్ప్లే చేయడం జరిగింది.

## చిన్న బోనాల గురుకుల కళాశాలలో డిజిటల్ పేమెంట్స్, సైబర్ నేరాల పైన అవగాహన కార్యక్రమం.



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్-26 ( ప్రజాబలం ప్రతినిధి),** గురువారం రోజున టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ గురుకుల కళాశాల చిన్న బోనాల నందు డిజిటల్ పేమెంట్స్ మరియు సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి జయరాజ్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను సులభంగా డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా చేసుకోవచ్చని, యూపీఐ పేమెంట్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం లావాదేవీలను వినియోగించుకోవాలని అన్నారు. అలాగే వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ బెట్టింగ్ ఆప్స్, లెండింగ్ యాప్స్, ఫేక్ వెబ్సైట్లు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల బారిన పడకుండా అన్ని రకాల లావాదేవీలు అప్రమత్తంగా ఉండాలన్న అన్నారు. సైబర్ నేరానికి గురి అయితే 1930 కి కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ అధికారులు అబ్దుల్ రెహమాన్, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి మల్లికార్జున్, కళాశాల ప్రిన్సిపాల్ జస్మిన్ తెరిసా, హార్దిక అక్షరాస్యత కౌన్సిలర్స్ పాల్గొనడం జరిగింది.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది

### రైతును రాజు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

### రైతులు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి సాధ్యం



**పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 26:** గురువారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన సేంద్రియ మరియు ప్రకృతి వ్యవసాయం పై రైతు అవగాహన సదస్సులో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు మాట్లాడుతూ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులు మారాలని అన్నారు.తరతరాలుగా వస్తున్న సంస్కృతి వ్యవసాయం అని, దేశ వ్యవసాయ రంగం ప్రపంచానికే అగ్రస్థానం అని అన్నారు. ప్రపంచ మార్కెట్లో పోటీపడి రైతులు పంటలు పండించినప్పుడే దేశం ఉన్నత స్థాయికి ఎదుగుతుందని, రైతులు గౌరవంగా జీవించగలుగుతారన్నారు. పిఎసిఎస్ లో వ్యాపార దృక్పథం పోయి రైతు శ్రేయస్సుకు పనిచేసినప్పుడే రైతులు అభివృద్ధికి కృషి చేసిన వారు అవుతారన్నారు. సేంద్రీయ పంట వ్యవసాయ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, మండలానికి 125 మంది రైతులు ఎంపిక చేసి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం దేశం అభివృద్ధి సాధ్యమని అన్నారు. రాష్ట్ర ఆదాయం 34% రైతుల నుండే వస్తుందని, రైతుల ఆదాయం పెరిగితేనే రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం పెరుగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం రైతాంగా అభివృద్ధికి కృషిచేస్తుందన్నారు.

# మత్తు పదార్థాలు వాడకం చేయడం ప్రమాదకరం.

### మత్తు పదార్థాలకు ఎవరు బానిస కావొద్దు. ,డ్రగ్స్ మహమ్మారిని తరిమికోడదాం.

### డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మిద్దాం.

### మత్తు పదార్థాల వాడకంపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.

### మంత్రి ధనసరి అనసూయ సీతక్క.






ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 26: యువతి యువకులు మత్తు పదార్థాలను వాడకుండా అన్నిచోట్ల అవగాహన సదస్సులు నిర్వహించాలని, మత్తు పదార్థాలను వాడకం చేయడం ఒక భూతం లాంటిదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తంగేడు మైదానం లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం నకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నేటి సమాజాన్ని డ్రగ్స్ భూతంలా పట్టి పీడిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో కొందరు అక్రమార్కులు వ్యాపారాత్మక ధోరణిలో పసి పిల్లలకు చాకోలెట్స్ రూపంలో డ్రగ్స్ ను అలవాటు చేయించి ఆ మత్తులోకి లాగేస్తుండటం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. దీన్ని సవాల్ గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహి%శీ%చడం జరుగుతుందని అన్నారు.

యువత డ్రగ్స్ కి అలవాటు కావడం వలన వారి నిండు భవిష్యత్తు చీకటిలోకి నెట్టివేయబడుతుందని అన్నారు. రాష్ట్రం లో కానీ, దేశంలో కానీ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధుల పై కూడా అత్యంత క్రూరంగా జరుగుతున్న లైంగిక దాడుల్లో డ్రగ్స్ తీసుకున్నవారే అధికంగా ఉంటున్నారని అన్నారు. ఈ పరిస్థితి నుండి బయట పడాలంటే చాలా కష్టమైన విషయం కాబట్టి, మన రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడం కోసం తెలంగాణ ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తుందని, దీనిని విజయవంతం చేయడానికి ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వాడకం చేయడం వల్ల కుటుంబాలు నాశనం కావడమే కాకుండా ఎంతో విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతి యువకులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్థాలు వాడకం చేయడంలో దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వాడకం వలన జరిగే అనారోగ్య సమస్యలపై యువత అవగాహన సదస్సు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో యాంటీ డ్రెస్ వాడకాన్ని పూర్తిగా నిషేధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని, దీని వాడకం చేయడం వలన జరిగే నష్టాలపై సంబంధిత శాఖల అధికారులు పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వద్దు జీవితం ముద్దు అనే ఆలోచనతో యువత ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ పరిస్థితులను అవగాహన చేసుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మంచి జీవితాన్ని కొనసాగించడానికి చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. యువతే దేశ భవిష్యత్తు అని, మీ తల్లి తండ్రులు మీ పై ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నారని, ఉన్నత చదువులు చదివి ఉన్నతబుద్యోగాలు సాధించి కుటుంబానికి, ఈ దేశానికి గొప్ప ఆస్తిగా ఎదగాలని సూచించారు. చదువుతున్న యువతలో వారు స్వతహాగా మంచి ఆలోచనతో ఉన్నా కూడా చుట్టూ ఉన్న సహచరుల ప్రభావం వల్ల కూడా చాలా మంది సిగరెట్, గంజాయి వంటిడ్రగ్స్ కి అలవాటు అయ్యే ప్రమాదం ఉందని, ఒకసారి డ్రగ్స్ కి అలవాటు అయితే వారు నుండి దూరం కావడం చాలా కష్టం, సమాజం కూడా ఇలాంటి వారిని చిన్న చూపు చూస్తుంది. ఇలా డ్రగ్స్ కి బానిస అయిన వారిని బయటకు తీసుకు రావడానికి కేవలం కౌన్సిలింగ్ అనే ఒక మార్గం మాత్రమే ఉందని, ఎవరినైనా అలాంటి పరిస్థితుల్లో గుర్తిస్తే %ఱ+ూచీదీ%, నషా ముక్త్ భారత్ అభియాన్ విభాగాలను సంప్రదించాలని అన్నారు. ఒక అందమైన జీవితం మీ కోసం ఎదురుచూస్తుంది దానిని సాధించడం కోసం ప్రయత్నించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఎస్ పి శబరీష్ మాట్లాడుతూ అందరం కలిసి డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాడాలని సందేశం ఇవ్వడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. డ్రగ్స్ అంటే గంజాయి మాత్రమే కాదని సిగరెట్, గుట్కా, జర్దా అది ఏ రూపంలో ఉన్నా డ్రగ్స్ గానే భావించాలని తెలిపారు. కంట్రోల్ గా డ్రగ్స్ తీసుకుంటున్నాం అనుకునే వాళ్ళు కూడా వాటికి అలవాటైతే వారే డ్రగ్స్ కంట్రోల్ లోకి వెళ్తారని అన్నారు. ఒకసారి డ్రగ్స్ కి అలవాటు అయితే వాటిని కొనుక్కోనే కోసం దొంగతనాలకు అలవాటు అయ్యే పరిస్థితి వస్తుందని అన్నారు. చదువుల్లో టాపర్ గా ఉండి ఎంతో గొప్ప స్థానానికి వెళ్తార అని అనుకున్న వాళ్ళు కూడా ఊహించని స్థాయికి దిగజారి పోవడం జరుగుతుందని తెలిపారు. టీచర్లు, తల్లి తండ్రులు తమ పిల్లల చదువులపై దృష్టి పెట్టాలని, వారి క్రమశిక్షణ, ప్రవర్తన లో ఏవిధమైన మార్పులు గమనించినా తగిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ నిర్మూలనలో పోలీస్ శాఖ చేస్తున్న యజ్ఞం లో భాగస్వామ్యం కావాలని ప్రజలను కోరారు.

అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థులు డ్రగ్స్ వాడటం వాళ్ళ కలిగే నష్టాలపై ప్రదర్శించిన నాటిక కార్యక్రమంలో పాల్గొన్న వారిని ఆలోచింపచేసింది.

అనంతరం మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్ పి ల తో కలిసి జెండా ఊపి ఈ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీని ప్రారంభించగా జిల్లాలోని వివిధ ప్రాంతలనుండి విచ్చేసిన దాదాపు 1500 మంది యువత, విద్యార్థినీ, విద్యార్థులు తంగేడు నుండి %ఱూ=% ఫంకన్ వరకు

ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, అదనపు ఎస్ పి సదానందం, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్,

సంబంధిత అధికారులు, యువత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పరకాల పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



**పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 26:** గురువారం పరకాల పట్టణంలో TUFIDC నిధులతో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు పరిశీలించారు. అనంతరం సీఎంఎస్ గోదాం కాలనీ, యూనియన్ బ్యాంక్ ప్రాంతం, బస్టాండ్ పరిసర తదితర ప్రాంతాలను పరిశీలించారు. డిపిఆర్ కి అనుగుణంగా పనులను చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పరకాల మున్సిపాలిటీని సుందరీకరణ చేసి అభివృద్ధిలో ముందు ఉంచాలని,మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులను సమన్వయం చేస్తూ ముందుకెళ్లాలన్నారు.మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయడంతో పాటు, కొత్త అభివృద్ధి పనులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాలని ఎంఎల్ఏ అధికారులను ఆదేశించారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పని చేయాలని సూచించారు

## తెలంగాణలో డ్రగ్స్ ఉండరాదు

### నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నాం

### మంత్రి కోమటిరెడ్డి

నల్గొండ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవంలో భాగంగా రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఎన్జీ కళాశాల వద్ద జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. తరువాత క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.తెలంగాణ కోసం 11 రోజులు ఇక్కడే నిరాహార దీక్ష చేశాను. కరోనా తర్వాత డ్రగ్స్ వాడకం మరింత పెరిగింది. స్టూడెంట్స్ బానిసలుగా మారుతున్నారు. తెలంగాణలో డ్రగ్స్ ఉండరాదు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ కట్టిస్తున్నాం.నల్గొండలో 34 కోట్లతో స్కిల్ సెంటర్ కట్టిస్తున్నాం. త్వరలోనే సిఎం తో ప్రారంభిస్తాం. డ్రగ్స్ వాడే వారిని కొట్టండి..పోలీసులకు సమాచారం ఇవ్వండని అన్నారు.

విద్యార్థులకు ఇది లైఫ్ టర్నింగ్ టైం. 20 ఏండ్ల వరకు చదువు,స్పోర్ట్స్,యోగ పై దృష్టిపెట్టండి. హైద్రాబాద్ లో డ్రగ్స్ పై కఠిన చర్యలు తీసుకొంటున్నాం.ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నాం.

# అర్హత గల ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ ఫలాలు అందించాలి

## రాష్ట్ర ఆబ్కారీ,పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి,ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 26 : అర్హత గల ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలని రాష్ట్ర ఆబ్కారీ,పర్యాటక, సాంస్కృతిక,పురావస్తు శాఖల మంత్రి,ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి,భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద,పార్లమెంట్ సభ్యులు నగేష్, మంచిర్యాల,కొమురం భీం ఆసిఫాబాద్,ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్లు కుమార్ దీపక్,వెంకటేష్ దోత్రే,రాజర్షి షా,అభిలాష అభినవ్,శాసన మండలి సభ్యులు దండే విఠల్, ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు కోవ లక్ష్మి, గడ్డం వినోద్,పాయల్ శంకర్,మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్,అనిల్ జాదవ్,రామారావు పటేల్, హరీష్ రావు లతో కలిసి జిల్లా అధికారులతో అభివృద్ధి పనులు,సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక,సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయాలని,అర్హత గల ప్రతి లబ్దిదారుడికి అందించాలని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అమలు చేసే బాధ్యత అధికారులదేనని,ఎలాంటి జాప్యం లేకుండా పథకాలు అమలు చేయడంలో సమన్వయంతో పని చేయాలని,గ్రామసభలలో సేకరించిన లబ్దిదారుల వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు.రాష్ట్రంలో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో అధికారులు బాధ్యతగా విధులు నిర్వహిస్తూ నిర్ణీత సమయం లోగా పథకాలను అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రైతుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం రైతుభరోసా పథకం ద్వారా 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయలను అర్హత గల రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని,వానాకాలం పంట సాగుకు పెట్టుబడి సాయం అందించిందని తెలిపారు.రుణమాఫీ పథకం ద్వారా 2 లక్షల రూపాయల లోపు రుణం గల రైతులకు 21 వేలకోట్ల రూపాయలు మాఫీ చేసిందని,ప్రతి గ్రామాన్ని జిల్లా కేంద్రానికి అనుసంధానించేలా రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి లబ్దిదారుడికి అందించే విధంగా అధికార యంత్రాంగం,ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు.రాష్ట్ర కార్మిక,ఉపాధి,భూగర్భ గనుల శాఖ మంత్రి మాట్లాడుతూ...జిల్లాను అభివృద్ధి బాటలో నడిపించేందుకు అధికార యంత్రాంగం సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని, అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని తెలిపారు.గృహజ్యోతి పథకంలో అర్హులైన లబ్దిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని,రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 5 లక్షల నుండి 10 లక్షల రూపాయలకు పెంచడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. విద్యారంగ బలోపేతం దిశగా ప్రభుత్వం చేపట్టిన చర్యలలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు త్రాగునీరు, విద్యుత్ ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య,వైద్యం,ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందించడంతో పాటు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...ప్రభుత్వం తలపెట్టిన ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో అధికారుల సమన్వయంతో సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని,ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.జిల్లాకు మంజూరైన 10 వేల 128 ఇందిరమ్మ ఇండ్లలో 3 వేల 355 ఇండ్లకు బేస్మెంట్ మార్కింగ్ చేయడం జరిగిందని,458 ఇండ్లకు సంబంధించిన బేస్మెంట్ స్థాయి బిల్లులు చెల్లించడం జరిగిందని తెలిపారు.ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుకను ఉచితంగా అందిస్తున్నామని, ఓరియంట్ సిమెంట్ యాజమాన్యంతో మాట్లాడి సిమెంట్ రాయితీతో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో 2 లక్షల 53 వేల 844 రేషన్కార్డులకు 3 నెలలకు సరిపడా రేషన్ సన్నబియ్యంను అందించడం జరుగుతుందని,నూతన రేషన్కార్డు కొరకు అందిన 7 వేల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని,త్వరగా అర్హులకు జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 1 లక్షా 42 వేల 500 లబ్దిదారులకు 500 రూపాయలకే గ్యాస్ అందించడంతో పాటు దాదాపు 1 లక్షా 53 వేల మంది లబ్దిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు జిల్లాలో చేస్తున్న వ్యవసాయ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడం జరిగిందని,పంట సాగులో అధిక దిగుబడి సాధించే విధంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో నకిలీ/నిషేధిత విత్తనాలు,ఎరువుల విక్రయం,వినియోగాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.భూభారతి చట్టం అమలులో భాగంగా జిల్లాలోని భీమారం మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసి నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 2 వేల 148 దరఖాస్తులు వచ్చాయని, సాదాబైనామా సంబంధిత దరఖాస్తులను మినహా మిగతా దరఖాస్తులను దాదాపు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. వానాకాలం పంటకు పెట్టుబడి సాయాన్ని అందిస్తూ ప్రభుత్వం చేపట్టిన రైతుభరోసా పథకంలో భాగంగా జిల్లాలోని 1 లక్షా 52 వేల 442 మంది రైతుల ఖాతాలలో 198 కోట్ల 58 లక్షల 37 వేల 377 రూపాయలు జమ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్స్ లో రాష్ట్రస్థాయి పోటీలకు బాల, బాలికలు ఎంపిక.



**రాజన్న సిరిసిల్ల,( ప్రజాబలం ),** తెలంగాణ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం రోజున అనగా 26-06-2025 రోజున తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలు హకీంపేట్, కరీంనగర్ మరియు ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లో 2025-26 విద్యా సంవత్సరమునకు 4 వ తరగతిలో ప్రవేశమునకు గాను మండల స్థాయి నుండి ఎంపికైన వారు దాదాపు 111 మంది బాలబాలికలు గురువారం రోజున తేదీ26-06-2025 మినీ స్టేడియంలో జరిగినటువంటి జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ సెలక్షన్ లో పాల్గొనడం జరిగింది. ఇట్టి జిల్లా స్థాయి సెలక్షన్స్ లో, ముఖ్యంగా బాలురు 10 మంది మరియు బాలికలు పది మందిని ఎంపిక చేసి, జూలై 1 మరియు 2 న జరిగే స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్ రాష్ట్ర స్థాయి ఎంపిక పంపించడం జరుగుతుంది. ఇట్టి సెలక్షన్స్ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఆధ్వర్యంలో వివిధ మండలాల వ్యాయామ ఉపాధ్యాయుల అనుసంధానంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ నుండి వచ్చినటువంటి అబ్జర్వర్ సంతోష్ పర్యవేక్షణలో ఈ యొక్క సెలక్షన్లు విజయవంతంగా గురువారం రోజు పూర్తి చేయబడినవి అన్ని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఎం. రాందాస్ తెలియజేశారు.



## రెండు లారీలు డీ ,ఒకరి మృతి,మరొకరికి గాయాలు



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూన్ 25 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలోని ఇటిక్యాల స్టేజి సమీపంలో %చీఎ%63 రోడ్డుపై అర్ధరాత్రి(రాత్రి12.30గంటలకు) రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొనడంతో సిమెంట్ లోడ్ ట్యాంకర్ డ్రైవర్ తాళ్లపల్లి శ్రీనివాస్ (52)అక్కడికక్కడే లారీలో ఇరుక్కుని తీవ్ర గాయాలు అయి మృతిచెందాడని ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు కాసిపేట మండలం పల్లంగుడా గ్రామానికి చెందిన వాడని, తన లారీ దేవపూర్ లో లోడ్ చేసుకొని మహారాష్ట్రలోని నాందేడ్ కు వెళ్తుండగా లక్షెట్టిపేట వైపు నుండి మంచిర్యాల వైపు వెళ్తున్న సంతూర్ సబ్బుల లోడ్ తో వెళ్తున్న లారీ ఎదురుగా ఢీకొట్టడం జరిగిందన్నారు. ఈప్రమాదంలో రెండు లారీలు నుజ్జు నుజ్జు అయి రోడ్డుపైనే ఉండటంతో రాత్రి సుమారు 3గంటలపాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. లక్షెట్టిపేట సీఐ రమణ మూర్తి,ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి రెండు క్రేనులు,జేసిబి ల సహాయంతో లారీల్లో ఉన్న డ్రైవర్ శ్రీనివాస్ మృతదేహాన్ని బయటకు తీశారు.రోడ్డుపై నుండి లారీలను తొలగించి వాహనాలకు లైన్ క్లియర్ చేసారు.ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సచిన్ కుమార్ కి కూడా గాయాలు అయ్యాయి. మృతుడు శ్రీనివాస్ భార్య తాళ్లపల్లి విజయ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ జూన్ 26 :** ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో నిర్మితమవుతున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి కృషి.

### షాపులు కోల్పోతున్న వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆలోచన చేస్తుంది.

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని 13, 14, 15, 16వ వార్డులలో సైడ్ డ్రెయిన్, సీసీ రోడ్లు మరియు సిసి కల్వర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే పరమావధిగా ముందుకు పోతున్న అని తెలిపారు. వేములవాడ పట్టణంలో 34 కుల సంఘ భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించామని బహుశా వేములవాడ పట్టణంలో ఇంత పెద్ద ఎత్తున కుల సంఘాలకు నిధులు ఎవరు కూడా ఇవ్వలేదని తెలిపారు. సంతోష్ నగర్ లో మహిళలు బతుకమ్మ తెప్ప నిర్మాణం చేపట్టాల్సిందిగా కోరగా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గతంలో మంచినీటి సరఫరా కోసం ఇదే కాలనీలో 15 కోట్లతో మంచినీటి ట్యాంక్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వేములవాడ పట్టణములో రాజన్న ఆలయ అభివృద్ధి రోడ్ల వెడల్పు పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు వెడల్పులో కొంతమందికి ఇబ్బంది కలుగుతుందని దాన్ని పట్ల బాధ ఉందని అన్నారు. రోడ్డు వెడల్పు ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న కార్యక్రమం కాబట్టి నిర్వాసితులతో మాట్లాడి ముందుకు పోవడం జరిగిందన్నారు. దుకాణాలు కోల్పోతున్న వారి కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆలోచనలు చేస్తుందని పేర్కొన్నారు. త్వరలోనే రాజన్న ఆలయ అభివృద్ధికి 76 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తికావస్తున్నట్లు తెలిపారు. పది సంవత్సరాలుగా పేద ప్రజలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో ఏ ఎన్నిక వచ్చిన మీ మద్దతు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి అందజేయాలని పిలుపునిచ్చారు. అందరి ఆలోచనలు కనుగుణంగా వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ సునీత రాజ్ కుమార్ విడుదల



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 26 జూన్ 2025**పుప్పాలగూడ మాజీ సర్పంచ్ సునీత రాజ్ కుమార్ ను 2025 జూన్ 20 శుక్రవారం రోజున అరెస్టు చేయడం బుధవారం రోజున బెయిల్ మంజూరు కావడంతో విడుదల కావడం జరిగినదని, ఇట్టి అరెస్టు పూర్తిగా రాజకీయ కక్షతో జరిగినది మాత్రమేనని స్థానిక ప్రజలు అభిప్రాయం వెళ్ళిబుచ్చారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న కక్ష పూరిత రాజకీయాలు పుప్పాలగూడ, మణికొండ మునిసిపాలిటి పరిధిలోకి చేరి నాంది పలికినాయనీ అనడానికి ఈ సంఘటన నిదర్శనమని బీ.ఆర్.ఎస్ పార్టీ స్థానిక నేతలు తెలుపుతూ, గడిచిన 5 సంవత్సరములలో మణికొండ పురపాలక సంఘం మాత్రం కాంగ్రెసు బీ.జే.పీ కూటమి కలసి కట్టుగా ఏలుబడి చేసిన విషయం జగమెరిగిన సత్యం కాగా, బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్రంలో 9 సంవత్సరములు అధికారంలో ఉన్నప్పటికీ కక్ష పూరిత రాజకీయాలకు అవకాశం ఇవ్వకుండా కేవలం ప్రజా ప్రయోజనాలకు పెద్ద పీట వేసి ఘనత సాధించినది. ఈ రోజు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందుకు విరుద్ధముగా ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో త్రొక్కి ప్రజా ప్రయోగాలను కాలరాస్తు అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయ వికృత క్రీడను చూస్తూ ఆనంద పడుతున్నారు. అట్టి క్రియలను ప్రోత్సహిస్తూన్న వారిని బీ.ఆర్.ఎస్ పార్టీ గులాబీ దళ సైనికులుగా తప్పకుండా ఎదిరిస్తామని, రాబోయే కాలంలో కేసులకు భయపడకుండా ముందుకు సాగుతామని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ముక్త కంఠంతో తెలియ పరుస్తూ అధికార పార్టీలకు అడుగులకు మడుగులు వత్తే అధికారుల పట్ల సమయం వచ్చినప్పుడు తప్పకుండా తమ సత్తా ఏమిటో చూపిస్తామని బి.ఆర్.ఎస్ శ్రేణులు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా తప్పదు

## పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటేల్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి( జూన్ 26 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ నియోజకవర్గం లోని పుల్కల్ మండల కేంద్రంలో పుల్కల్ ఎస్సై క్రాంతి కుమార్ పాటిల్ వాహనాలు తనిఖీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనదారులు తమ వాహనాలకు, సంబంధించిన పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని, అలాగే మద్యం సేవించి తమ వాహనాలను నడపరాదని, అలా నడిపినచో వారిపై జరిమానాలతో పాటు, కేసులు కూడా నమోదు చేస్తామని, వారు అన్నారు, అంతేకాకుండా, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా, తమ విలువైన ప్రాణాలు, గాలిలో కలిసిపోతున్నాయని, దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని వారన్నారు, ఇలాంటి ప్రమాదాలను అరికట్టేందుకే, వాహనాలను తనిఖీ చేస్తున్నామని అన్నారు, కావున వాహనదారులు ఇట్టి విషయాన్ని గుర్తుంచుకోవాలని, తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని, ఆయన తెలిపారు, ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు......

# సమాజంలో కుల వివక్షత అవమానాలు

## రూపుమాపడం విద్యతోనే సాధ్యం

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూన్ 26 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా: సమాజంలో కులవివక్షత అవమానాలు రూపుమాపాలంటే, విద్యతోనే సాధ్యమని, తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ భక్కీ వెంకటయ్య,అన్నారు, సంగారెడ్డి జిల్లా అందోల్ లో ఆయన పర్యటించి, గురుకుల పాఠశాల తో పాటు, సుల్తాన్పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను, ఆకస్మిక సందర్శించి, విద్యార్థులకు అధికారులకు పలు సూచనలు చేశారు, దేశంలో రాష్ట్రంలో విద్య అనేది చాలా ముఖ్యమని, విద్యతోనే దేశాన్ని జయించవచ్చని పేర్కొన్నారు, సమాజంలో కుల వివక్షత, అవమానాలను రూపుమాపాలంటే, చదువు ఒకటే మార్గం అని తెలిపారు, ఎస్సీ ఎస్టీ లకు ఎక్కడైనా సమానమైన గౌరవం ఇవ్వాలన్నారు, ముఖ్యంగా తెలంగాణలో ఆకలి అయిన భరిస్తారు గానీ, ఆత్మగౌరవం దెబ్బతింటే ఎవరు భరించలేరని తెలిపారు, ఎస్సీ ఎస్టీ సమస్యల కేసుల్లో, అధికారులు అలసత్వం వహిస్తే, చర్యలు తప్పవన్నారు, ఎస్సీ ఎస్టీ కేసుల్లో ఫిర్యాదుదారులకు, అన్యాయం జరగకుండా, ఎప్పటికప్పుడు రివ్యూ చేసి, అధికారులకు పోలీసులకు, ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తున్నట్లు, కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, చనిపోయారు

## హనుమాజీపేట గ్రామంలో ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ రూరల్ మండలంలోని హనుమాజీపేట గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం రోజున డాక్టర్ దివ్యశ్రీ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం మరియు ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఆరోగ్య పరీక్షల కోసం 59 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, రక్త పరీక్షలు మరియు ఎక్స్-రే కోసం వారిని వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిత, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ సురేందర్ రెడ్డి, టీబీ పర్యవేక్షకులు గంగమరాజు, ల్యాబ్ సూపర్వైజర్ నాగరాజు, ల్యాబ్ టెక్నీషియన్ ప్రకాష్, కౌన్సిలర్ సురేష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా యాంటీ డ్రగ్ డే ర్యాలీలు..

**డగ్ రహిత సంగారెడ్డి జిల్లా యే లక్ష్యంగా..**

**మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణాకు వ్యతిరేఖంగా నినాదాలు చేస్తూ అధిక సంఖ్యలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులు**

**యాంటీ డ్రగ్ డే ర్యాలీలో ముఖ్య అతిధిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఐ.ఎ.ఎస్**

**జిల్లా ప్రజలు,యువత ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై భావితరాలకు డ్రగ్ రహిత సమాజాన్ని అందిద్దాం.**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 26(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/జూన్ 26,** యాంటీ డ్రగ్ డే: మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనే లక్ష్యంగా జిల్లా కలెక్టరేట్ నుండి ఐబి కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు,అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించి, ప్రతి ఒక్కరూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఉండాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్ తెలియజేశారు,ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని, గంజాయి, డ్రగ్ బారినపడి యువత అందమైన జీవితాలు కోల్పోతున్నారని, అన్నారు. యువత మంచి లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాకారం చేసే దిశగా అడుగులు వేయలే కానీ డ్రగ్ బానిసలుగా మారకూడదని అన్నారు,ఈ అవగాహన కార్యక్రమాలను కేవలం యాంటీ డ్రగ్ డే వారోత్సవాలలో భాగంగా కాకుండా సంగారెడ్డి జిల్లా డ్రగ్ ఫ్రీ జిల్లాగా మార్చేవరకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, భావితరాలకు డ్రగ్ ఫ్రీ సమాజాన్ని అందించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి వంటి ఇతర మాడా ద్రవ్యాలను విక్రయించినా, అక్రమ రవాణా చేసినా, వినియోగించినట్లు గుర్తించినట్లైతే వెంటనే జిల్లా ఎస్-న్యాబ్ 8712656777 నంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించవలసిందిగా సూచించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న అన్ని విధ్యాసంస్థల యాజమాన్యాలకు విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు,అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఐఎఎస్.మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాను డ్రగ్ ఫ్రీ జిల్లా గా మార్చడంలో కృషి చేస్తున్న సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖకు అభినందనలు తెలియజేశారు,యాంటీ డ్రగ్ దే సందర్భంగా ర్యాలీకి హాజరైయన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు, డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అను నినాధంతో ప్రతిజ్ఞ చేస్తూ మీ చుట్టూ ప్రక్కల ఉన్న వారికి అవగాహన కల్పించాలని అన్నారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర శేఖర్, ఎక్సైజ్ ఎస్పీ నవీన్ చంద్ర, అదనపు ఎస్పీ ఎ. సంజీవ రావ్, డిఇఓ వెంకటేశ్వర్లు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థిని విద్యార్థులు, పట్టణ యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల దుర్వినియోగం పై విద్యార్థిని,విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.

**ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సీనియర్ సివిల్ జడ్జ్ సౌజన్య,**

**జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.**




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 26(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/జూన్ 26,యాంటీ డ్రగ్ డే ను పురస్కరించుకొని,సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియం నందు జిల్లా వెల్ఫేర్,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆద్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థిని,విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణ నిర్మూలనకై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్,మాట్లాడుతూ యాంటీ డ్రగ్ డే వారోత్సవాలలో భాగంగానే కాకుండా మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాను నియంత్రిస్తూ సంవత్సరం పొడవునా అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని,ఎస్పీ అన్నారు,మాదకద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే చెడు పరిణామాలను గుర్తించాలని,గంజాయి, డ్రగ్ బారినపడి యువత జీవితాలు కోల్పోతున్నారని,అన్నారు,యువత మంచి లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాకారం చేసే దిశగా అడుగులు వేయలే కానీ డ్రగ్ బానిసలుగా మారకూడదన్నారు,యువత అభ్యున్నతికి అవరోధంగా నిలుస్తున్నా గంజాయి, డ్రగ్ వంటి మాదకద్రవ్యాలను సమాజం నుండి సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు,జిలాల్లో గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ఏర్పాటు చేసిన, ఎస్-న్యాబ్ ద్వారా సత్ ఫలితాలను అందుకోవడం జరుగుతుందని, సంవత్సరం పొడవున జిల్లా వ్యాప్తంగా స్కూల్స్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు,జిల్లాలో ఎక్కడైనా గంజాయి వంటి ఇతర మాదకద్రవ్యాలను విక్రయించినా,అక్రమ రవాణా చేసినా, వినియోగించినట్లు గుర్తించినట్లైతే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా జిల్లా ఎస్-న్యాబ్ 8712656777 నంబర్కు ఫోన్ చేసి సమాచారం అందించవలసిందిగా సూచించారు,ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర శేఖర్, ఎక్సైజ్ ఎస్పీ నవీన్ చంద్ర, డిఇఓ వెంకటేశ్వర్లు, డియం హెచ్.ఓ డా.గాయత్రి వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది, విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బల్కంపేట అమ్మావారి కళ్యాణం

## ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానం

హైదరాబాద్బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణానికి రావాలంటూ మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు ఆహ్వానాన్ని అందజేశారు. ఈ మేరకు గురువారం వెస్ట్ మారేడ్ పల్లి లోని కార్యాలయంలో ఆలయ అధికారులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషకుమారి, ఆలయ ట్రస్టీ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఇూ మహేందర్ గౌడ్, సూపరింటెండెంట్ హైమావతి, అమీర్ పేట డివిజన్ ఃఖీూ అధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, వనం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే మన కర్తవ్యం

### సదాశివపేట మండల విద్యాధికారి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 26(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు సదాశివపేట మండలంలోని ప్రధానోపాధ్యాయులకు సెయింట్ ఆంథోనీ హై స్కూల్ లో సమావేశం నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు,ప్రతి పాఠశాలలోని ఉపాధ్యాయులు బోధించే తరగతి వారీగా వార్షిక విద్యా ప్రణాళిక తయారుచేసి, ప్రదర్శించాలని,మండలంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెరిగిందని, కృషి చేసిన ప్రతి ఒక్క టీచర్స్ కు పేరు పేరునా అభినందనలు తెలుపడం జరిగిందని,పాఠశాలలో మన ఊరు-మనబడి మరియు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ఇప్పటివరకు అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను వెంటనే తెలుపాలని, అక్షయపాత్ర ద్వారా లేదా వండి వడ్డించే మధ్యాహ్న భోజనం పాఠశాలలో తప్పకుండా విద్యార్థులకు మెన్యు ప్రకారం గుడ్లు మరియు రాగిజావను అందించాలని,విద్యార్థుల హాజరును ఆన్ లైన్ లో ప్రతిరోజు పంపాలని పాఠశాలలకు తీసుకొని వెళ్లిన పాఠ్యపుస్తకాలు,వర్క్ బుక్ మరియు యూనిఫాం వివరాలను ఆన్ లైన్ లో పూర్తి చేయాలని,బడి మధ్యలో మానివేసిన బాలికలను దగ్గరలో ఉన్న పాఠశాలలో,కేజీబీవీ లేదా రెసిడెన్షియల్ పాఠశాలలో చేరే విధంగా కృషి చేయాలని తెలుపడం జరిగిందని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.ఈకార్యక్రమంలో వివిధ పాఠశాలల హెచ్.ఎంలు, టీచర్స్,ఎంఆర్సి స్టాఫ్ మరియు సిఆర్పిలు పాల్గొన్నారని మండల విద్యాధికారి ఎన్.శంకర్ తెలిపారు.



## విద్యార్థులకు చదవడంపై నిత్యం అభ్యాసన చేయించాలి.

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

### మండేపల్లిలోని విద్యాలయాల్లో ఆకస్మిక తనిఖీ.





**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, తంగళ్ళపల్లి, ( ప్రజాబలం ),** విద్యార్థులతో చదవడంపై నిత్యం అభ్యసన ( ప్రాక్టీస్) చేయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తెలిపారు. గురువారం తంగళ్ళపల్లి మండలం మండేపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్వాడీలో చిన్నారులకు సంబంధించిన అన్ని వివరాల రిజిస్టర్లు సక్రమంగా నిర్వహిస్తూ, పౌష్టికాహారం అందించాలని ఆయన ఆదేశించారు.

పాఠ్యపుస్తకాలను చదివించి, విద్యార్థుల సామర్థ్యాలను, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న తీరును, వంటకాలను ఆయన పరిశీలించారు. 9, పదవ తరగతి విద్యార్థులకు గణితం, భౌతిక శాస్త్రం బోధించి, ప్రశ్నలు స్పందించి సమాధానాలు రాబట్టారు.

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ మీద వంట తయారు చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు చదవడం బాగా ప్రాక్టీస్ చేయించాలని సూచించారు. పాఠశాలలోనే కాకుండా ఇంటి వద్ద కూడా చదవడం ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు ఆయన సూచించారు. చదవడం, రాయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించి, విద్యార్థులకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యా బోధన అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. చిన్నతనంలోనే ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానికి అనుగుణంగా చదువుకొని లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో విద్యాలయంలోని ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుల వృత్తిహక్కులు నాయి బ్రాహ్మణులకే కేటాయించాలి

### కార్పొరేట్ సెలూన్ షాపులను వెంటనే తొలగించాలి

### నాయి బ్రాహ్మలను షెడ్యూల్ కులాల్లో చేర్చాలి

### నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్



**ఖమ్మం ప్రతినిధి జూన్ 26 (ప్రజాబలం)** ఖమ్మం ప్రజాసేవలో భాగంగా అనాదిగా సమాజంలో కుల వృత్తిని కాపాడుకుంటూ వస్తున్నటువంటి నాయి బ్రాహ్మణులకే తమ కులవృత్తి హక్కులు చెందేవిధంగా సహకరించాలని నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు యలమందల జగదీష్ ఆధ్వర్యంలో గురువారం మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఖమ్మం వచ్చిన సందర్భంగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈటెల్ రాజేందర్ మాట్లాడుతూ... కులవృత్తుల వారికి ఎల్లప్పుడూ బిజెపి తన సహకారం అందిస్తుందని, కులవృత్తులను కొల్లగొట్టే కార్పొరేట్ సెలూన్ లకు తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకమేనని అన్నారు రాష్ట్రవ్యాప్తంగా కూడా కులవృత్తులు చేతివృత్తులపై ఆధారపడిన వారికి తమ పార్టీ అండగా ఉంటుందని, కులవృత్తులకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసే కార్పొరేట్ సెలూన్ లకు తాము వ్యతిరేకమన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. నాయి బ్రాహ్మణులను షెడ్యూల్ కులాలలో చేర్చాలని, పేటెట్ హక్కు కల్పించాలని, జిల్లా కేంద్రంలో నాయి బ్రాహ్మణులకు భావన నిర్మాణం కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలని, కులవృత్తుల రక్షణకు ప్రత్యేక జీవో తీసి వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు

## ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల సూచిక బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి, బి ఆర్ ఎస్ వి.

### బుక్స్ మరియు అధిక ఫీజులతో తల్లిదండ్రులను వేధిస్తున్న పాఠశాలలు, పోతు అనిల్ కుమార్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడలోని బి ఆర్ ఎస్ వి నియోజకవర్గ నాయకులు పోతు అనిల్ కుమార్ ఒక పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలు బుక్స్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్నాయని, పాఠశాలలకు పర్మిషన్ లేకుండా, ఆటస్థలం, పార్కింగ్ వంటి ఇతర మౌలిక సదుపాయాలు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుస్తున్నాయని, వేములవాడ పట్టణ విద్యాధికారి బన్నాజీకి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఇప్పటివరకు ఒక్క పాఠశాల కూడా ఫీజు సూచిక బోర్డు, ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుల విద్య అర్హత బోర్డులను కూడా ఏర్పాటు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, కొన్ని పాఠశాలలు పేర్లకు చివరన తోక పేర్లతో అధిక ఫీజులు దండుకుంటున్నారని, మండల విద్యాధికారి పర్మిషన్ లేని పాఠశాలలను సీజ్ చేయని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని పోతు అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల దిలీప్, పర్వేజ్, శివ, సాయి, కుమార్, సాహిద్ లు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని ఇంటికి నోటీస్.

### మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు పేరు ఓటర్ లిస్ట్ నుండి తొలగింపు.

### రమేష్ బాబు భారత పౌరుడు కాదని హైకోర్టు ప్రకటించిన తీర్పుతో నిర్ణయం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పేరు ఓటర్ జాబితా నుండి తొలగించడానికి రెవిన్యూ శాఖ చర్యలు చేపట్టడం జరిగింది. ఇటీవల కాలంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన కీలకతీర్పు మేరకు చెన్నమనేని రమేష్ బాబు భారత పౌరుడు కాదని ప్రకటించిన నేపథ్యంలో ఓటర్ లిస్టులో పేరు తొలగించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు వేములవాడ పట్టణంలోని రెండవ బైపాస్ రోడ్డులో గల మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు నివాసానికి రెవెన్యూ శాఖ అధికారులు ఫారం-7 ప్రకారం నోటీసు ప్రధాన ద్వారానికి అంటించారు. రిజిస్టర్ పోస్టు ద్వారా పంపిన ఈ నోటీసులో ఓటర్ జాబితా నుండి ఆయన పేరు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో పేరు తొలగింపు పై రమేష్ బాబు వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే జూలై రెండవ తేదీలోగా సమాధానమివ్వాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ నోటీసులు తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఎన్నికల శాఖ ఆదేశాలతోనే జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ వెల్లడించింది. ఇంతవరకు ఈ వార్తపై చెన్నమనేని రమేష్ బాబు స్పందన వెలువరించలేదు.

## రోబ్లెక్స్ గేమింగ్ పై చర్యలు తీసుకోవాలి, జనసేన నేత కిరణ్ రాయల్

తిరుమల యాత్రపై రోబ్లెక్స్ కంపెనీ గేమింగ్ యాప్ సృష్టించి భక్తులను మోసగిస్తుందని జనసేన నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. భక్తుల సెంటిమెంట్ ను ఉపయోగించుకొని, సోషియల్ మీడియాలో నయా మోసాలు చేస్తోందని అన్నారు. సదరు కంపెనీపై అయన టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు కు పిర్యాదు చేసారు.తిరుమల మీద గేమ్ డిజిన్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు ను కోరారు. దీనిపై స్పందించిని ఛైర్మన్ వెంటనే చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులను అదేశించారు.తిరుపతి నుండి తిరుమల ప్రయాణం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి శ్రీవారి ఆలయం, దైవదర్శనం చేసుకొనే దృశ్యాలతో రోబ్లెక్స్ కంపెనీ యాప్ రూపొందించింది.ఛైర్మన్ మాట్లాడుతూ దైవ భక్తిని .అదను గాచేసుకొని డాలర్స్ రూపంలో అన్ లైన్ లో వసూలు చేసినట్లు మాకు ఫిర్యాదు అందింది. స్వలాభం కోసం తిరుమల దృశ్యాలతో అక్రమాలను పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

## పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే విడుదల చేయాలి.

### కనీస వేతనం10,000 రూపాయలు అమలు చేయాలి.

### జిల్లా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సిఐటియు డిమాండ్.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గత 6 నుండి 8 నెలల కాలానికి చెందిన మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, మెస్ చార్జీలు, కోడిగుడ్ల బిల్లులు, అలాగే గౌరవ వేతనం రాక మధ్యాహ్నం భోజన కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దాదాపు 18 నెలలు కావస్తున్న, పలు సందర్భాలలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు, నిరసనలు, వినతి పత్రాలు సమర్పించిన కూడా ఈ ప్రభుత్వం కార్మికుల విషయంలో నిమ్మకు నీరెత్తన్నట్లు వ్యవహరిస్తూ చోద్యం చూస్తుందని, మరి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనులకు, అనేక రంగాలకు నిధులు కేటాయిస్తున్న సందర్భంలో పాఠశాలలో విద్యార్థులకు ప్రతిరోజు ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మధ్యాహ్న భోజన కార్మికులు పెట్టుబడి పెట్టి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న కూడా మధ్యాహ్నం భోజన కార్మికుల విషయంలో బిల్లులు చెల్లించకపోవడం ఈ ప్రభుత్వాలకు సిగ్గుచేటుగా భావించడం జరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల, అప్పులు తెచ్చి విద్యార్థులకు వంట వండి పెట్టడం మా వల్ల కాదు అని చెప్పి అనేక మండల, గ్రామాలలో పని మానివేస్తామని చెప్పి ఆందోళన చేస్తున్నారని, అదే జరిగితే పిల్లల పరిస్థితి ఏమిటి అని, ఒక్కసారి ప్రభుత్వాలు ఆలోచించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని, ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కొని తక్షణమే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ఈ సందర్భంగా సిఐటియు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గురజాల శ్రీధర్ డిమాండ్ చేయడం జరిగింది.

# మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

## గంజాయి నిర్మూలనకై పోలీస్ శాఖ భారీ అవగాహన ర్యాలీ
## -బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ పిలుపు











**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూన్ 26:** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించాలనే గొప్ప లక్ష్యంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, మందమర్రి సర్కిల్ పోలీస్ ఆధ్వర్యంలో మందమర్రి పట్టణంలో "మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన ర్యాలీ"ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీని ఏసీపీ రవి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. మందమర్రి సింగరేణి గ్రౌండ్ నుండి మార్కెట్ మీదుగా సాగిన ఈ భారీ ర్యాలీలో సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, ఇతర సింగరేణి అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, యువత, రాజకీయ నాయకులు, మహిళలు, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. "మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోకండి" వంటి నినాదాలతో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించి ప్రజలలో చైతన్యం నింపారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ప్రతిజ్ఞ చేసి, "యాంటీ డ్రగ్ సోల్జర్స్"గా సంతకాలు చేశారు.

ఈ సందర్భంగా ఏసీపీ రవి కుమార్ మాట్లాడుతూ, "దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంది. అలాంటి యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై పురోగతికి, ఉజ్వల భవిష్యత్తుకు స్వయంగా అవరోధాలు సృష్టించుకోవద్దు. సమాజం నుండి మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. పోలీస్ శాఖ గంజాయి వంటి మత్తుపదార్థాల అమ్మకం మరియు వాడకంపై కఠినంగా వ్యవహరిస్తుంది," అని హెచ్చరించారు.

సింగరేణి జిఎం జి. దేవేందర్ మాట్లాడుతూ, "చెడు వ్యసనాల వల్ల యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకోవడమే కాకుండా, చట్టవ్యతిరేక కార్యకలాపాలలో చిక్కుకుంటున్నారు. ఈ మత్తు అనే మహమ్మారి నుండి మన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది," అని అన్నారు.

మందమర్రి సీఐ కె.శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, "సరదాగా మొదలయ్యే అలవాటే వ్యసనంగా మారి జీవితాలను నాశనం చేస్తుంది. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేయకుండా విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలి. గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనలో యువత భాగస్వామ్యం కావాలి," అని కోరారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఉపాధ్యాయులకు, యాంటీ-డ్రగ్ కమిటీలకు లేదా డయల్ 100, 1908 నంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఎస్ఐలు, సింగరేణి పర్సనల్ మేనేజర్, ఎస్ఓ టూ జీఎం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రగ్స్ కు దూరంగా ఉండాలి :: ఉన్నత స్థానాలకు ఎదగాలి

**భవిష్యత్తు తరాల కోసం డ్రగ్స్ రహిత సమాజం నిర్మించడమే అందరి లక్ష్యం.**
**యాంటీ డ్రగ్ డేలో భాగంగా విద్యార్థులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ.**
**హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి. గితే, అధికారులు**
**పోటీల్లో విజేతకు బహుమతుల పంపిణీ**




**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూన్ - 26(ప్రజాబలం ప్రతినిధి)** విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా మత్తుపదార్థాల నిర్మూలన వారోత్సవాలలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గితే, విద్యార్థులు, పోలీస్ అధికారులతో కలిసి గురువారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ నుంచి పద్మనాయక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ తీశారు. ప్రజలను ఆకట్టుకుంటూ ఆలోచింపచేసేలా ఉన్న గంజాయి రహిత సమాజం%-%మనందరిబాధ్యత - డ్రగ్స్‌కి నో చెప్పండి - ఆరోగ్యమే అసలైన సంపద వంటి ప్లకార్డ్స్, నినాదాలు చేశారు. డ్రగ్స్,గంజాయిని నిర్మూలించేందుకు బాధ్యత గల పౌరులుగా వ్యవహరించి డ్రగ్స్,గంజాయి నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని ప్రజలు,యువతకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి పక్కా ప్రణాళిక ప్రకారం చదువుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ ను వినియోగించి సమాజానికి ఇబ్బంది కలిగించే పౌరులుగా మారవద్దని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగంతో మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతింటాయని రాను రాను ఆరోగ్యం క్షీణిస్తుందని వివరించారు. డ్రగ్స్ వినియోగంతో శారీరకంగానే కాకుండా మానసిక ఇబ్బందులు, సామాజిక రుగ్మతలు తలెత్తుతాయని తెలిపారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డ్రగ్స్ తో కలిగే నష్టాలపై అవగాహన ఉండి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కు దూరంగా ఉంటూ ఉత్తమ సమాజ నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ విద్యార్థులు, యువత తమ పరిసరాలు, విద్యాలయాలు ఇతర చోట్ల ఎక్కడైనా డ్రగ్స్ వినియోగించినా.. విక్రయించినా.. తరలించనా తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. డ్రగ్స్ రహిత సమాజంతో మన రాష్ట్రం అలాగే దేశం ఉన్నతంగా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు యువత డ్రగ్స్ కు దూరంగా ఉంటూ యాంటీ డ్రగ్ సోల్జర్ గా మారాలని ఆకాంక్షించారు. యాంటీ డ్రగ్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన ఇతర పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలను కలెక్టర్, ఎస్పీ తదితరులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులు అంతా కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో వివిధ పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించారు. విద్యార్థులు గీసిన చిత్రాలు.. తయారు చేసిన పెయింటింగ్ లను చూసి కలెక్టర్, ఎస్పీ వారిని అభినందించారు. అలాగే యాంటీ డ్రగ్ డే సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పై కలెక్టర్, ఎస్పీ, అధికారులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సి.ఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, నతేష్, మధుకర్, నాగేశ్వరరావు, ఆర్.ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి, ఎస్.ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతిఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఆరుగురు స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ. 6లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ అధికారులు గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 04/2017 కేసులో ఆరుగురు ముద్దాయిలు అరెస్టయ్యారు. వీరు తిరుపతి జిల్లాకు చెందిన చాంద్ బాషా, అవినాష్, మర్రిచెట్టు నాగరాజు, ధనశేఖర్ ఎలియాస్ ధనంజయులు, వరదరాజులు ఎలియాస్ వరదయ్య, మూడే నాగరాజు ఎలియాస్ గుడుంబా నాగరాజు ఎలియాస్ నాగరాజు నాయక్ కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ కరకంబాడీ ఫారెస్ట్ బీటు, టీఏన్ పాలెం సెక్షన్ ఎస్వీఎంపీ తిరుపతి రేంజ్ లో పట్టుబడ్డారు.

## గోశాల నూతన సిబ్బందికి నియామక పత్రాలు అందజేత.

**శుక్రవారం నుంచి విధులలోకి రావాలని ఆదేశం.**
**కోడెల కోసం పచ్చి గడ్డి పెంపకం స్థలాల పరిశీలన.**
**జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి.**



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి సంబంధించిన గోశాలలో పనిచేయడం కోసం నియమించిన సిబ్బందికి నియామక పత్రాలు పంపిణీ చేశారు. వేములవాడ శ్రీ రాజరాజస్వామి ఆలయ ప్రాంగణంలో 40 మంది కి గాను గురువారం రోజు 38 మంది సిబ్బందికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న సిబ్బంది శుక్రవారం నుంచి విధులకు హాజరుకావాలని సూచించారు.

వేములవాడ పరిధిలోని హనుమక్క పల్లి లో 25 ఎకరాలు, మర్రిపల్లిలో 40 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయించారు. అట్టి భూమిలో కోడెల కోసం పచ్చి గడ్డి పెంచాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి కి కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సూచించగా, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం , తాసిల్దార్లతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గురువారం హనుమక్కపల్లి, మర్రిపల్లి గ్రామాలలో కేటాయించిన స్థలాలను పరిశీలించారు.

## చిన్న బోనాల గురుకుల కళాశాలలో డిజిటల్ పేమెంట్స్, సైబర్ నేరాల పైన అవగాహన కార్యక్రమం.



**రాజన్న సిరిసిల్ల, ( ప్రజాబలం),** గురువారం రోజున టీ జి ఎస్ డబ్ల్యూ ఆర్ గురుకుల కళాశాల చిన్న బోనాల నందు డిజిటల్ పేమెంట్స్ మరియు సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారి జయరాజ్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను సులభంగా డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా చేసుకోవచ్చుని, యూపీఐ పేమెంట్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం లావాదేవీలను వినియోగించుకోవాలని అన్నారు. అలాగే వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ బెట్టింగ్ ఆప్స్, లెండింగ్ యాప్స్, ఫేక్ వెబ్సైట్లు, డిజిటల్ అరెస్ట్ వంటి సైబర్ నేరాల బారిన పడకుండా అన్ని రకాల లావాదేవీలు అప్రమత్తంగా ఉండాలన్న అన్నారు. సైబర్ నేరానికి గురి అయితే 1930 కి కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ అధికారులు అబ్దుల్ రెహమాన్, జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి మల్లికార్జున్, కళాశాల ప్రిన్సిపాల్ జస్మిన్ తెరిసా, హార్దిక అక్షరాస్యత కౌన్సిలర్స్ పాల్గొనడం జరిగింది.

## మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

సిద్దిపేటమాదకద్రవ్యాల బారిన పడి ఎవరు కూడా వారి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోకూడదని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సిద్దిపేట ఓల్డ్ బస్ స్టాండ్ వద్ద గల అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ. మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు అవగాహన కల్పించే దిశగా 1987 లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకోని, ప్రతి సంవత్సరం జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక నిరోధక దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలవకుండా వారి జీవితాన్ని ఉన్నత మార్గంలో పయనించేలా చేసుకోవడంతో పాటు వారి స్నేహితులు, శ్రేయోభిలాషులు కూడా సన్మార్గంలో పయనించేలా చేయాలని పిలుపునిచ్చారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com